ఆగష్టు 1960

నవభారతి



సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

మూల్యం : రూపాయి

నవభారతి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

తృతీయ వర్ష ప్రారంభ సంచిక

7 ఆగస్టు 1960

మూల్యం : రూపాయి

నవభారతి కార్యాలయం

టెలిగ్రామ్స్ : నవభారతి   టెలిఫోన్ : 482

గాంధీనగరం * విజయవాడ-2

విషయసూచిక

చిత్రములు

నవభారతి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

సంపుటి 3 | విజయవాడ * ఆగస్టు 1960 | సంచిక 1

గాంధీ మహాత్ముని సత్యదీక్ష

శ్రీ చంద్రశంకర్ శుక్లా

గాంధీజీ జీవిత నిర్మాణానికి సత్యం అనేది పునాది. ఆయన ఆత్మకథ సరళ గంభీరమైన భాషలో ఉన్నది. బాల్యంనుండే ఆయనలో జీర్ణించుకునిపోయిన ఈసత్యసంధత ఆగ్రంథంలో అడుగడుగునా మనకు ప్రత్యక్షమవుతుంది. ఈసత్యవ్రతమే ఆయనకు ఆదర్శం, ఆచరణయోగ్యం. అయితే సత్యం-అంటే, సత్యంగా ఉండాలనీ, సామాన్యంగా దాని అర్థం అదేకాబట్టి-మనం దానిని అలా అర్థం చేసుకుంటే సరిపోతుందనీకాదు. 'న్యాయంగా ఉండడమే ఉత్తమమార్గం'అన్న నీతి ఉన్నదనుకోండి. న్యాయంనుండి మనం వేరైపోతే అది ఉత్తమ మార్గం కాదు. అలాగే ఇక్కడ-సత్యం అనే దానిలో, ఏమైనాకానీ, మిన్నువిరిగి మీదపడనీ-సత్యం అనే సూత్రమే మన జీవితాన్ని పాలించితీరాలి-అన్న భావం ఇమిడి యున్నది.

ఈసూత్రం తాలూకు ఉపసిద్ధాంతాలలో ఒకటి గాంధీజీ దృక్పథంలో మనకు దృగ్గోచరమవుతుంది అది ఇది: ఏపరిస్థితిలోనయినా కానీ-మనం ఒకటి 'అవును' అని అనుకున్నప్పుడు 'అవును' అనాలి. 'కాదు' అనుకున్నప్పుడు 'కాదు' అనాలి. అంతే.

గాంధీజీ నైతికవిలువలకు సంబంధించిన పథకంలో మరొక ఉపసూత్రం అత్యంతప్రాధాన్యత వహిస్తుంది. అది ఇది: ఏక్షణంలోనయినా సరే-ఆలోచన, మాట, పని;-ఈమూటికీ ఒకఐకమత్యం, లేకపొందిక, లేక సహకారం-అనేదిఉండాలి. ఇది ఆయన అన్నమాట. దీనిని విశ్వవ్యాప్తంగా ఆచరణలో పెట్టాలనికూడా ఆయన సంకల్పం. అంటే-లోపల అనుకునేది ఒకటీ, పైకిచెప్పేది మరొకటీ, తీరాచేసేది ఇంకొకటీ-ఇదే అసత్యం. ఇంకా విడమర్చి చెప్పాలంటే-'కాదు' అని అనుకుని'అవును' అని చెప్పడం, ఒకమాట అనడం-దానిని నిలుపుకోలేక పోవడం, మనస్సులో పుట్టెడు కల్మషం పెట్టుకుని పైకితీయటి మాటలు మాట్లాడడం, ఒకమనిషినేమో ఎదురుగా పొగిడి, అతనలా ముఖంత్రిప్పగానే అతన్నిగురించి అపఖ్యాతికరంగా ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం,బయటకేమోపస్తులుండడం,లోపలనేమోచక్కటిరాజభోజనం ఎప్పుడొస్తుందా అని నిరంతరం నిరీక్షిస్తూ ఉండడం,-ఒకవిషయాన్ని నింద్యమనిఅనుకుంటూనే దానిని చెయ్యడం-ఇవన్నీకూడా మనోవాక్కర్మలు-మూడింటికీ ఒకదానికొకటి పొందికలేవని చెప్పడానికి ఉదాహరణలు. కాబట్టి అసత్యం, అంటే ఇదే, ఇదిఒకదుష్టమానవుడి లక్షణం.

మనోవాక్కాయకర్మలకు పొందిక లేకపోవడాన్ని భగవద్గీత నిషేధిస్తున్నది.

"కర్మేంద్రియాణి సంయమ్య య ఆస్తే మనసాస్మరన్
ఇంద్రియార్థాన్ విమూఢాత్మా మిథ్యాచారస్స ఉచ్యతే"

(గీత-అ.౩,శ్లో౬)

ఎవడు కర్మేంద్రియాలను నిగ్రహించి, విషయాలను మనస్సుచేతస్మరిస్తూఉంటాడో, అలాంటివాడు వివేకశూన్యుడై, అంతఃకరణజయంలేనివాడై, విషయాసక్తుడై ఒకటి ఉద్దేశించి మరొకవిధంగా నడుస్తాడు. అలాంటివాడు మిథ్యాచారుడు (Hypocrite) అని దీనితాత్పర్యం.

ఈఅనైక్యత మానవుడి వ్యక్తిత్వాన్నే దెబ్బకొట్టి-అతనికి మనశ్శాంతి, సుఖం లేకుండాచేస్తున్నది. "చైతన్యజగత్తులో ఈ అనైక్యత మనకాలానికి ఒకవిపరీతమైన విచిత్రస్వభావం-" -అని పేర్కొన్నాడు ఒక ఆధునిక విజ్ఞానవేత్త – "మనకార్యం కనుక ఒక సరియైన గమ్యంవైపు సాగిపోతున్నట్లయితే – మన మానసిక దైహిక వృత్తులన్నింటికీ కూడా ఒక సంపూర్ణమైన సఖ్యత ఏర్పడుతుంది. వాంఛలన్నీ ఏకరీతిగా ఉండి, మనస్సుకనుక ఒకేఒక విషయంకోసం పనిచేసినట్లయితే-ఒకవిధమైన చిత్తశాంతి లభిస్తున్నది." అనిచెప్పాడు.

"ఏమాత్రం దాపరికంలేకుండా మనజీవితాలన్నింటిని ఒకే ఒక ముద్దకట్టేటట్లు చెయ్యడం చాలాగొప్పవిషయం అని నేను భావిస్తున్నాను" – అన్నాడు డీన్ ఇంజ్. అభేదమైన జీవితావశ్యకతను గురించీ, ఆత్మపరిపూర్ణత్వాన్నిగురించీ, శాశ్వతమైన ఆత్మానుభవాన్నిగురించీ – రాధాకృష్ణ పండితుడు నొక్కిచెప్పాడు.

"మీరు ఎలాఉన్నారో అలాగే అగుపించండి. అంతేకాని 'వీళ్ళు పైకికనపడి నట్లుగా ఉండరు' – అనిమాత్రం అందరిచేతా అనిపించుకోకండి" – అనిగాంధీజీ-స్త్రీపురుషులను పదేపదే హెచ్చరిస్తూవచ్చాడు. ఇలా ఆడంబరం, నటన – ఏమీ లేకుండా స్వభావసిద్ధంగా కనుపించడం – సత్యసంధతలో ఒక భాగమని ఆయన ఉద్దేశ్యం.

సత్యంకోసం జీవితాన్ని అంకితంచేసిన గాంధీజీ, తనతో పనిచేయడానికి కొందరిని ఆహ్వానించినప్పుడు – ఆయన సత్యదీక్షలో కొన్నిచిక్కుప్రశ్నలు తలఎత్తాయి. అవి ఆలోచిస్తే నిజంగా జ్ఞానోదయం అవుతుంది. బాల్యంనుండీ ఆయనకు సత్యం పట్ల అపారమైనభక్తి. అదిఆయనకొక వెర్రివ్యామోహంగా ఉండేది. ఏమైనా కానీ-దాన్ని విడిచిపెట్టేవాడుకాదు. సత్యం చెప్పడమనేది ఆయనకు స్వభావం అయి పోయింది. అందువల్ల నోటితో అబద్ధంఆడుదామనుకున్నా – అది ఆయనవల్లఅయ్యేది కాదు. సత్యం చెప్పడమనేది ప్రతిఒక్కరి ఆత్మకు సంబంధించిన విషయం. ఆయన దృష్టిలో ఇది అద్వితీయమైనది. ఇహ ఈ విషయంలో మినహాయింపులుగాని, క్షమాపణలుగానీ – ఏమీలేవు. ఒకమాటు మిసెస్. పోలక్ ఒక సంఘటననుగురించి చెప్పింది. ఒక స్నేహితురాలు గాంధీజీతో అబద్ధంఆడి ఆయనను మోసగించింది

మిసెస్. పోలక్ పట్ల ఆయనకుగల సదభిప్రాయం అలాగే ఉండిపోవడంకోసం అలా చేసింది. పోనీలెండి ఏదో పొరపాటుచేసింది - అని మిసెస్. పోలక్, గాంధీజీని ప్రార్థించింది. అప్పుడు గాంధీజీ - చాలా విచారంగా - "నిజంచెప్పినన్ను నమ్మించ డానికి మారుగా ఆమె అబద్ధంచెప్పింది. కాని నీవు ఆమెకోసం ఇలా క్షమాపణలు వేడుకోవడం బాగాలేదు" - అన్నాడు. గాంధీజీ జీవితంలో, అనేక సందర్భాలలో ఆయన సత్యదీక్ష ప్రత్యక్షమవుతూవచ్చింది. ఎవరైనా తప్పుచేస్తే - ఆయనముఖం చూచి తప్పుఒప్పుకొని నిజంచెప్పేవారు. దానివల్ల ఏపరిస్థితి ఉత్పన్నమయినా సరే దానిని ఎదుర్కోవడానికి సంసిద్ధులయ్యేవారు. ఇలా చెయ్యమనే, ఆయన కోరే వాడు. సత్యంచెప్పడం జీవితంలో చాలాదగ్గరి త్రోవ అని ఆయనవిశ్వాసం. - "అబద్ధం మోసం; చాలాకాలానికి దుర్భరమైన కష్టాలపాలు చేస్తాయని, ఇహ ఆకష్టాలకు అంతుఅనేది ఉండదనీ-థామస్ హార్డీ బొమ్మగీచినట్లుగీచిచూపాడు. ఆయన నవలలు అనేకవాటిల్లో ఒకచిన్న అబద్ధమే విషాదం అంతటికీ బీజం అవుతుంది. సత్యం, మొదట్లో అనేకకష్టాలకూ నష్టాలకూ గురిఅయినట్లుకనుపించినప్పటికీ-వాటిని భరిస్తూపోతే, ఆతరువాత వచ్చేవిషవిషాదభరితమైన బాధలనుండి అది కాపాడుతుంది- ఈవిషయం హార్డీతనరచనలలో రుజువు చేసిచూపాడు.

అసత్యం అనేది తరచుగా భయంవల్ల ఉత్పన్నమవుతుందని గాంధీజీ అభిప్రాయం. 1921 వేసవిలో ఆయన కొద్దిసేపు నాతోముచ్చటించాడు. సత్యం చెప్పడం అసిధారావ్రతంలాంటిదనీ, అది నెరవేర్చడానికి మానవుడు, మానవులను చూచి భయపడడంకంటే భగవంతునికి భయపడడం అవసరమనీ చెప్పాడు.

1932లో ఎరవాడ సెంట్రల్ జైలులో మామిడిచెట్ల క్రింద ఉన్నాంమేం. అప్పుడునాకు జరిగిన అనుభవం ఒకటి గాంధీజీకి తెలియచేశాను. అప్పుడాయన "మీనే రాన్ని రుజువుచేసే అపత్రాన్ని మీఅంతటమీరే నిస్సంకోచంగా, మిమ్మల్ని ప్రశ్నించిన ఆపోలీసు ఉద్యోగికి చూపియుండవలసింది. -" అనిచెప్పి ఆసందర్భంలో ఒక కథ చెప్పారు. మహమ్మదీయుడైన ఒక మహాభక్తుడు ప్రయాణంచేస్తూ ఉంటేత్రోవలో ఒక దొంగలముఠావచ్చి అతన్ని దోచుకున్నది. దొంగలు అతని వస్తువులన్నీ సోదాచేశారు. కాని వారికి ఏమీచిక్కలేదు. వారునిరాశచెంది వెళ్ళిపోతున్నారు. అప్పుడలా వెళ్ళిపోతున్న దొంగలను ఆభక్తుడు పిలిచాడు. వాళ్ళుఅతని దగ్గరికి వచ్చారు. అప్పుడు భక్తుడు, వాళ్ళు తనను సోదాచేసినప్పుడు కనిపించకుండా దాచియుంచుకున్న బంగారు మొహిరిలు బయటికితీసి ఆదొంగలకు చూపించాడు. అతనిలా చేయడంవల్ల ఆదొంగలకు హృదయపరివర్తన కలిగింది.

ఆతరువాత ఒక ఏడాదికి గాంధీజీ నాయకత్వం క్రింద పనిచేసేభాగ్యం నాకు కలిగింది. ఆయన 'హరిజనయాత్ర' వెళ్ళారు. నేను ఆయన వెంటవున్నాను ఒక కుటుంబంవారిలో తగాదావచ్చి - ఇరుపక్షాలవారూ తమ తమ వాదనలు గాంధీజీ ముందుపెట్టారు. నాకూ చెప్పారు. ఇరుపక్షాలవారిలో ఒకరు - నాకు చెప్పిన దానికంటె గాంధీజీకి యెక్కువ రహస్యమైన విషయాలు చెప్పానని అంగీ

కరించారు. అప్పుడుగాంధీజీ- "చెప్పినమాటనిజమే. కాని అవి ఎవరికీ వెల్లడించవద్దని ఆ స్నేహితుడు కోరితే నేను మీకుఎలాచెప్పేది?" అన్నాడు నాతో. తనతో ఉండేవారందరికీ కూడా ఆయన ఇదేపాఠం బోధిస్తూ వచ్చాడు. ఆరోజుల్లో ఆయన వ్రాసినకాగితాలు చదవడానికీ ఆయన సంభాషణలు వినడానికీ మాకు అనుమతి ఇచ్చాడు. కాని మేం విన్నవీ, చదివినవీకూడా తన అనుజ్ఞ లేనిదో ఎవరికీ వెల్లడించ వీల్లేదని మరీ చెప్పాడు.

అయితే ఆయన ఉద్దేశ్యంలో ఈనియమానికి ఒక ముఖ్యమైన మినహాయింపు ఉన్నది. ఎవరైనా కీడుచెయ్యడానికి రహస్యంగా కుట్రపన్నినప్పుడు -దానిని-బయటపెట్టితీరవలసిందే. ఇందుకు తార్కాణంగా 1932లో జరిగిన ఎరవాడ ఒడంబడికను కూలద్రోయడానికి కొన్ని రహస్యమైన తీర్మానాలు జరుగగా, వాటి నకలు ఒకదానిని క్రీ. శే. శ్రీ ఎం. సి. రాజా 1935లో గాంధీజీకిపంపాడు. గాంధీజీ, ఆతీర్మానాలు వ్రాసినవారి అనుమతి తీసుకోకుండానే వాటిని ప్రచురించి-శ్రీరాజా చేసినపనిని సమర్థించడమేకాక-ఇందులో ఆయనచూపిన అవిశ్వాసం ఏమీలేదనికూడా బహిరంగంగా చాటాడు.

గాంధీజీ స్వయంగా అనేకములైన శపథాలు తీసుకుని, ఎన్నిఅవాంతరాలు వచ్చినా వాటిని తు. చా. తప్పకుండా అమలుజరిపాడు. "ప్రతిజ్ఞ చేస్తేదాన్ని నెరవేర్చి తీరాలి. ఆరునూరయినా సరే." అంటాడాయన. అయితే ఆయన ఒక విషయం విస్పష్టంచేశాడు. ప్రతిజ్ఞ తీసుకోవడమంటే ఒకమంచిపని చెయ్యడం కోసంకాని చెడుపనిచెయ్యడం కోసం కాదు. పాపకార్యం చెయ్యటం కోసం ఎన్నడూ ప్రతిజ్ఞ తీసుకోకూడదు. తెలియక తీసుకుంటే అదిఒక పాపం కోసమో, లేక చెడుపనికోసమో ఉద్దేశించబడినదని తెలిసిన తరువాతనయినాసరే ఆప్రతిజ్ఞను భంగంచేసుకోవాలి. ఈవిషయాన్నే షేక్స్‌పియర్ మహాకవి ఒక పాత్రద్వారాచెప్పించాడు.

సత్యదీక్షకు కట్టుబడియున్న గాంధీజీ, ప్రతిపనీ బాహాటంగా చెయ్యడమే మంచిదని విశ్వసిస్తూ వచ్చాడు. శాసనోల్లంఘనం సాగినకాలంలోకూడా రహస్యపద్ధతులు అనుసరించడానికి ఆయన అంగీకరించలేదు. రహస్యమంటే భయమనిఅర్థం. ఇదీ ఆయన అభిప్రాయం. "రహస్యంలేకుండా పనిచేసేవారి సంఖ్య 330లేక 300లే ఉండనివ్వండి. ఫరవాలేదు. ప్రజల మధ్య, భయంలేని వాతావరణాన్ని సృష్టించాలి. అదేకావలసింది. అప్పుడే అహింస ద్వారామనం ప్రతిఘటించగలం. రహస్యసంస్థలద్వారా పనిసాగిస్తున్నప్పుడే శాసనాలు అవసరం కాని, ప్రజలుబాహాటంగా కారాగార శిక్షలు అనుభవించడానికి సిద్ధంగా ఉన్నప్పుడు కాదు ... ఆహా! ప్రభుత్వం కొన్ని సందర్భాలలో ఒక్క హైపుమిషన్ కూడా పట్టుకోలేకపోయింది!... ప్రజలను భీతిలేని వారినిగా చెయ్యడంకోసమే సత్యాగ్రహోద్యమం ఉద్దేశించబడింది. ప్రజలు అన్నిరకాలయిన బాధలకూ - తుపాకిగుండ్లకు, కారాగారశిక్షలకు కొరడా దెబ్బలకు సయితం సిద్ధంగా ఉన్నప్పుడు ప్రభుత్వం ఏంచేస్తుంది?" 1933 ఆగస్టులో చేసిన ఒక ప్రసంగంలో చెప్పాడాయన.

ప్రతికక్షితో త్వరగా సమాధానం కుదుర్చుకోడానికి సిద్ధపడటం గాంధీజీ సిద్ధాంతాలలో ఒకటి. ఈవిషయం స్పష్టంచేస్తూ లూయిస్ ఫిషర్‌తో గాంధీజీ ఇలాఅన్నాడు; "నేను ప్రధానంగా సమాధానపడేమనిషిని. ఎందుకంటే నాదేఒప్పుఅని ఎన్నడూ నేను నిశ్చయంగా చెప్పలేను." ప్రధానమైన విషయాలలో పట్టుబట్టి యుండడం, అప్రధానమైన విషయాలలో రాజీకిరావడం గాంధీజీ అనుసరించిన సూత్రాలలో ముఖ్యమైనసూత్రం. "అవును. జీవితమే ఒకసమాధానాలపుట్ట!" అన్నాడాయన. "అహింసఅనేది నిస్వార్థమైన ప్రేమతోకూడియున్నది. కనుక ఇలాసమాధానపడుతూ ఉండటం అవసరం. అయితే ఎవరికివారు ఆత్మశుద్ధిగా సహజంగా సమాధానానికి రావాలికాని మరొకరి ప్రోద్బలంవల్లకాదు." అని చెప్పాడుకూడా.

ఏమైనా ఇంతటి సత్యదీక్షతో ఉండడం మహామహులకుకూడా సాధ్యంకాదు.

విశ్వనాథ మధ్యాక్కఱలు

కుల (మా) స్వామి శతకము

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

౧

ఇంతటి వ్యర్థమై నట్టి దేహమ్ము నిచ్చి నానోగ్ర
సంతాపముల తోడ నేను బ్రదికి నీ సన్నిధి చేర
నంత తపంబు చేయంగనైన నీ యాజ్ఞ నాయాత్మ
ప్రాంత మానఁదమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

వేయి యంచును ద్రావ నూనె యంచును నెత్తిన పోయ
మాయురే కానైతి వింటి వేల్పవై మన్నింప నైతి
అ దే వెలుంగ వోరైన మన్నించు నవసర మేమి
రా యయ్యా నఁదమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

ఇది యెల్ల నాలోన నేను నాకోస మేడ్చెడి యేడ్పు
పదములుగాఁ గట్టి యేల యీరీతిఁ బాడుటో తెలియ
వదలని నీ పట్టుఁదలకు గుండియ బ్రద్దలై పోవు
సదయుడ! నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

ఒక దిగుల్ లోనుండి పుట్టి వదలక యుండగా వలయు
నొక తగుల్ నీవన్నఁ గలిగి వెర్రిగా నూగాడ వలయు
నకట తానదే కోటి జన్మముల చారితార్థ్యమ్ముసంవి
దకలంక నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

తగ పినిపిత తెచ్చినన్ బ్రతిష్ఠించెఁదాపీఁడు నన్ను
మొగమోట పెట్టు నంచితయని యనుకోఁబోకు వేనాడి
వగఁబూంచి యిరుకునఁ బెట్టి కొంత లాభము గుంజుకొనెడి
తగడ యా నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

స్వగృహే యటంచు సంకల్ప మందు భాస్వన్మూర్తి యేమి
స్వగృహం బటన్న వైరాగ్యమూ నెడు ప్రకృతి నాయదియు
నిగమాంత వేద్యుగా నెంతు నెచ్చటి నీవై నఁబెట్టు
నగచాట్లు నఁదమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

పరశివా! యీమేని తోడి నా యునికి పట్టించు కోఁకె
పరమహా నాగుండె లోని రాయిడి పాటింపు మయ్యా
పరుసనౌ నింద్రియ పటలి బొందుత్రిప్పలు వానివయ్యె
నరసినన్ నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

ఆ యింద్రియములు జీర్ణించు నప్పటి కాయింద్రియములు
చేయున దేమియు లేదయవ్వాని చింతయు లేద
రోయుదు నవిలేక వాని సంస్కృతి రూపమై యున్న
రాయిడి నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

అవనిజ మున్నచో దాని పుష్పఫలాపేక్ష యొకఁడె
యవని జనానికి ముండ్లై సర్వ లక్ష్యము సేతు వీవు
యప్పర! నీభావన నవసుమ ఫలాభమౌ మమ్ము
నవియింతు నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

ఉతిపైన బ్రదికి నన్నాళ్లు ఘణ్యంబు సేత ముఖ్యముగ
మతికి దీపించెడు పూర్వ కృత పుణ్య మహిమచే నిన్ను
స్తుతిచేయు మతిగల్గుఁగాన నీవచ్చు సుకృతా కృతివిగ
నతికెడు నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

నికరయు మేల్కొంట సూర్యచంద్రుల నియతి చేఁగలుగు
బ్రతుకు లోపలి సూక్ష్మములును శుక్రాది గ్రహముల వలన
నదియ కాలము కాలమీవ విడఁదీయ నలవి కానట్టి
బ్రమకిది నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

అనుభవించెడి భాగమేను చూచెడు నాభాగ్య మీవు
అనుభవించుట మాని వట్టి చూచెడు నట్లుచేయఁగదె
యనుభవ మేలయో యభవ నీచమ్ము ననుభవమేల
యభవ మై నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

దండితానేక పద్దైత్యత మరి చింతన లేకయుండ
కుండలలోన గుర్రాలు తోలుచు కూర్చుంటి నేను
గుండియలో దిగులొకటి కొండయై కూరుచున్నయది
యుండగా నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

వేళకుఁజేయుచు జపము నిన్ను భావించుచు నితర
వేళల నింతకు మించి సేయగా వేరేమి నేర
నోలిమైఁగృచ్ఛ్రిమ్ములు నుపవాసముల్ హోమముల్ నాకుఁ
గ్రాలవు నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

చీఁకటి యడుగున నెక్కడో వెల్గు చిన్నినొక్క వయి
కాక యెట్లుండువొక్కొ యగా ధాంధకారాంధువనను
పీఁకమై వెదుకగా మునిగి యుక్కిరి బిక్కిర య్యేద, ర
సాకార! నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

లౌకికంబగు నొక్క చిన్ని తృప్తికల్గఁగఁజేసి క్రోసు
దాఁక వెన్కకు జారెదవును గను చూపు దాటిపోవంగ
నీ కోసమై యాగి యాగి ప్రాణముల్ నిలచి పోయెదు,ము
దాకార! నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

ఇతర విషయ సన్నికర్ష మెప్పుడీ యెదకుఁగల్గెడినో
మతిచలించుచు నుండె నప్పుడందు నే మమతయక్కలయు
ఇతవశ కుండనే మదికి సహజంబు చాంచల్యమిట్టు
లతికితి, నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

ఎదలోన ప్రేమంపు టూహా యుదయ మందెదు నింతలో నీవు
నదవదల్ సేసిన ప్రేమస్మృతిపథంబున నంటె యీ ప్రేమ
పదములో నై నట్టి తీపి పాడవు వ్యర్థతా బుద్ధి
నదయుడ నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి !

మిక్కిలి నల్పమౌ సుఖము లోకగడ్డి మేటిగాఁగూర్చి
యొక్క యగ్నికణంబు తుదకు నంటింతు వున్ననిన్ని నాళ్లు
లొక్కొక్క సమిధగా వేయు దారిపోకుండ నేమందు
నక్కటా! నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

తెలివి యనంగ నీయదియ తెల్వి యంతికమునఁజేరు
పొలపముల్ పచరింతు వందలున్ వేలు మోహమ్ము పెంచి
మొలక నవ్వులతోడ దులపరించక పోయెదు తుదకు
నలయించి నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి !

నేటి సైన్సుకు అందని విజ్ఞానము

శ్రీ జటావల్లభుల పురుషోత్తము, ఎం. ఏ.

వేదము జ్ఞానవిజ్ఞానములకు మూలము; అది యనాది, అపౌరుషేయము.

ఆధునికయుగమున పాశ్చాత్యులుకాని, పాశ్చాత్య విజ్ఞానము నార్జించిన విఖ్యాత భారతీయ విమర్శకులుకాని వేదముయొక్క ఘనత నితర విధములుగా నంగీకరించినను దాని యనాదిత్వమును, అపౌరుషేయత్వమును అంగీకరించుటకు సంకోచించుచుండిరి. ప్రాచీన భారతీయవిజ్ఞానముపట్ల నూతన దృక్పథమును వహించి నవయుగములోని యితర విద్వాంసులకంటె విభిన్నమైన పద్ధతిలో వేదము నర్థముచేసికొన్న వ్యక్తి శ్రీ అరవింద యోగి. పాశ్చాత్యులకుకాని పాశ్చాత్యవిద్యా వాసితులైన భారతీయులకు కాని యెవ్వరికిని లేనంత గౌరవమీయనకు వేదముమీద కలదు. విశేషమేమన: మిగిలిన భారతీయపరిశోధకులందరికంటె నీయనయే హెచ్చుగా పాశ్చాత్యవిద్యా సంస్కృతులు గల్గినవారు. 22సంవత్సరముల వయస్సువఱకును చాలభాగ మీయన ఇంగ్లండుననేయుండెను. విద్యయంతయు నచ్చటనే సాగెను. తండ్రి పాశ్చాత్య సంప్రదాయములలో మునిగి తేలినవాడు. అట్టి స్థితిలో శ్రీ అరవిందకు భారతీయసంస్కృతి యందంత భక్తి గల్గుటకీ సంస్కృతియందలి సర్వాతిశాయి విజ్ఞానమే కారణము. వేదమంత్రములనుగురించి యీ యోగివర్యుడిట్లు నుడివియున్నాడు:

"వేదమంత్రములు మానవ బుద్ధితో నాలోచించి రచింపబడినవికావు. సత్యము ఋషుల హృదయమునుండి బయల్వెడలినది. అంతర్జ్యోతియే వేదము నావిష్కరించినది; ఆలోచనకాని బుద్ధికాని యావిష్కరింపలేదు. ఆతరువాతి కాలమువారు బుద్ధితో నాలోచించి గ్రంథములను రచించిరి. కావున వీరి యే గ్రంథమునుకూడ వేదమువలె దోషరహితమును, నిర్మల సత్యబోధకమును కాదు. వేదసంహితలలోని విషయముకంటె ఉపనిషత్తులలోనివిషయములుగభీరతరములని పాశ్చాత్యులు చెప్పినది సరికాదు. మంత్రభాగమునకు తర్వాతనే బ్రాహ్మణోపనిషత్తులకు స్థానమునీయవలయును. ఋషులు వేదరచయితలుకారు; మంత్రద్రష్టలు. వేదమపౌరుషేయము. (On the Vedas అను గ్రంథములో 11, 12, 13 పుటలు- మరియు Essays on the Gita, 12వపుట మున్నగు ననేక స్థలములలో కూడ శ్రీ అరవింద యీ భావములను వెల్లడించి యున్నారు.)

ప్రయోగము, పంచేంద్రియజ్ఞానముతో పరిశీలనము, అనుమానము-అను వాని వలన బయలు దేరిన సైన్సుకును, అంతర్జ్యోతినుండి యావిష్కారము పొందిన వేదమునకును గల భేదమును గురించి వేరుగ చెప్పనక్కరలేదు.

భారతీయ విజ్ఞానమునకు మూలమైన వేదము అతీంద్రియాపౌరుషేయ విజ్ఞానభరితమైన దగుటచే నిటీవలి కాలమున బయలుదేరిన విజ్ఞానమంతయు వానికి తక్కువదే యనునది ముఖ్యవిషయము. వేదకాలము నాటి విజ్ఞానము శైశవావస్థలోనుండెననియు, క్రమముగా విజ్ఞానాభివృద్ధి యాయెననియు పాశ్చాత్యులు మనకు బోధించిరి. మన విద్యాధికులు కూడ ననేకులీ బోధల ననుసరించియే గ్రంథములను రచించిరి. విజ్ఞానము యొక్క ప్రారంభావస్థయు, పరమావస్థయు కూడ వేదములలోనే యున్నదని గ్రహించుట భారతీయపద్ధతి. కడచిన నూరు సంవత్సరములలోను భారతీయ నాగరకతను. చరిత్రను గురించి రచించిన యాధునిక విజ్ఞానవంతులైన ప్రసిద్ధ రచయితలందరు ఇంచుమించుగ పాశ్చాత్యులు మనకు బోధించిన కాల ప్రయుక్తమైన క్రమవికాసమునందే విశ్వాసము గల్గియుండిరి. ఇటీవల కొందరు స్వతంత్రాలోచన శక్తిగల

భారతీయ రచయితలు. పాశ్చాత్యులు చూపిన దారినే నడువక వేదము యొక్క మహత్త్వమును గ్రహింప గల్గిరి. అట్టి వారిలో శ్రీ రాధాకుముదముఖర్జీ యొకరు. వీరి యీ క్రింది వాక్యములు గమనింపదగినవి. "విజ్ఞానము యొక్క ఆదినే కాక పరమావధినికూడ ఋగ్వేదము ప్రదర్శించుచున్నది." **(Indian P. E. N. March, 1942.)**

పంచేంద్రియ జన్యజ్ఞానముతో కూడిన ఆధునిక విజ్ఞానశాస్త్రములకు క్రమవికాసము కావలయునుకాని యోగ సమాధిస్థితిలో గ్రహింపబడిన శాస్త్రములకు క్రమవికాస ప్రసక్తి లేదు. క్రమాభివృద్ధి యగుచుండగా సమస్తజ్ఞానము ప్రకృతి శాస్త్రమునకు వశమగుననుకొనుటయు సరికాదు. భౌతిక వస్తు గుణములనుగూర్చిన పరిశోధనము క్రమముగా భౌతిక విజ్ఞానమునే గల్గింప గలదు కాని భౌతికాతీత విజ్ఞానమును గల్గింపజాలదు. ప్రాగ్దిశలోనున్న యొకపట్టణమును చేరవలయునన్నచో ప్రాగ్దిశగానే ప్రయాణమును సాగింపవలసియుండును అట్లు ప్రయాణము సాగించుచో నెప్పటికైనను ఆపట్టణమును పొందవచ్చును. అట్లే నిరంతర పరిశోధనము వలన సైన్సులు అదివఱకు అసాధ్యములనిపించుకొన్న భౌతిక జయముల నెన్నింటినో సాధింపవచ్చును. కాని యీ భౌతిక పరిశోధనము లెన్నటికిని ఆధ్యాత్మిక సత్యములవద్దకు మనలను కొనిపోజాలవు. ప్రాగ్దిశలోనున్న పట్టణమును చేరదలచువాడు దక్షిణముగా ప్రయాణము చేయుచో నెంతత్వరిత గతిని పోయినను ఎంతకాలమునకును, ఆ పట్టణమును చేరజాలడు. కావున, సైన్సు ఎంతమాత్రము వృద్ధిచెందియుండని ప్రాచీనకాలములో ఆధ్యాత్మిక విజ్ఞానము మహోన్నత శిఖరమును పొందియుంట కెవ్వరు ఆశ్చర్యము చెందనక్కఱలేదు. అట్లే సైన్సు ఉవ్వెత్తుగా విజృంభించియున్న కాలములో పరిపూర్ణాధ్యాత్మిక దారిద్ర్యమున్నను ఆశ్చర్యపడనక్కఱ లేదు. పంచేంద్రియాతీతమైన జ్ఞానముకాని శక్తికాని ఆధ్యాత్మిక రంగములో నేకాక భౌతికరంగములో కూడ ప్రసరింపవచ్చును. సైన్సులు సాధించు విషయములను ఈజ్ఞానశక్తులు సాధింపవచ్చును. సైన్సులు సాధింపజాలనివానిని కూడా సాధింపవచ్చును. సైన్సులు పంచేంద్రియ వ్యాపారములకే సంబంధించిన వగుటచే నీయతీతజ్ఞానశక్తులు కార్యసాధనము నెట్లు చేయుచున్నవో సైన్టిస్టులకు తెలియకున్నది. కాని కార్యసాధనము ప్రత్యక్షముగ కన్పట్టుచుండుటచే దానిని వారంగీకరింపవలసివచ్చుచున్నది. మంత్రములు, ఫలిత జ్యోతిషము, సాముద్రికము మున్నగునవి నేటి సైన్సుక్రింద పరిగణింపబడవు. కాని వీని ప్రభావము ప్రత్యక్షమగుచుండుటచే వీనిని కొట్టివేయుటకు ప్రాజ్ఞులు సాహసించుటలేదు.

నాలుగుసంవత్సరముల క్రిందట ఢిల్లీలో చాలమందికి కామెర్లవ్యాధి సోకగా డాక్టర్లు దానిని కుదర్చజాలకపోయిరి. 62 సంవత్సరములవయస్సుగల అనంతలక్ష్మియను దక్షిణాత్య స్త్రీయారోగమును మంత్రప్రభావముచే కుదుర్చగల్గెను. ఈ రీతిగా మంత్రమువలన రోగము కుదుర్చుకొన్న వారిలో ఉన్నత పదాధిష్ఠితులు, డాక్టర్లుకూడనుండిరి. ఆమె చికిత్సాపద్ధతి సైన్సులోనిదికాదు. సైన్సుకు అనుగుణముగాలేనిదాని నెల్ల అన్ సైన్టిఫిక్ అని యాధునికులు నిందించుచుండగా నిట్టి సంఘటనలు వేనకువేలు జరుగుచున్నవి. వీనివలన నొకనూతనసత్యము బయటపడుచున్నది. అది యేమనగా: సైన్సుకు అనుగుణముగాలేనిదెల్ల సైన్సుకంటె తక్కువది కానక్కఱలేదనియు, సైన్సుకంటె గొప్పదికూడాకావచ్చుననియు విజ్ఞులు గ్రహింప గల్గుచున్నారు. ఈ కారణమున ఇదివఱకు విజ్ఞానమునంతను 1. సైన్టిఫిక్ 2. అన్ సైన్టిఫిక్ అనురెండు భాగముల క్రిందనే విభజించుచుండిన యాధుని

కులు ఇప్పుడు సూపర్ సైన్‌టిఫిక్ (సైన్సుకు అతీతమైనది) అను మూడవ విభాగమును కూడ నంగీకరించు చున్నారు.

ఈ సూపర్ సైన్‌టిఫిక్ విజ్ఞానములో భారత దేశమునకే యగ్రస్థానము. ఈ సందర్భమున జగత్ప్రసిద్ధుడైన కీరో (షీరోయను ఉచ్చారణ సరికాదు) వ్రాసిన యీక్రింది మాటలుగమనింప దగియున్నవి.

"ఇంత వఱకు ప్రపంచములో విలసిల్లిన ఉత్తమోత్తమ విజ్ఞానము హిందువులదే. విజ్ఞానము పూర్వము మహోన్నత స్థితిలోనుండెనని యంగీకరింప నొల్లని వారొక సంగతిని మరచు చున్నారు. భారతదేశము ప్రాచీన కాలములో ప్రకటించిన జీవితరహస్యములను తత్త్వరహస్యములను ప్రత్యాఖ్యానము చేయుటకు నేటివారికి శక్తి లేకున్నది; తప్పనిసరిగా ఆ జ్ఞానమును నేటి వారంగీకరింపవలసి వచ్చుచున్నది. దాని ఘనత యట్టిది." (you and your Palm P. P. 15. 16,)

ఇవి నేటి వారినాశ్చర్య పఱచు ప్రాచీన భారతీయ విజ్ఞానమును గూర్చి కీరో చెప్పిన మాటలు. నేటి సైన్సులో స్థానమునుపొందని సాముద్రిక శాస్త్రములో భారతీయుల స్థానము నాతడిట్లు వర్ణించి యున్నాడు: "నేను ప్రాగ్దేశ సంచారము చేసినపుడు ఒకానొక శాఖకు చెందిన బ్రాహ్మణుల వద్ద గుప్త విద్యాగ్రంథములను చూచితిని. నేను వారి వలన అనేక విషయములను నేర్చుకొంటిని. సంఖ్యా శాస్త్రమునకు సంబంధించిన యంశములను గూడ నేర్చుకొంటిని. సంఖ్యల యొక్క ప్రాముఖ్యమును, అంతరార్థమును వానికి మానవ జీవితముపై గల ప్రభావమును, సంబంధమును నేను వారి వలన గ్రహించితిని. తరువాత ఈ సిద్ధాంతములను నేను ఉపయోగించితిని. అవియన్నియు సరియైనవే యని నాయనుభవము వలన తెలిసికొంటిని." (Book of Numbers P. P. 10, 11)

కీరో కనపఱచిన యద్భుత వైదగ్ధ్యమువలన నాతని సమకాలికుల కీవిద్యలు బూటకములు కావని తెలియుటయేకాక యాతని గ్రంథములను చదివి వానిని పరిశీలనములో పెట్టిన నేటి వారికి కూడ నీవిజ్ఞానము సైన్సు యుగములో సగర్వముగా నిలబడగలదను ప్రత్యయము కలుగుచున్నది. ఒక విశేషమేమన: ఆధునిక యుగములో కీరో విజ్ఞానమును హర్షించి మెచ్చుకొనువారు కూడ చాలమంది కీరో తనకీ విజ్ఞానభిక్షను భారతదేశమే పెట్టినదని చెప్పుకొన్న మాటలను మరచుచున్నారు.

వివిధ దేశముల ప్రాచీన విజ్ఞానము పట్ల నాధునిక వైజ్ఞానికులకు గాఢమైన నిరసన భావము గలదు; దానిని వారు పరిహసించుటయు కలదు. ప్రాచీనార్థముగల ప్రిమిటివ్ అను ఆంగ్లపదమునకు "అనాగరకము" అను అర్థమువచ్చుట కిదియే కారణము. ఇతర దేశములలోని ప్రాచీన విజ్ఞానము అనాగరకముగను మూఢవిశ్వాస ప్రచురముగను ఉన్నదని తెలిసికొన్న పాశ్చాత్యచారిత్రకులు ప్రాచీన భారతీయ విజ్ఞానము కూడ నట్టిదే యను భ్రాంతిలో పడిరి. విజ్ఞాన విషయమున ప్రాచీనభారతము ఇతర ప్రాచీనదేశముల కంటె భిన్నమైనదని యిపుడిపుడు చారిత్రకులును, సైన్ టిస్టులునుకూడా తెలిసికొను చున్నారు.

ప్రాచీన విజ్ఞానపరుల వద్దకు సైన్‌టిస్టులు నమ్రభావముతోవచ్చి విజ్ఞానసముపార్జనముచేయుట ప్రపంచములో మరియే దేశమునను గాంచము. భారతదేశములో నిట్టి సంఘటనములనేకములు జరుగుచున్నవి.

పారిస్ నగరనివాసిని డాక్టర్ తెరెసె బ్రాసీయను మహిళామణి, మరికొందరితో కలసి 1936వ సంవత్సరమున భారతదేశమునకు వచ్చి మైసూరు పట్టణమునకేగి యట జగన్మోహన భవనములోని యోగశాలలో శ్రీ టి. కృష్ణమాచార్యయను యోగీంద్రుని

యోగ ప్రదర్శనములను చూచెను. విద్యుద్యంత్రసహాయములతో నామె యా ప్రదర్శన సమయములలో యోగీంద్రుని బహువిధముల పరీక్షించెను. యోగశాలా ప్రేక్షకగ్రంథములో నా పాశ్చాత్యవనిత యిట్లు వ్రాసెను. "సంకల్ప శక్తి శ్వాసకోశము మీదను, రక్తప్రసారముమీదను ఎట్టి ప్రభావమును గల్గియున్నదో సున్నితములైన పనిముట్లతో కనుగొనుటకు మేమిక్కడకు వచ్చితిమి. శ్రీకృష్ణమాచార్య మా పరిశోధనలకు లోనగుటయే కాక మమ్ములను సంపూర్ణముగా తృప్తిపరచినారు. హృదయములోని స్థూల సూక్ష్మ సంచలనములను ఇచ్ఛానుసారము ఆపి వేయవచ్చుననియు మార్చవచ్చుననియు అసందిగ్ధముగా ఆయన నిరూపించినారు. యోగపరిస్థితినిగురించి మేమనుకొన్న దానికంటె లోతైన విమర్శకు పునాదులనుగూడ వేసికొన గల్గితిమి. పాశ్చాత్యులేది యసంభవమని తలచుచుండిరో దాని నీయోగి చేయగల్గెను."

యోగవిద్యారహస్యముల నన్వేషించుటకుగాను అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయములో మానసిక శాస్త్రాచార్యులైన డాక్టర్ ఎం.ఏ.వెన్‌జర్, మరియు మిచిగన్ విశ్వవిద్యాలయములో ఆచార్యులైన డాక్టర్ బసుగేబగ్చీ అను సైన్‌టిస్టులిద్దరు 1957 వ సంవత్సరములో భారత దేశమునకు వచ్చిరి. వీరు 6 మాసములు సెలవు తీసికొని ప్రత్యేకముగా నిందుకొఱకు భారతదేశమునకు వచ్చిరి. వీరి యోగవిద్యాపరిశోధనోద్యమమునకు ఇన్‌డియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చివారు, రాక్ఫెల్లర్ సంస్థ, రాక్‌హాంసంస్థ మరియు వాషింగ్‌టన్ యూనివర్సిటీ-అను నున్నత సంస్థలు ఆమోద సహాకారముల నొసగినవి. వీరు 1957 ఏప్రిల్ నెలలో భారతదేశములో యోగవిద్యా రహస్యములను తెలిసికొనుటకు భారతదేశములోని యోగులను దర్శించి మద్రాసులోని వివేకానంద కాలేజి ప్రయోగశాలలో కృష్ణమార్యులపై నాల్గుదినములు ప్రయోగములను సాగించిరి. ఆ ప్రయోగములు తమకు సంపూర్ణముగా తృప్తిని గల్గించినవని యా సైన్‌టిస్టులు ప్రకటించిరి. యోగవిద్యా రహస్యముల నింకను తెలిసికొనుటకు తిరిగి భారత దేశమునకు రావలసియున్నదని వారు ప్రకటనము గావించిరి.

ఇట్లు ఉన్నత శ్రేణికి చెందిన సైన్‌టిస్టుల కాశ్చర్యమును గల్గించి వారి జిజ్ఞాసను రగుల్కొల్పు ప్రాచీన విజ్ఞానము భారత దేశమునకు తప్ప మరి యేదేశమునకును లేదు. ఇట్టి విజ్ఞానము మనకు బహుశాఖలకు చెందినది కలదు.

కాళిదాసు - "సత్యం శివం సుందరం"

శ్రీ ఖండవిల్లి సూర్యనారాయణశాస్త్రి

ఒక్కొక్క దేశసంస్కృతి సాటిదేశముల సంస్కృతులలో తలమానికముగ నెంచబడుచున్నదన్నచో, అందుల కద్దానిలోగల ప్రత్యేకత, సర్వదేశసమ్మాన్యమైన సభ్యత, సర్వశ్లాఘాపాత్రమైన సాంఘిక వ్యవస్థ మున్నగునవి మూలకారణములగుచుండును. భారతీయ సంస్కృతి తరతరాలుగా సాటిదేశములలో సర్వాధికముగ నెంచబడుచుండుటకు పైసిద్ధాంతమే మూలమగుచున్నది. సర్వాదర్శప్రాయమైన యిట్టి మనసంస్కృతికి "సత్యం శివం సుందరం" అను సూక్తిరాజ మెక్కిన రత్నమకుట మనవచ్చును.

ప్రస్తుతము కాళిదాస మహాకవి కావ్యశిల్పములో నీసూక్తిరత్న మా కవీంద్రునిచే జక్కగ బొదుగబడి, దేశదేశముల వారికి వెలుగుబాటను జూపుచున్నరీతి నిచ్చట దిఙ్మాత్రముగ జూపుట యీ వ్యాసభావము. "సౌందర్యము" అనబడునది సర్వదేశముల వారికి నిత్యనూతనమగుచు కందోయికి విందొనరించుచుండుట వినూత్నవిషయముకాదు. కాని యీ "సౌందర్యము" యొక్కవిలువ యిద్దానికాధారమైన వస్తువుయొక్కవిలువనుబట్టి అధికమో అపకృష్టమో అగుచుండును. పై సత్యము నీక్రింది శాకుంతలోదాహరణమిట్లు సమర్థించుచున్నది.

"శుద్ధాంత దుర్లభమిదం వపురాశ్రమవాసినో యది జనస్య। దూరీకృతాః ఖలుగుణై రుద్యానలతా వనలతాభిః" (శాకుంతల నాటకము అంకం ౧) కణ్వాశ్రమములో సఖీసమేతయై వృక్షసేచనము గావించుచున్న శకుంతలను జూచి దుష్యంతుడు తనలోనిట్లు తలపోయుచుండెను. "ఈ యాశ్రమ వాసినుల అంగచందములలోని అపురూపత అంతఃపురస్త్రీలకుకూడ దుర్లభమే యైనచో, సౌరభ్యాది సుగుణసంపదగల వనలతలచే ఉద్యానవనలతలు తిరస్కృతములు. సర్వభోగ్యవస్తు సంభరితలైన యంతఃపురస్త్రీల రూపమపురూపమగుట సామాన్యమే. ఇకయాశ్రమ వాసినులన్ననో కందమూలాశనలై, నారచీరలనే ధరించి, ఇంగుదీతైలమర్దన చిక్కణశీర్షలై తపోవృత్తిలోనుందురు. ఇట్టి తాపసస్త్రీల యొక్క రూప మపురూపమగుటయే ఆశ్చర్యకరము. ఈయాశ్చర్యకర విషయమునకు మూలము, తాపసిక జీవితములోని తపఃప్రభావమేఅని యంగీకరింపవలెను శకుంతలయొక్క యీసౌందర్య తత్త్వమును సందర్శించుడు

"సరసిజమనువిద్ధం శైవలేనాపి రమ్యం మలినమపి హిమాంశోర్లక్ష్మ లక్ష్మీం తనోతి। ఇయమధికమనోజ్ఞా వల్కలేనాపి తన్వీ కిమివహి మధురాణాం మండనం నాకృతీనాం॥" (శాకుంతలము-అంకం ౧)

పద్మమునకుచుట్టువారియున్న నాచుకూడ రమ్యాపాదకమే. చంద్రునకు కళంకముకూడ శోభాలక్ష్మీపోషకమే. ఇట్లే ఈశకుంతలకు నారచీరకూడ అధికముగా సౌందర్య సంజనకమే యగుచున్నది. స్వతఃసుమనోహర రూపిణులకు ఏతక్కువ వస్తువైనను అలంకారమే అగుచున్నది. ఇట్టి స్వయంప్రకాశమైన వస్తువునకు దగ్గరనున్న సామాన్యవస్తువు, ఆవస్తుశోభతో రంజితమై తిరిగి యెదుటివస్తువును ప్రకాశితమొనర్చుచున్నది. "యస్య భాసా సర్వమిదం విభాతి" అను వేదాంత సూక్తినిబట్టి ఒకయుత్తమ వస్తువుయొక్క సత్య సౌందర్య శోభాసంపదలచే సర్వవస్తువులును శోభాసందీపితములై తిరిగితాము ఆఎదుటి వస్తువును ప్రకాశింపజేయజాలినవగుచున్నవి. ఇట్టి యీమె చెలువమునకు సౌశీల్య సంపాదకమైన వనవాసజీవితమే మూలమనవలసియున్నది. ఈమెతన దైనందిన జీవితములో "పాతుం న ప్రథమం వ్యవస్యతి జలం యుష్మాస్వపీతేషు యా। నాదత్తే ప్రియమండనాపి భవతాం స్నేహేన యా పల్లవం। ఆద్యే వః కుసుమప్రసూతి సమయే యస్యా భవత్యుత్సవః। సేయం యాతి శకుంతలా పతిగృహం సర్వైరనుజ్ఞాయతాం" అత్తవారింటికి శకుంతలను బంపుచు కణ్వుడాశ్రమ వృక్షములనుండి సెలవు కోరుచు నత్తరుబంధువులతో "వనవాస బంధువులైన ఓయాశ్రమపాదపములారా! మీకుముందుగ జలములను త్రాగనిదే ఎవతె తాను దాహమైన త్రాగనిచ్ఛయింపదో, పువ్వులన్న మురిసిపోవుచున్న నెవతె మీయందుగల స్నేహాదరముచే మీయందలి చిగురుటాకులైన త్రుంపజాలదో, మీలోనే యొక్కరికైన క్రొంగ్రొత్తగ పువ్వుపుట్టిన సంతోషసమయము ఏవనితకు ఉత్సవసమయమగుచున్నదో అట్టి శకుంతల నేడు పతిగృహమునకై పయనమగుచున్నది. కనుక మీరందరును ఆమె కనుజ్ఞనొసగుడు" ఇదే యీసాధ్వియొక్క సౌశీల్యసంపద. ఈశీలసంపదనుబట్టి యీసతీమతల్లి సర్వభూతప్రేమమయ మానసయనియు, సర్వభూత సుఖదుఃఖసమభాగినియనియు, సర్వభూత సంతోష సంతుష్టాంతరంగయనియు స్పష్టమగుచున్నది. భావిలో నీమె భరతమాత గనుక భారతీయుల భవ్యసంస్కృతి సౌరభ విశేషము నీమె జీవితకుసుమములో బరిమళించునని, ఈమె నిట్లు చిత్రించి శ్రీకాళిదాస మహాకవి భారతీయస్త్రీమూర్తిని అన్యదేశముల వారికేగాక అన్నిదేశముల వారికిని ఆరాధ్యమూర్తిగా-ఆదర్శమూర్తిగా-

జూచి పున్నెము కట్టుకొనినాడు. ఇట్లీమెను రావణ వృత్తి. సౌశీల్యసంపదయు తపస్సంపద యీమె సౌందర్యమున కపూర్వశోభను, సత్యతను నమకూర్చుచున్నది. కనుకనే యీభరతమాత యొక్క రూపవైభవము అనన్యస్త్రీలభ్య మను విషయము నీక్రిందివిధముగా కాళిదాసు వర్ణించినాడు.

"అనాఘ్రాతం పుష్పం కిసలయ మలూనం
కరరుహైరనావిద్ధం రత్నం మధు నవమనా
స్వాదితరసం। అఖండం పుణ్యానాం ఫలమివ చ
తద్రూపమనఘం। న జానే భోక్తారం కమిహ సముప
స్థాస్యతి విధిః" (శాకుంతలనాటకము. అంకం ౨)

ఇందు శకుంతలారూపతత్త్వము సామాన్యదృష్టికి గోచరము కాదనియు అది కేవలజ్ఞానదృష్టికే గోచరమనియు కవి యిచ్చట వ్యంగ్యమర్యాదచే సూచించినాడు. చూడుడు. ఇటక్రిందగీతలు గల పదపంచకములో 1 పుష్పము 2 కిసలయము 3 రత్నము 4 మధువు 5 పుణ్యఫలము, ఈ వస్తుపంచకము జ్ఞానేంద్రియైః సంవేద్యము. ఇట్టి వస్తుపంచకముతో పోలికగల శకుంతలారూపముకూడ కేవలజ్ఞానదృష్టికే గోచరమగునుగదా! అవియునుం గాక పుణ్యఫలమెప్పుడును తపఃప్రధానలభ్యమైనదే. దీనిని బట్టి సౌందర్యమునకు ప్రత్యేకశోభను, సత్యతను సమకూర్చునదొక్క తపఃప్రభావమే అని స్పష్టమగుచున్నది. ఇంకొక విశేషమేమనగా ఇందలి "అనాఘ్రాతం" అను విశేషణమిట విశిష్టము. పుష్పము వాసనలనంతట చిమ్ముచుండునుగదా! అనగా తద్రూప పుష్పమన్యులచే అఘ్రాణితముగాక ప్రత్యేక ప్రాభవముచే ప్రకాశించుచున్నది. అనగా నిది "పూచిన సంపెంగ పూలువు మధుకరాంగనలకు బోలె" మహత్తరశక్తి సంపన్నముకావలెను. ఇట్టి శక్తి "యద్దుష్కరం యద్దురాపం............తత్సర్వం తపసా ప్రాప్యం" అన్నట్లు తపఃప్రభావ సంపాద్యమే కావలెను. కాగా ప్రస్తుతము శకుంతలా రూపములో నణగియున్న సత్యసౌందర్యసౌభాగ్యము: "శమప్రధానేషు తపోధనేషు గూఢం హి దాహాత్మకమస్తి తేజః........" అను వట్లు అంతర్నిహితమైయున్న యసాధారణ ప్రభావము ఇటసూచితములగు చున్నవి. ఇట్టిసౌందర్యమే సత్యమైనదనియు జగన్మంగళకరమైనదనియు నీక్రింది కుమారసంభవోదాహరణములతో కాళిదాసు కమనీయముగా ప్రత్యక్షముగా సమర్థించుచున్నాడు. సందర్శింపుడు. పార్వతీ రూపసృష్టి నీ కవి బ్రహ్మ యిట్లు గావించినాడు.

"సర్వోపమాద్రవ్య సముచ్చయేన యథా ప్రదేశం వినివేశితేన। సా నిర్మితా విశ్వసృజా ప్రయత్నాదేకస్థ సౌందర్యదిదృక్షయేవ॥" (కు. సం. సర్గ ౧)

"పార్వతీసృష్టి సందర్భములో బ్రహ్మ స్త్రీయంగముల కుపమానముగా ప్రసిద్ధిపడసిన సుందరవస్తువులలోని సౌందర్యసర్వస్వమునొకచో జేర్చుకొని, ఎచ్చెచ్చటెంత సౌందర్యమవసరమో అంతనుపయోగించుచు తనసుందరవస్తు నిర్మాణచాతురీ ప్రకటన పూర్వకముగ సౌందర్యమునంతను నొక్కమూర్తి రూపములో జూడ నెంచి అనర్ఘ యీసుందరాంగిని సృష్టించినాడట. ఇది పార్వతియొక్క బాహ్యసౌందర్యము. ఇట్టియామె సౌందర్యగరిమను అండగా జూచికొనియే మన్మథుడు మహేశునిపై తన సమ్మోహన బాణమును ప్రయోగించినాడు. అనగా నీమె రూపము పంచబాణుని కారవ బాణముగ అమరియున్నదన వచ్చును. ఐననేమి? అది ప్రభావరహితమైనది. కనుకనే మహేశుని కరగింపలేకపోయినది తత్ఫలితముగ మదనుడు భస్మావశేషుడైనాడు. వెంటనే గిరిజ గిరిరాజగృహమునకు వెడలి అట"....నినింద రూపం హృదయేన పార్వతీ ప్రియేషు సౌభాగ్యఫలాహి చారుతా" (సర్గ ౫) అని తన నాథుని మనస్సును దూరగొనలేని తన ఒట్టిరూపమును నిందించుకొనుచు తుదకు "ఇయేష సా కర్తుమవంధ్యరూపతాం సమాధిమాస్థాయ తపోభిరాత్మనః। అవాప్యతే వా కథమన్యథా ద్వయం తథావిధం ప్రేమపతిశ్చ తాదృశః" (కు. సం. సర్గ౫శ్లో.౨)ఆమె తన రూపవంధ్యా (వ్యర్థ)రూపమును తపోనియమములతో "అవంధ్య" రూపముగా రూపొందింప నిశ్చయించినది. ఈమె యింతటి నిశ్చయమునే చేయకున్నచో ఈశునిఅర్ధాంగమును హరించునంతటి ప్రేమయు, మృత్యుంజయుడైనంతవాని పతిగా ప్రాప్తించుటయు అను అభ్యుదయద్వయలాభమీ పడతికల్లి కెట్లబ్బును?" ఇట్లు తపశ్చరణకుముందు ఈమె రూపము-మదనునకుకూడ గర్వకారణమై నంతటి రూపము-మదనదాహసమయమున శక్తి రహితమై పోయినది అనగా నిది నిజమైన సౌందర్యము కాదని తెలియుచున్నది. కనుకనే యిప్పటి వంధ్యరూపములోని మాలిన్యమును తపోనియమములతో క్షాళితముచేసి ఆరూపమునకు "అవంధ్య"త్వము నాపాదింప నమకట్టినది. "యద్దుష్కరం యద్దురాపం........ తత్సర్వం తపసా ప్రాప్యం" మనికదా అభియుక్తోక్తి" ఇట్లీయామె తపస్సఫలమైనది, ఈమె తపశ్చరణానంతర మీమె రూపము తప్తకాంచనమువలె వింతశోభతో, సత్యసౌందర్యముతో సముద్దీపితమైనది. ఇప్పటి యీమె సౌందర్యమె మహేశ్వరునే పరవశుని జేయగలిగినది. మాయావటురూపముతో మహేశ్వరు డీమె చెంతకు స్వయంవృతుడై వచ్చినాడు గిరిజతన తపశ్చరణమునకు నేగాక అమ్మాయావటుని ముఖాముఖీపరీక్షలో

గూడ పరిపూర్ణముగ నుత్తీర్ణమైనది. మహేశుడిక మాయవటురూపములో మణగియుండజాలక స్వస్వరూప సందర్శన సంరంభముతో నాపార్వతి గూర్చి చంద్రశేఖరుడు "అద్యప్రభృత్యవనతాంగి తవాస్మిదాసః। క్రీతస్తపోభిరితి వాదినిచంద్రమౌళౌ।....." "ఓసుందరాంగీ! ఇకనీకుదాసుడను." ఇచ్చట కవి కాత్యాయనీ రూపములో కాళీరూపమును గాంచి వ్యంగ్యముగా "నీకు (కాళికి)దాసుడను" అనుచు తన కాళిదాసనామమును నిచ్చోట సార్థకము గావింపదలచినాడేమో! ఏమో!

ఇచ్చటనే మన ప్రాచ్యసంస్కృతి యితరసంస్కృతులతో విడివడుచున్నది. మనది మంగళాంతమైనది కనుకనే మన సారస్వతములోగూడ "మంగళాదీని మంగళమధ్యాని మంగళాంతాని శాస్త్రాణి ప్రథంతే। వీరపురుషకాణ్యాయుష్మత్పురుషకాణిచ భవంతి........" అను భవ్యసాంప్రదాయము ప్రతిఫలించి ప్రపంచమాంగళ్యమునకు మంగళతోరణమైనది.

పైవిధముగా కాళిదాస కవీంద్రుని "సౌందర్య" వర్ణనము తపఃప్రభావ ప్రభావితమైనపుడు "సత్య"మై శివునిసందర్శన సమయమున "శివ" మై(మంగళకరమై)నది. ఇదియేకదా నిజమైన "సుందరము" సుందరభావమేకదా సౌందర్యము. ఇట్టి సౌందర్యమే పార్వతీ పరమేశ్వరుల పరిణయమునకు నాందియై "సత్యం శివం సుందరం" అనుసూక్తిని సార్థకము జేయుచు జగన్మాంగళ్యమునకు మంగళతోరణమై దేశదేశములలో కాళిదాసునకు జేజేలను అందించుచున్నది.

"పరస్పర తపస్సంపత్ఫలాయిత పరస్పరౌ।
ప్రపంచమాతా పితరౌ ప్రాంచౌ జాయాపతీ
స్తుమః॥ ఇతి శం.

శ్రీ భరతముని ప్రణీత
నాట్యశాస్త్రమ్

ఆంధ్రభారతి

డాక్టర్, శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి, ఎం. ఏ., ఎం. లిట్, పిహెచ్. డి.

పంచమోఽధ్యాయః

పూర్వరంగ విధానము.

య ఇమం పూర్వరఙ్గంతు విధినైవ ప్రయోజయేత్
నాశుభం ప్రాప్నుయాత్ కిఞ్చిత్ స్వర్గలోకంచ గచ్ఛతి. ౧౭౦
యశ్చాపి విధిముత్సృజ్య యథేష్టం సంప్రయోజయేత్
ప్రాప్నోత్యపచయం ఘోరం తిర్యగ్యోనించ గచ్ఛతి. ౧౭౧
న తథాగ్నిః ప్రదహతి ప్రభఞ్జన సమీరితః
యథా హ్యపప్రయోగస్తు ప్రయుక్తో దహతి క్షణాత్. ౧౭౨

ఈ విధముగా లక్షణముల నన్నిటి ననుసరించి పూర్వరంగమును ప్రయోగించినవానికి కొంచెమైనను కీడుకలుగక పోవుటయేగాక స్వర్గలోక సుఖముగాగలదు. పైన చెప్పబడిన విధులన్నిటిని వదలి, స్వేచ్ఛగా, తనకు తోచినట్లు పూర్వరంగమును ప్రయోగించిన వానికి ఘోరమైన కీడు, పశు జన్మ రాగలవు. వాయువుచే ప్రేరితమైన అగ్ని సహితము అపప్రయోగము దహించునట్లు ఒక్క త్రుటిలో దహించలేదు.

ఇత్యేవావంతి పాఞ్చాల దాక్షిణాత్యాంధ్ర మాగధైః
కర్తవ్యః పూర్వరఙ్గస్తు ద్విప్రమాణ వినిర్మితః. ౧౭౩

అవంతి, పాంచాల, దాక్షిణాత్య, ఆంధ్ర, మాగధ దేశీయులచే నీ విధముగా ఆ యా దేశములలోని రూపక నాయకుల ప్రవృత్తులకు తగిన వేషభాషాచారాభినయనములతో సూత్రధారాదులచే పూర్వరంగము ప్రయోగింపబడవలెను. ఈ పూర్వరంగము త్ర్యశ్రముగాను, చతురశ్రముగాను నిర్మింపబడినదని తెలియవలెను.

ఏష వః కథితో విప్రాః పూర్వరఙ్గాశ్రితో విధిః
భూయః కిం కథ్యతాం సమ్యఙ్నాట్యవేద విధింప్రతి. ౧౭౪

ఇతి శ్రీ భారతీయే నాట్యశాస్త్రే పూర్వరఙ్గవిధానం నామ
పఞ్చమోఽధ్యాయః

పూర్వరంగము నాశ్రయించుకొనిన విధి యంతయు నీ రీతిగా చెప్పబడినది. నాట్యవేద మందలి విధులను గురించి ఇక తెలిసికొనవలసిన దేమిగలదని భరతుడు మునుల నడుగుచున్నాడు.

ఆంధ్రభారతి యందు పూర్వరంగ విధానము ఐదవ అధ్యాయము.

షష్ఠోఽధ్యాయః

రస వికరణము

పూర్వ రఙ్గ విధిం శ్రుత్వా పునరాహు ర్మహత్తమాః
భరతం మునయః సర్వే - "ప్రశ్నాన్ పఞ్చాభిధత్స్వనః. ౧
యే రసా ఇతి పఠ్యంతే నాట్యే నాట్య విచక్షణైః
రసత్వం కేన వై తేషా మేత దాఖ్యాతు మర్హసి. ౨
భావాశ్చైవ కథం ప్రోక్తాః కింవా తే భావయంత్యపి
సంగ్రహం కారికాంచైవ నిరుక్తంచైవ తత్త్వతః". ౩

పూర్వరంగ విధిని వినిన తర్వాత మునులందరు భరతుని ఇట్లు ప్రశ్నించిరి- "మా ఐదు ప్రశ్నలకు సమాధాన మీయవలసినది. నాట్యవిచక్షణులచే నాట్యమున రసములుకొన్ని పఠించబడుచున్నవి. రసములకురసత్వమెట్లు సిద్ధించుచున్నది? భావము లనబడువాటిని భావములని ఎట్లనుచున్నారు? భావములచే భావింప బడునదేది? ఈ ప్రశ్నలకు నిర్వచనముచేయుచు, కారికా రూపమునగూడ సంగ్రహముగా సమాధాన మీయవలెను".

దశరూపక నిరూపణావసరమున ప్రథమ ప్రశ్నార్థము సమగ్రముగా రాగలదు. సిద్ధ్యాధ్యాయమున ద్వితీయ ప్రశ్నార్థము పూర్తిగా నిర్ణయింపబడగలదు. పంచ ప్రశ్నలలో నిట మూడు ప్రశ్నలే ఇవ్వబడినవి. ఈ మూటిలోను మొదటి ప్రశ్న కీ అధ్యాయమున సమాధానము గలదు. మిలిగిన రెండు ప్రశ్నలకు ఏడవ అధ్యాయమున ప్రత్యుత్తర మొసగబడగలదు.

పాఠ్యగీత సంకలితమైన అభినయము హృదయంగమమైనది. కాని పూర్వ రంగ విధిలో శృంగార రౌద్రాది రసములు పేర్కొనబడినవి. రస శబ్ద వాచ్యత్వ మీరసముల కెట్లు సిద్ధించునని ఋషుల ప్రశ్న. లోకమున అమ్లాది రసము లారు కన్పించుచున్నవి కాని వాటికి నాట్యమున ప్రసక్తి లేదు. ఇంద్రియగ్రాహ్యమైనది రసమని లౌకిక వ్యవహారము నాట్యరసములకు ఇంద్రియ గ్రాహ్యత్వమున్నదా, లేదా? అమ్లాదిరసములకు వీటికిగల భేదమేమి? నాట్య రసములను భరతుడు వెనుకటి అధ్యాయములలో ఆదరాతిశయముతో నేల ప్రస్తుతించినాడు? ఈ ఆశంక లుండుటచే అంగాభినయప్రశ్నాంతర్భూతమైనను మరల రసవిషయక ప్రశ్న చేయవలసి వచ్చినది.

రసముతోకలసి యుండునవి భావములు. ఈ భావములకు భావత్వ మెట్లు వచ్చును? భావములు దేనిని భావించునవి? అను రెండు ప్రశ్నలతో బాటు రస భావముల సంబంధ విషయకమగు ప్రశ్నగూడ రాగలదు, 'భూ'ధాతువునుండి భావశబ్ద వ్యుత్పత్తిని చెప్పక, 'భావన'నుండి భావశబ్దమును నిష్పన్నము చేయుటకుగల కారణ మేది యని ఋషులడుగుచున్నారు.

శేషాంతు వచనం శ్రుత్వా మునీనాం భరతోమునిః
ప్రత్యువాచ పునర్వాక్యం రసభావ వికల్పనమ్. ౪
"అహం వః కథయిష్యామి నిఖిలేన తపోధనాః
సంగ్రహం కారికాంచైవ నిరుక్తంచ యథాక్రమమ్. ౫
నశక్య మస్య నాట్యస్య గంతు మంతం కథంచన
కస్మా ద్బహుత్వాజ్ఞానానాం శిల్పానాం వాప్యనంతతః. ౬
ఏకస్యాపి న వై శక్య స్త్వంతో జ్ఞానార్ణవస్యహి
గంతుం కింపున రన్యేషాం జ్ఞానానా మర్థతత్త్వతః. ౭

ఋషుల ప్రశ్నల నాలకించి రసభావవికల్పన పరమైన సమాధానము నీయ దలచి భరతుడిట్లనెను- "సంగ్రహ, లక్షణ, నిర్వచన సహితముగా విషయమును సమగ్రముగా ఉద్దేశ లక్షణ పరీక్షాదిక్రమము ననుసరించి మీకు చెప్పబోవుచున్నాను. సంగ్రహ కారికానిరుక్తి ప్రకారములను వదలి నాట్యనిశ్చయము నతి కష్టముతో నైనను పొంద జాలము. ప్రతి పదనిరూపణ దుర్లభమగుటచే లక్షణద్వారా ఈ విషయము చెప్పబడగలదు. ఉద్దేశ పరీక్షలగు లక్షణాంగముల ద్వారా విషయప్రదర్శన గావించబడగలదు. వ్యాకరణాది శాస్త్రములు, చిత్ర పుస్తాది కర్మలు అనంతములగుటచే ప్రతి పదనిరూపణము దుర్లభము. నాట్యాంగ భూతమగు నొక్క విషయమును గూర్చియైనను నిశ్చయమునకు రావలయు ననినచో దుర్లభ మే యగుటచే అన్యాంగములను గూర్చి వేరుగా చెప్పనక్కరలేదుగదా!"

కిం త్వల్పసూత్రగూఢార్థ మనుమాన ప్రసాధకమ్
నాట్యస్యాస్య ప్రవక్ష్యామి రసభావాది సంగ్రహమ్. ౮
విస్తరేణో పదిష్టా నా మర్థానాం సూత్రభాష్యయోః
నిబంధో యః సమాసేన సంగ్రహం తం విదు ర్బుధాః. ౯

విస్తృతముగా చెప్పుట అశక్యమగుటచే గ్రంథములోని అర్థమునుబుద్ధిగ్రాహ్యమగునట్లుగా సూత్ర ప్రాయమున చెప్పనున్నాడు. రస భావాదికమును ప్రధానముగా గ్రహించి తదుపక్రమ పూర్వకమగు నాట్య లక్షణమును సంక్షేపముగా చెప్పనున్నాడు.

కేవల వ్యతిరేకి హేతు రూపమగు అనుమాన ప్రమాణముద్వారా ఉద్దిష్ట విషయమును కల్పించి, అశ్రయాసిద్ధత్వ శంకాశమనముచేసి, మూలాంగ పోషకముగా చెప్పబడు వివరణను అనుమాన ప్రసాధకమందురు.

లక్షణపరీక్షగావించు సూత్ర గ్రంథములో లక్ష్య భాగము సంకుచితముగా, స్వల్పముగా, నామమాత్రముగ ఉద్దేశింపబడియుండును. భాష్యమున పరీక్షితవ్య భాగము విస్తృతముగా ఉప దిష్టమగును. ఈ లక్ష్య పరీక్షితవ్య భాగమును నిబంధాత్మకముగా సంక్షేపించి చెప్పుటయే సంగ్రహమనిపించుకొనును.

రసా భావా హ్యభినయాః ధర్మీ వృత్తి ప్రవృత్తయః
సిద్ధిః స్వరా స్తథా తోద్యం గానం రఙ్గశ్చ సంగ్రహః. ౧౦

శృంగారాది రసములు, గ్లాన్యాది భావములు, చతుర్విధాభినయములు, లోకధర్మి నాట్యధర్మి అను ధర్మిద్వయము, వృత్తులు, ప్రవృత్తులు, సిద్ధి, స్వరములు, ఆతోద్యము, గీతము, రంగము అనునవి నాట్యములోని అంగముల సంక్షిప్త రూపములు.

రస భావాభినయ గీతాతోద్యము లనునవి నాట్యమందలి పంచాంగములు. కాని కోహలుని ప్రకారము పైన చెప్పబడిన ఏకాదశాంగములు నాట్యమున గలవని ఉద్భటుని వ్యాఖ్య. వాసనా వేశవశమున నటునకు రసభావ యోగముతో తత్త్వావేశముండుట చేతను, లయాద్యను సరణముగా నంగములుండుట చేతను, ప్రయోజన భేదముచే నంతర్భూతములగు నంగములు పునరుచ్చరితములగుటచేతను, ఇచట క్రమము వివక్షితమగుటచేతను భరతుని మతమున ఏకాదశాంగములు లేవని, పంచాంగములే అని లోల్లటుడు వ్యాఖ్యానించినాడు.

అల్పాభిధానేనార్థో యః సమాసేనోచ్యతే బుధైః
సూత్రతః సా ఽను పఠితా కారికార్థప్రదర్శినీ. ౧౧

సంగ్రహలక్షణమునుచెప్పి ఇక కారికా లక్షణమును చెప్పు చున్నాడు, కొద్ది పదములతో సూత్రప్రాయముగా, సంక్షేపించి చెప్పబడు అర్థముగల దానిని కారిక యందురు. సూత్రార్థమునకు సంక్షిప్తార్థ వివరణము గావించునది కారిక. బహుతర లక్ష్యసంగ్రహముగా స్వల్పశబ్దములతో అర్థముచెప్పబడి,జ్ఞాపకముంచుకొనుటకు వీలగు నట్లు చేయునది. తదర్థ ప్రకాశకరమగు శ్లోకముగూడ ఔపచారికముగా కారిక యనబడుచున్నది.

ఉద్దిష్ట విషయమునకు ధర్మ్యంతరవ్యవచ్ఛేదకమగు లక్షణమును చెప్పవలెను. ఈ లక్షణము మొదట సూత్రమున చెప్పబడి, తర్వాత అకృతా క్షేపోత్తర ప్రపంచము ద్వారా, తద్వివరణమాత్ర రూపముతో, సుఖగ్రాహ్యమగు శ్లోకమున ప్రతిపాదింపబడును. ఈ శ్లోకమునే కారిక యందురు.

నానానామాశ్రయోత్పన్నం నిఘంటు నిగమాన్వితమ్
ధాత్వర్థ హేతుసంయుక్తం నానాసిద్ధాంత సాధితమ్. ౧౨

స్థాపితోఽర్థో భవే ద్యత్ర సమాసేనార్థ సూచికః
ధాత్వర్థ వచనే నేహ నిరుక్తం తత్ ప్రచక్షతే. ౧౩

ఇక నిరుక్త లక్షణ మీ రెండు శ్లోకములలో చెప్పబడుచున్నది. సంక్షేపముగా లక్షణీయమై అనేక వ్యక్తిభేదభిన్నమగు అర్థమును లక్షణాత్మకముగా సూచించుచు, ఆక్షేప ప్రతి సమాధాన లక్షణముగా వస్తు స్థాపన గావించుట పరీక్షా రూప నిరుక్త మనిపించు కొనును.

క్రియావిశేషణాభిధానము ద్వారా ఆక్షేప ప్రతిసమాధాన ప్రకారణమగు లక్షణము స్థాపించబడగలదు. లక్షణ వాక్యమున అర్థ ప్రతిపాదకములగు శబ్దములు నానా ప్రకారములుగా ఉండును. ఇట్టి శబ్దముల నాశ్రయించుకొని ఆక్షేప ప్రతి సమాధానము ఉత్పన్నమగును. నామ పదములనుండి ఆక్షేప ప్రతిసమాధానములను గ్రహించుటకు అభిధాన కోశములను, ప్రకృతి ప్రత్యయ విభాగ నిగమనములను స్వీకరించవలెను. క్రియా పదములనుండి గ్రహించుటకు ధాత్వర్థములను, కారకములను తెలిసికొనవలెను. ఈ శబ్ద పరీక్ష నిరుక్తమున ముఖ్యమైనది.

శబ్ద పరీక్షలో ఆక్షేప ప్రతి సమాధానము లుండును. 'ఈ శబ్ద మీయర్థము నెట్లు బోధించగలుగు చున్నది?' అనునది ఆక్షేపము. 'ఈ ప్రక్రియ ననుసరించి' అని చెప్పుట ప్రతి సమాధానము. అర్థ పరీక్షలో నానా ప్రకారములైన ప్రమాణముల ద్వారా ఆక్షేప ప్రతి సమాధానములను సాధించవలెను. ధాత్వర్థవచనము చేత, నామ వ్యుత్పత్తి చేత, సంగ్రహముగా సూచింపబడి స్థాపితమైన అర్థమును నిరుక్తమని యందురు.

సంగ్రహో యో మయా ప్రోక్తః సమాసేన ద్విజోత్తమాః
విస్తరం తస్య వక్ష్యామి స నిరుక్తం సకారికమ్. ౧౪

సంక్షేప రూపమున చెప్పబడిన విషయమును కారికా నిరుక్తములతో విస్తరించి చెప్పబోవుచున్నాడు. కారికా సంపదోపేతమగు విషయమును పరీక్షా పర్యంతము చెప్పగలడు.

శృఙ్గార హాస్య కరుణ రౌద్ర వీర భయానకాః
బీభత్సాద్భుత సంజ్ఞౌ చేత్యష్టౌ నాట్యే రసాః స్మృతాః ౧౫
ఏతే హ్యష్టౌ రసాః ప్రోక్తా ద్రుహిణేన మహాత్మనా.

నాట్య విభాగ క్రమమిక చెప్పబడు చున్నది. శృంగారము, హాస్యము, కరుణ, రౌద్రము, వీరము, భయానకము, బీభత్సము, అద్భుతము నను ఎనిమిది నాట్యరసములు గలవు. ఈ ఎనిమిది నాట్యరసములను బ్రహ్మయే వివరించియున్నాడట. వీటి స్వరూప స్వభావములు మున్ముందు వివేచింప బడగలవు.

నటుని అభినయ ప్రభావముచే సాక్షాత్కారాయమాణమగు ఏకఘన మానస నిశ్చలాధ్యవసేయము, సమస్త నాటకాది కావ్య విశేషమున కన్పించు అర్థము నగునది నాట్యము. ఈ నాట్య మనంత విభావాత్మకమైనను అనుభవించు సహృదయునియందే పర్యవసితమగుటచే, నాయకుడనబడు భోక్తృ విశేష స్థాయి చిత్తవృత్తి స్వభావమైనదగు చున్నది. అలౌకిక గేయ పదాది లాస్యాంగములచే పోషింపబడుచు, గుణాలంకార గీతాతోద్యాదికముచే సుందరముగా చేయబడిన కావ్య విశేషము నాశ్రయించుకొనుచు, సాధారణీకరణము ద్వారా సామాజికులను స్వాత్మ సద్భావ వశమున మహదనుభూతి నొసగుచు, నట సమాజికులకు తాదా

తన్మయ్యము నాపాదించునది నాట్యము. కావుననే అనుమానము, ఆగమము, యోగి ప్రత్యక్షము, ప్రమాతృప్రమేయవ్యవస్థ యను లౌకిక చిత్తవృత్తి మొదలగువాని కంటె విలక్షణమైనదగు చున్నది. లౌకిక వ్యవహారమునవచ్చు ప్రత్యక్షాది జ్ఞానము అన్యప్రవృత్తికి సాధనమగును. కాని నాట్యానుభూతి నాట్యమందేపర్యవసితమగుచు అన్యపరివృత్తికి దోహద మొసగదు. నిర్విఘ్న స్వసంవేదనాత్మకమగు విశ్రాంతి లక్షణము, రసనాపరపర్యాయము నగు వ్యాపారముచే గ్రహింపబడుచుండుటచే రసమని పిలువబడుచున్నది. కావున రసమే నాట్యము, నాట్యమే రసము అని తెలిసికొనవలెను. అందుచేతనే రసమును వదలినచో అర్థప్రవృత్తి ఏమియు లేదని చెప్పుచు భరతుడు రస శబ్దమును ఏకవచనమున ప్రయోగించినాడు. కాగా రసమనబడునది నాట్య మొక్కటే. వైయాకరణుల స్ఫోటవాదము ననుసరించినచో శృంగారాది రసము లీ రసమునకు వివర్తములై అసత్యములుగా కన్పించగలవు. ప్రాభాకర మీమాంసకుల అన్వితాభిధాన వాదము నంగీకరించినచో శృంగారాదు లీరసమునకు పాయాత్మకములుగా సత్య పదార్థములుగా భాసించగలవు. భాట్ట మీమాంసకుల అభిహితాన్వయ వాదమును స్వీకరించినచో శృంగారాది సముదాయరూపమే నాట్యమనబడు రసమని సిద్ధము కాగలదు.

ఇట్టి రసములు ఎనిమిదిఅని పైకారికలో నున్నను, “బీభత్సాద్భుత శాంతాశ్చ నాట్యేనవరసాః స్మృతాః” అను పాఠాంతరము గలదు. దీనిననుసరించి శృంగారాది ఎనిమిది రసములతో బాటు శాంతమును కూడ కలుపగా తొమ్మిది రసములు రాగలవు. ఇది అభినవగుప్త సమ్మతమైన పాఠము. కాని శాంతమును శృంగారాదులవలె రసముగా స్వీకరించవలెనా? లేక శాంతము వీటికంటె విలక్షణమైన రసమా? అను విషయము మున్ముందు చర్చించబడగలదు.

ప్రాణికోటి కంతకు కామ మత్యంత పరిచిత మగుటచేతను, హృద్యతమ మగుటచేతను శృంగారము మొదట చెప్పబడినది. శృంగారము ననుసరించియుండునది హాస్యము. శృంగారము సాపేక్షకము, నిరపేక్షకమై, శృంగారముకన్న విలక్షణమైనది కరుణ. కరుణకు నిమిత్తభూతమై అర్థ ప్రధానమైనది రౌద్రము. కామార్థములు, ధర్మమూలకములు గావలెను. అందుచే ధర్మ ప్రధానమగు వీరము తర్వాత చెప్పబడినది. వీర రసము భీతాభయప్రదాన సారమగుటచే తదనంతరము భయానకము వచ్చుచున్నది. తద్విభావ సాధారణ్యా సంభావన ద్వారా బీభత్స మా పై చెప్పబడినది. భయానక బీభత్సములు వీర రసముచే నాక్షిప్తములు. వీర రసము అద్భుతముతో సమగ్రమగుచున్నది. ధర్మార్థ కామము లను త్రివర్గములతో కూడియుండి ప్రవృత్తి ధర్మము, విపరీత నివృత్తిధర్మము కలిగి మోక్షఫలకమైనది శాంత రసము.

రస విషయమున స్వాత్మావేశ వశముచే రసచర్వణ కలుగును. ఈ రస చర్వణ విభావాది బలముచే వచ్చుచున్నది. కావున భావములను చెప్పవలసి యున్నది. కవికి గాని, నటునకుగాని లౌకిక రత్యాది చిత్తవృత్తులు తెలియనివైనచో తద్విషయక మగు విశిష్ట విభావాద్యాహరణము దుర్లభమగును. అందుచే రసములను నిర్దేశించిన తర్వాత స్థాయి భావములను చెప్పుచున్నాడు.

ఏవఞ్చ భావాన్ వక్ష్యామి స్థాయి సఞ్చారి సత్త్వజాన్. ౧౭

రతి ర్హాసశ్చ క్రోధోత్సాహౌ భయం తథా
జుగుప్సా విస్మయ శ్చేతి స్థాయిభావాః ప్రకీర్తితాః. ౧౮

స్థాయి భావములను, సంచారి భావములను, సాత్త్వికభావములను ఇక నిర్దేశించబోవుచున్నాడు. రతి, హాసము, శోకము, క్రోధము, ఉత్సాహము, భయము, జుగుప్సా, విస్మయము అను ఎనిమిది శృంగారాది రసములకు క్రమముగా స్థాయి భావములగుచున్నవి.

శమము, ఉత్సాహము, జుగుప్స అను వానిలో నొక్కొక్కదానిని ఒక్కొక్క వ్యాఖ్యాత శాంత రసమునకు స్థాయిగా స్వీకరించెను. అన్ని స్థాయిభావములు కలసి శాంతమునకు స్థాయిభావమని కొందరనినారు. కొందరు నిర్వేదమే స్థాయి అనిరి.

స్థాయి భావముల నాధారముగా చేసికొనియున్న రస ప్రతీతి మానసికానుభూతిని ఆత్మానుభూతిని ఇచ్చునది. చిత్తవృత్త్యాత్మకమైన దగుటచే స్థాయీభావ ప్రవృత్తి ప్రయోజన సహితము. ఈ ప్రయోజన మితరభావముల ద్వారా, ప్రవృత్తుల ద్వారా, అవగతమగుచున్నది. ఈ అవగతి చైతన్యముకంటె భిన్నమైనది కాదు. పైగా అవగతి అర్థరహితముగాదు. అర్థను జ్ఞానాకారము. అనగా చైతన్యము, జ్ఞానము అనునవి పర్యాయ పదములు. అనుభూతిలో విషయము లన్నియు జ్ఞానమున లీనమగుచున్నవి. ఈ యనుభూతి చేతనుడగు వ్యక్తికి కలుగునది.

స్థాయి భావములకు పరస్పర సంబంధము కలదు. అందుచే నొకే ఒక ప్రవృత్తిలో అనేక స్థాయి భావములు కన్పించ వీలున్నది. కాని వీటిలో నొక్క స్థాయి భావమే ప్రధాన మగును. మిగిలినవి దీనికి అంగములు కాగలవు. ఒక స్థాయి భావమున కంగములగు మిగిలిన స్థాయి భావములు సంచారిభావములవలె ప్రవర్తించ గలవు. అనగా సందర్భవశమున ఒకే ఒక చిత్తవృత్తి స్థాయి భావముగాను, సంచారి భావముగాను కూడా కన్పడును. సజాతీయ విజాతీయ భావాంతరములచే తిరస్కృతము గాక ఉపనిబధ్యమానములగు రత్యాదులే స్థాయిభావములని అవలోకకారుడు నిర్వచించి యున్నాడు.

శ్రీమద్రామాయణ కల్పవృక్షము - శిల్పదృష్టి

అ వ తా ర ఖ ం డ ము

౩

దేవతలట్లు సర్వజగతీపతి వారిజ నాభు స్తోత్ర సం
భావనచేసి చేసి తమ బాధలు జ్ఞప్తికి వచ్చి దైన్యదు
ర్ధీ వికలాత్ములై త్రిజగతీపతిఁ గాంచిరి బాష్పనేత్రులై
తీవలు పూలుగాఁ ద్రిజగతీ పతి మైఁ ద్రిసహస్ర నేత్రముల్.

ఇంతవరకు భగవంతుడు రామావతారాది ముఖమైన లక్షణములతో దేవతలకు కనిపించెను. దేవతలుస్తోత్రములు చేసినప్పుడు తత్పూర్వ పద్యములయందు రామావతారము స్ఫురించుచున్నను, వారు తద్భావముతో స్తోత్రము చేయలేదు. ఇప్పటికి— వారికి తమబాధలు జ్ఞాపకమునకు వచ్చినవి. దైన్యదుర్ధీవికలాత్ములైరి — దైన్యముచేత, మంచి స్థితిని బాసిన బుద్ధిచేత, కదలిన యాత్మలు కలవారైరి - దైన్యము బుద్ధి యందలి సుస్థితాలక్షణమును తొలగించును. ఈ దేవతలు బాష్పనేత్రులై - త్రిజగతీపతియైన ఇంద్రుని వంకగాంచిరి. త్రిజగతీపతి యనగా ఇంద్రుడు. ఇంద్రునకు వేయి కన్నులుకలవు. దేవతలొక వేయిమంది. ఇది యూరక ఉపలక్షకమైనమాట. వారు మూడుకోట్లమంది. అందరు నచ్చటికి రాలేదు. కొందరేవచ్చిరి. వారొక వేయిమంది యుండుదురనిపట్టి బహుత్వ వివక్ష చేయుమాట. వారువేయిమంది యైనచో వారివి రెండువేలనేత్రములు. ఇంద్రుని మేనసహస్ర నేత్రములు కలవు. మూడువేల కన్నులగుచున్నవి. అవియన్నియు త్రిజగతీపతిమేన తీవలును. పూలుగానైనవి! సర్వదేవతలు దేవేంద్రుని జూచిరని యర్థము. వారికి తానాశ్రయమగుటచేత - ఇంద్రునియందే యాధిక్యము భాసించుచున్నది. భగవంతుడైన విష్ణువితో నందరు మాటాడ లేరుగదా! నాయకుడైన వాడే మాటాడ వలయును.

త్రి సహస్ర నేత్రములలో
ని సిలుగు వెసరెక్కి రెండు నేత్రము లందున్
మసల దివిషదీశుఁడు సాఁ
రసగర్భునివంకఁ బొంగురాఁ గనుఁగొనియెన్.

ఆ మూడువేలకన్నులలో బాధలుకలవు; అనగా దేవేంద్రుడుకూడ బాధ పడుచునే యున్నాడని యర్థము. దేవతల కొఱకేకాదు, తన కొఱకును. దేవేంద్రుడు - భగవంతునితో జెప్పికొనవలయును.

మానవలోకము యొక్క స్వభావ మేమనగా - అనగా జీవలోకము యొక్క స్వభావము. ఎవ్వరితోనైన పనియున్నప్పుడు తమరు తమరుగాపోయి తమపనినిగూర్చి చెప్పరు. ఎవరిచేతనో చెప్పించుకొందురు. అందుచేతనిది దేవేంద్రునికిగూడ బనియే. తానును చెప్పలేదు. ఆయన యీ బాధలన్నియు తన రెండుకన్నులలో కనిపింపగా - బ్రహ్మదేవుని వంకజూచెను. ఈ దివిషదీశుడు - అనగా ఇంద్రుడు సారస గర్భునివంక (బ్రహ్మవంక) జూడగా - నా సర్వ దుఃఖభావము వానికన్నులలో పొంగుగా కనిపించెను.

తల కదలలేదు కన్నులు
చలింపలే దమరపతికి జలజాసనుఁడా
వెలుఁగు లోలయు దారులలోఁ
దెలిసెను దొలి మునికిఁ దెలుప దేవత లిడుమల్.

కాని ఇంద్రుడు చక్రవర్తి. ఆయనయు నోరుతెరిచి మాటాడడు. అది యొకటీవి. బ్రహ్మవంక జూచెను. ముల్లోకముల కధిపతియైన ఇతని యూహ ఇది యని బ్రహ్మ తెలిసికొని చెప్ప వలయును. అందుచేతనే అమరపతి కదలలేదు. కన్నులు చలింపలేదు. ఇది ఇంద్రుని యొక్క త్రిజగత్పతిత్వలక్షణము, అతని కన్నుల వెలుగులు సాగు దారులలో దేవతల ఇడుములు తొలిమునియైన విష్ణువునకు తెలుపగా (వలయునని బ్రహ్మ తెలిసికొనెను) -

జలజనాభుని నాభిదేశంబుఁ జూచి
కే ల్మోగిడ్చి విధాతృండు కేశవుని ము
ఖంబుఁ జూచి దేవతల ముఖంబులుగని
యింద్రుఁ గాంచుచు మునితోడ నిట్టు లనియె.

ఈ బ్రహ్మ విష్ణుమూర్తి యొక్క నాభిదేశమందు జన్మించెను. అది తన జన్మ దేశము. కనుక విధాతృడు తనజన్మస్థలమైన భగవంతుని నాభిదేశమునకు నమస్కరించెను. భగవంతుని ముఖము చూచెను. దేవతలమొగము చూచెను. అప్పుడు భగవంతునితో నిట్లనెను - కేశవుని మొగము చూచుట ఎందుకనగా - నిట్టివార్త చెప్పుటకు భగవంతుడు ప్రసన్నముగా నుండెనా లేదా యని తెలిసికొనుటకు. ఆయన ప్రసన్నముగానే యున్నాడు. ఈ వార్త చెప్పవలసినంత యవసరమున్నదా లేదాయని దేవతల వంక జూచినాడు. వారి మొగములును దీనములుగానే యున్నవి. వీరిస్థితి మిక్కిలి దీనముగానున్నది. అందుచేత చెప్పుట న్యాయము - భగవంతుడు ప్రసన్నుడుగానే యున్నాడు. చెప్పవచ్చును - ఈ స్థితిలోకమునందలిదే. కథ యందా రోపింప బడినది. ఆ బ్రహ్మ భగవంతునితో చెప్పుచున్నాడు - మాటలు భగవంతుని కొఱకు - తాను చూచునది ఇంద్రునివంక - ఇదియేమి? - ఇదియు లోక వృత్తమే. తానడుగ బోవు పనితనది కాదు. దేవతలది - అని భగవంతుడర్థము చేసికొనవలయును. మరియు దాను చెప్పుమాటలు దేవేంద్రున కనుకూలముగా నున్నవో లేవో - అందుకని యాతని వంక జూచుట:—

ప్రభు నన్నుఁ జెప్పు మనెదరు
ఋభువులు దశకంధ రాధరీ కృత తేజో
విభవులు దినదిన గండము
విభు! నూఱేండ్లాయువయ్యె వీరల బ్రదుకుల్.

ఇంక వారిఇడుములను చెప్పుటకు బ్రహ్మదేవుడా రంభించెను.

అయ్యా! (ప్రభువా!) ప్రభువనగా సమర్థుడు.) యేకష్టము దేవతలు చెప్పికొనుటకు వచ్చినారో ఆ కష్టములు తీర్చుటకు భగవంతుడు సమర్థుడు అందుచేతనే చెప్పికొనుట. అందు కనియే ప్రభువన్న సంబోధన. ఈ ఋభువులు (దేవతలు) దశకంధరునిచేత క్రిందు పరచ బడిన తేజోవైభవము కలవారు - నన్ను చెప్ప మనుచున్నారు. స్వామీ! వారి బ్రదుకులు దినదినగండము - నూరేండ్లాయువులుగా నున్నవి! ఈ యొక్క మాటలో వారి కష్టము

లన్నియు చెప్పబడినవి. కష్టము లెవరివలన ప్రాప్తించినవో చెప్పబడినది. ఇంక మిగిలిన దేమున్నది? చెప్పవలసిన దేమున్నది? దేవతలు కష్టబడినచో బ్రహ్మదేవునకేమి? వారు పడెడి కష్టముల బాధ తనకేమియున్నది?- తాను వారియందు కొంత దయ కలిగి యుండవచ్చును. మధ్యవర్తి యేమనును? [అవునండీ - చాలా బాధపడుచున్నారు.] ఈ మాత్రమే,

వరము లొసంగకుండినఁ దపస్సులు చేయరు చేసి రేని గా
పురుషులకున్ వరా లొసఁగ బో మని చెప్పఁగలేదు దానఁ గా
పురుషులయందు వాని ఫలముల్ విపరీతములౌఁ దపస్సులున్
వరములు దైత్యు లీ వరుస స్వర్గ సముచ్ఛ్రయ కృచ్ఛ్రతాప్తియౌ.

కాని ఇందులో నొక రహస్యమున్నది. ఈ దేవతలు బాధపడుటకు కారణము తానే: ఏలననగా - బ్రహ్మయిచ్చిన వరములచేత రావణుడు బలిసినాడు. బ్రహ్మ సిఫార్సు చెయ్యబోగా విష్ణు విట్లనవచ్చును; నీవేకదయ్యా, వానికి వరములిచ్చితివి: వీరి యాపదలకు హేతువునీవే. అని విష్ణువనవచ్చును. తానేమిచేయగలడు? - నీవేవానికి వరములిచ్చితివి. వాడుబలిసినాడు, దేవతలను బాధించుచున్నాడు ఇప్పుడు వారి బాధలను తీర్చుమని నా వద్దకు వచ్చినావు - మొదలయినమాటలు భగవంతుడనవచ్చును. అందుచేత బ్రహ్మ తన యందున్న దోషమును పరిహరించు కొనుటకీ మాటలనుచున్నాడు:

లోకమునందు తపములు చేయుదురు. ఎందుకు చేయుదురు? వరము లర్థించిచేయుదురు? వరము లియ్యకపోయినచో తపస్సులే చేయరు. తపస్సులే చేయకపోయినచో లోకము లేదు. ప్రవృత్తి లేదు. ప్రవృత్తి యున్నది గనుక లోకము సాగుచున్నది. బ్రహ్మ విష్ణు మహేశ్వరులున్నారు. లేనిచో నెవ్వరునులేరు. అందుచేత తపస్సు లోక ప్రవృత్తికి మూలమైనది. ఈ సిద్ధాంతము మీద బ్రహ్మ మాటాడుచున్నాడు. ఈలోకముల కధిపతులైన వారు జనులనుండి తపస్సును వాంఛింతురు [సామ్యమును చెప్పవలసినచో నేటి విద్యావిధానము చూడవచ్చును. ఉద్యోగము లిచ్చుచున్నారు గనుక పరీక్షలకు చదువుచున్నారు. రాజ్యాంగము సాగవలయునన్నచో విద్య యుండవలయును. కనుక రాజ్యాంగము విద్యమీద యాధారపడియున్నది. చదువుకొన్నవారు లంచములు పుచ్చుకున్నచో విద్యా విధానమేమి చేయును? మంత్రులేమి చేయగలుగుచున్నారు?] ఈ విద్యవంటి తపస్సు. వరములీయకపోయినచో తపస్సులు చేయరు. కాపురుషులు [దుర్మార్గులు] తపస్సు చేసినచో మేము వరము లియ్యమనుటకు వీలులేదు. వాడు సజ్జనుడో - దుర్జనుడో - పరీక్ష ఇచ్చినాడు. ఉద్యోగమీయ వలెను. వాడవుతో కాదో ఇప్పుడేమి తెలియును? ముందు తెలియును. అట్లే రావణాదులు తపస్సు చేసిరి. బ్రహ్మవరములిచ్చెను. తరువాత వారు లోకములను బాధింప నారంభించిరి. వాడు లంచగొండి గనుక - వానిని నీళ్ళు దొరకని స్థలమునకు బదిలీ చేయుటయో - ఉద్యోగమునుండి తొలగించుటయో - వాని వేతనము వృద్ధి పొందకుండ నాపుటయో-మొదలయిన పనులు వాని తరువాతి ప్రవర్తననుబట్టి చేయదగినవి. బ్రహ్మదేవుడనుచున్న మాటల యర్థమది – తపస్సు చేసినాడు. వరము లిచ్చినాము. ఈయమనుటకు వీలులేదు. ఇచ్చుట మూలముగా దుర్జనులయందు వాని ఫలములు విపరీతములగును. ఇట్లు జరుగక తప్పదు. కనుక తపస్సులు, వరములు, దైత్యులు - ఈ వరుస యున్నది. ఇది స్వర్గముయొక్క సముచ్ఛ్రయము (అభ్యుదయము), కృచ్ఛ్రత (ఆపత్తు) ఇవి రెండును పొందుట కగుచున్నవి. సత్పురుషులు తపస్సు చేయుదురు. దానివలన స్వర్గమునకు సముచ్ఛ్రయము కలుగును. కాని దైత్యులు చేసినచో స్వర్గమునకు కృచ్ఛ్రత కలుగును.

అనఁ దురాషాట్టు కలిపించుకొని తపములు
చేయవచ్చును వరములు నీయవచ్చు
నీ యనదరక్కసుల కది యెంత సేప
టికిని స్వర్గముపైఁ జూపఁజే యనంత !

బ్రహ్మ రెండుమాటలు చెప్పెను. మొదటి మాటలో టూకీగా దేవతల కష్టములు చెప్పి రెండవదానిలో సిద్ధాంతమును చెప్పెను.

ఆయన బ్రహ్మదేవుడుగనుక యతనిబుద్ధి సర్వవేళల సర్వజగత్తున ప్రధాన విషయముల యందు ప్రవర్తించునుగాని స్వల్ప విషయములయందు ప్రవర్తించదు. అంతటి మహానుభావుడట్లే మాటాడును. సిద్ధాంతములు చెప్పినచో బాధ పడుచున్నవాని బాధలుతీరునా? బ్రహ్మ మొదలుపెట్టెను ఇంద్రుడతను మొదలుపెట్టుటయే కావలెను. తక్కినవి తానే చెప్పుకొనును. ఆ బ్రహ్మకన్నియు నెప్పుడును తెలియవు. ఆయన, జీవులు — వారి కర్మలు - వారిసంస్కృతులు- వీటినిగురించియే ఆలోచించు కొనుచుండును. అందుచేత తానే కల్పించుకొనవలెను. తానే చెప్పికొనవలెను. దేవేంద్రుడును తక్కువవాడుకాదుగదా: బ్రహ్మచెప్పిన తపస్సులు, వరములు మొదలయిన మాటలు కావనుట కెట్లు? అది మూల సిద్ధాంతము. అప్పుడు తురాషాట్టు [ఇంద్రుడు] కల్పించుకొని ఇట్లనినాడు; తురాషాట్టనగా- శత్రువులయొక్క వేగమును సహింప గలవాడు అని వ్యుత్పత్త్యర్థము. అనగా నతనిముందు శత్రువులు నిలువ లేరని యర్థము. తన ముందు శత్రువులునిలువలేరు. తనకు శత్రువులయిన రాక్షసులు తన్ను మించినారు. దీనికి కారణము బ్రహ్మయిచ్చిన వరములు. ఆ వరముల విషయములో నితనికి కోపము. [ఇచట తురాషాట్టన్న శబ్దము ప్రయోగించుటలోనున్న సార్థకత్వమిది.]

తపములు చేయవచ్చు వరములుకూడా నీయవచ్చు - కాని యీ యనాథరాక్షసులకు యెంతసేపటికిని స్వర్గముమీదచూపే! - అని ఇంద్రుడన్నాడు. ఇందులో బ్రహ్మమీద నాక్షేపణ కలదు. వీడేం క్రొత్తరాక్షసుడా — రాక్షసుల కందరికిదేవని యాయెను, వాడుతపస్సుచేసి వరములడిగెననగా - వాడు స్వర్గముమీద దండెత్తుటకే యడుగుచున్నాడు. ఇది యందర కును తెలిసిన విషయమే - కనుక బ్రహ్మదేవునకుకూడ తెలియవలెను. బ్రహ్మ, రాక్షసులు తపస్సు చేసిరని వరములిచ్చుట న్యాయముకాదు. ఇచ్చట తపస్సులు చేయుటయు, వరములిచ్చు టయు - నన్న మూలసిద్ధాంతము పట్టదు - అని ఇంద్రుని భావము. ఇన్నిమాటలతో ఇంద్రు డనడు. ఆ భావమింద్రుని మనస్సులోనున్నదని యందరకు తెలియును. బ్రహ్మకును దెలి యును. బ్రహ్మయొక్క మూల సిద్ధాంతమును బట్టి కొని వ్రేలాడుచున్నాడుగాని - పరిణామ దశ యందది యెట్లుండునన్న విషయము నాలోచించుటలేదు, దానినాలోచించి చేయుట బ్రహ్మ యొక్క విధి - అన్నట్లుగా నింద్రుని భావము.

తరువాత వచ్చెడు పద్యములన్నియు నింద్రుడు తన కష్టములను చెప్పికొనుట - తరువాత పండ్రెండు పద్యములలో నింద్రుడు తన కష్టమును చెప్పికొనెను. అయిదు పద్యములలో నగ్ని చెప్పెను. మూడు పద్యములలో యముడు చెప్పెను. నిరృతియొక్క పద్యములోను, వాయువు మరియుకొన్ని - యీ రీతిగా వారివారి కష్టములను వారువారు చెప్పికొనుట జరిగినది.

తత్త్వశాస్త్రము - దాని ప్రయోజనము

బెర్ ట్రండ్ రసెల్

అనువాదం జీ. ఎస్. ఎన్.

౧౨౮

ఇంతవఱకును, తత్త్వశాస్త్ర సమస్యలనుగూర్చి చాల సంగ్రహముగను, చాలావఱకు నసంపూర్ణముగను సింహావలోకన మొనరించితిమి. ఇంక నీయుప సంహారవ్యాసమున, తత్త్వశాస్త్రమునకుగల పరమ ప్రయోజనమును, దాని ననుశీలము చేయుటకుగల హేతువును మనము పర్యాలోచింప వలసియుండును. ఈ విషయమై చర్చింపవలసిన యావశ్యకత నాటికి నధికమగుచున్నది. ఏలన, విజ్ఞానశాస్త్ర ప్రాభవము వలననేమి లౌకికవ్యవహారముల ప్రాభవమువలన నేమి, చాలామంది, తత్త్వశాస్త్రమనగా ఇదమిత్థమని నిర్ణయించుటకు వీలులేని విషయములపై వివాదములను పెంచుచు, నిష్ప్రయోజనములును, అప్రధానములు నునగు వాద భేదములకు ప్రాముఖ్యము నొసగు కాలదంతపరీక్షయని భావింప నుమ్ముఖులగుచున్నారు.

తత్త్వశాస్త్రమునుగూర్చి యిట్టి యభిప్రాయము వ్యాప్తిలోనుండుటకుగల కారణములు రెండు. జీవిత లక్ష్యములను సరిగా నర్థము చేసికొనకపోవుట యొక కారణము. తత్త్వశాస్త్రము గడింపవలసిన జ్ఞాన సామగ్రిని సరిగానర్థముచేసికొనకపోవుట రెండవ కారణము.

అనేక సూక్ష్మయంత్రములను కనుగొని విజ్ఞాన శాస్త్రము, దాని విషయమై యేమియును తెలియని యశేషప్రజానీకమున కత్యంతోపయుక్తముగానున్నది. కావున నాశాస్త్రమును చదువు జిజ్ఞాసువు పైననేగాక మొత్తముమీద మానవజాతి యంతటిపైనను ప్రాభవము జూపుటచే విజ్ఞాన శాస్త్రాధ్యయనావశ్యకత మరింత యధికమగుచున్నది. దీనివిజట్టి తత్త్వశాస్త్రాధ్యయనమునకు ప్రత్యక్ష ప్రయోజనమేమియునున్నట్లు కనపడదు. దానికి ప్రయోజనమేమైన నున్నచో, (దాని నధ్యయనముచేయు వ్యక్తుల జీవితముపై జూపు ప్రాభవము ద్వారా) నది పరోక్షమైనదైయుండవలెను. ఇట్టి ప్రాభవమును గడించుటకే తత్త్వశాస్త్రము నధ్యయనము చేయవలసియుండును

కాని తత్త్వశాస్త్ర ప్రయోజనమును నిర్ణయించుటకు జేయు ప్రయత్నములో - కృతకృత్యులము కావలయునన్నచో లౌకికులనిపొరపాటుగావ్యవహరింపబడెడి కొందరు మనలో కలుగజేసిన దురభిప్రాయముల నుండి మన మనస్సులు విడివడవలెను. ఈ లౌకికుడను పదమును - మనుష్యుల శరీరమునకే ఆహారమవసరమని గుర్తించి, మనస్సునకు గూడనట్టి యాహార మక్కఱయున్నదను సంగతిని గుర్తింప నిష్టగింపక మానవుని భౌతికావసరములకే ప్రాధాన్య మొసగువాడను నర్థములో వాడుచున్నారు. మనుష్యులందరికిని యెట్టియిబ్బందులులేకయున్నను దారిద్ర్యము, రోగములు చాలవఱకు నుపశమించినను ఇంకను మంచి సమాజమేర్పడుటకు మానవులు సాధింపవలసిన దెంతయోగలదు. వర్తమానమగు ప్రపంచమునగూడ శరీరసుస్థితికి ఒకానొక సామగ్రి యవసరమైనట్లే, మానసిక సుస్థితికిగూడ నొకానొక సామగ్రి యవసరము. మనస్సునకునవసరమగు జ్ఞానసామగ్రిని సమకూర్చుటలోనే తత్త్వశాస్త్రము ప్రాధాన్యము వ్యక్తమగును. ఇట్టి సామగ్రి మనస్సున కావశ్యకమని గుర్తెంచినవాడే, తత్త్వశాస్త్రాధ్యయనము వృథాకాలహరణము కాదని గ్రహింపగలడు.

ఇతరశాస్త్రములవలెనే, తత్త్వశాస్త్రము లక్ష్యముగూడ జ్ఞానసముపార్జనము. దానికి లక్ష్యభూతమగు జ్ఞానము, వివిధ విజ్ఞానశాస్త్రముల నడుమ నమైక్యమును కుదుర్చుచు, వానికొక వ్యవస్థను కల్పించునట్టిది మనకుగల నమ్మకములకును, నభిప్రాయములకును, గల హేతువులను సవిమర్శముగా పరిశీలనము చేసిన మీదట విగ్గుగా తేల్చునట్టిది. కాని తాను లేవనెత్తిన ప్రశ్నములకు కచ్చితముగా సమాధానములు చెప్పవలెనని యందులకై చేసిన ప్రయత్నములో తత్త్వశాస్త్రము సఫలమైనట్లులేదు. ఒకగణిత శాస్త్రజ్ఞుని, ఒక చారిత్రకుని, లేక విజ్ఞాన శాస్త్రమునకు సంగమైన యే ప్రత్యేక శాస్త్రమున కృషిసల్పినవాని నైనను - మీమీ శాస్త్రములు విగ్గుగా తేల్చిన సత్యము లేవియని యడిగినచో, వీరు వినగల్గిన యోపిక యున్నంత వఱకును చెప్పుటకు వలసిన జ్ఞాన సామగ్రి వానికడగలదు. అదే ప్రశ్నమును తత్త్వశాస్త్రజ్ఞు నడిగినచో నతనికడనుంచి యిదమిత్థమనియొక సమాధానము మనకు లభింపదు. ఏవిషయమునుగూర్చి యైనను సిద్ధాంతము చేయబడిన జ్ఞానము లభించినచో, నది విజ్ఞాన శాస్త్రమైపోవును. దానికి తత్త్వశాస్త్రమను

వ్యవహారముగూడబోవును. ప్రస్తుతము నక్షత్ర శాస్త్రమునకు చెందిన నభోరంగ పరిశీలన యంతయు నొకప్పుడు తత్త్వశాస్త్రము క్రింద నంతర్భూతమయ్యెను. న్యూటన్ వ్రాసిన మహాగ్రంథము 'కేవలతత్త్వశాస్త్రమునకు సంబంధించిన గణిత శాస్త్రసూత్రములు'. అట్లే మానవుని మనస్సునుగూర్చి చేసిన పరిశీలనము తత్త్వశాస్త్రముననే జరుగుచుండెను. కాని యిప్పుడది విడివడి మనస్తత్త్వశాస్త్రముగా రూపొందినది. కావున తత్త్వశాస్త్రమునకుగల యనిశ్చితత్వము చాలవఱకును స్థూలముగా ప్రైకి కప్పించునదేగాని వాస్తవముకాదు. తత్త్వశాస్త్రము బయలుదేర దీసిన సమస్యలకు స్పష్టమైన సమాధానములు లభించినచో, నవియన్నియు నొక్కచో జేరి యొక విజ్ఞాన శాస్త్రాంగముగా నేర్పడు చున్నది అట్టిసమాధానము లభింపని శేషభాగమే తత్త్వశాస్త్రమని వ్యవహరింపబడును. ఇదితత్త్వశాస్త్రమునకు సంబంధించిన యనిశ్చితత్వము విషయమై తెలిసిన సత్యైక దేశమే. అనేక సమస్య లున్నవి. వానిలో కొన్ని మనయాధ్యాత్మిక జీవితమున నత్యంతప్రాధాన్యము వహించునవి కొన్నిగలవు. మనకు తెలిసినంతవఱకును మానవుని మేధస్సు ఆ సమస్యలకెట్టి పరిష్కారమును కల్పింపజాలదు. (ఆమేధశ్శక్తి ప్రస్తుతమున్న దానికి భిన్నమైన వ్యవస్థలోనున్నచో నేమగునో.) ఈ ప్రపంచమునకొక నిర్మాణ పద్ధతి యనునది యున్నదా? దానికొక ప్రయోజనమున్నదా? లేకయది యనే కాణువుల సంయోజనముచే కాకతాళీయముగ నేర్పడినదా? చైతన్యమనునది, ఎప్పటికప్పుడు మానవాభివృద్ధి తప్పదని వెఱ్ఱియాశలు కల్పించుచు, నీ జగత్తులోని నిత్యమగునేకదేశమా? జీవనము, అసంభవమైపోవు గ్రహముపైన జరిగిన మూన్నాళ్ళముచ్చటయేనా? ఈ జగత్తులోని మంచి చెడ్డలకు ప్రాముఖ్యమేమైనగలదా లేక అవియొక్క మనుష్యుని దృష్టిలోనే యున్నవా? తత్త్వశాస్త్రమిట్టి ప్రశ్నము లనిశము వేయుచునేయుండును. ఆశాస్త్రజ్ఞులు వేర్వేఱు రీతులుగ వానికి సమాధానము చెప్పుచున్నారు. కాని - (ఇంకొక విధముగ తృప్తికరములగు సమాధానములు లభించునో లేదో, మనముచెప్పలేము)- తత్త్వ శాస్త్రము సమకూర్చిన సమాధానములు అనుభవసిద్ధములుకావు; అందుచే నయదార్థములు. అయినను, అట్టిప్రశ్నములకు నసందిగ్ధమైన సమాధానము లభించుట యెంతకష్టమైనను, వానివిషయమై సమాలోచనము నెల్లప్పుడును కొనసాగించి, వాని ప్రాముఖ్యమును సర్వవిధములగుర్తించి, వానివి గూర్చిన సర్వ విచారణా మార్గములను సునిశితముగ పరీక్షించి - కేవలము నిర్దిష్టమగు జ్ఞానముననే మనము పరిమిత మొనర్చుకొన్నచో-నశించిపోవుటకు వీలైన- జగద్రహస్య విచారణా శీలతను నిత్యజాగృత మొనరించుటయే కొంతవఱకును తత్త్వశాస్త్రప్రయోజనమని చెప్పవచ్చును.

తత్త్వశాస్త్రము అట్టి ప్రధానములగు ప్రశ్నములకు వచ్చిన సమాధానముల యాథార్థ్యమునుస్పష్టముగా నిరూపింపగల్గునని కొందరు తత్త్వశాస్త్రజ్ఞులు చెప్పినమాట నిజమే. మతవిశ్వాసములలో నధిక ప్రాధాన్యము వహించు కేవలము ననుభవముచే యదార్థములుగా నిరూపింప వీలగునవేయని యా శాస్త్రజ్ఞులు భావించిరి. అట్టి ప్రయత్నములకు సంబంధించి యుచితమగు నిర్ణయము చేయవలెనన్న మనము మానవ విజ్ఞానమును గూర్చిన సింహావలోకనము చేయవలెను. అట్టి జ్ఞానమును సాధించుట కవలంబించు విధానములనుగూర్చియు, వానికిగల పరిమితులను గూర్చియు నొక యభిప్రాయము నేర్పరచుకొనవలెను. అట్టి విషయముపై నిశమిత్తమని ఖచ్చితముగా నిర్ణయము చేయుటలో నంతవివేకము తప్ప ద్రదు కాని యింతకు పూర్వము మనము సల్పిన చర్చలన్నియు మనలను తప్పుత్రోవ పట్టింపకుండ నుండవలెనన్న - మన మతవిశ్వాసములకు శాస్త్రీయమగు నిరూపణములను కనుగొను నాశనుపీడవలయు నేమోయని మనకనిపించును - తత్త్వశాస్త్ర ప్రయోజనములో భాగముగ. నట్టి ప్రశ్నములకిట్టి నిర్దిష్టములైన సమాధానములను అంతర్భూత మొనరింపలేము. కావున తత్త్వశాస్త్రము నధ్యయనముచేయు వారు సాధింపవలసిన ఎట్టి నిర్దిష్ట జ్ఞాన పుంజముపైనను తత్త్వశాస్త్ర ప్రయోజన మాధారపడి యుండుటకు వీలులేదు.

తత్త్వశాస్త్రప్రయోజనము దానికిగల యనిశ్చయత లోనే యన్వేషింప వగును. తత్త్వశాస్త్ర వాసన చొత్తుగా లేనివాడు, లోకజ్ఞానము వలన తన జాతిలోను, కాలమునందును, పూర్వము నుండియు సంప్రదాయ సిద్ధముగ సంక్రమించిన సంస్కారములలోను, బుద్ధికృతమగు హేతువాదము తోడ్పాటు లేకయే పెరిగిన విశ్వాసములవలన ఏర్పడినసంస్కారములలోను బందీయై జీవితమును కొనసాగించును. అట్టివాని దృష్టిలో నీ ప్రపంచమును గూర్చి తెలియని దేమియును లేదనిపించును. సామాన్యముగ మనకు లోకమున గనిపించు వస్తువులు వారి కెట్టి సందేహములుగాని జిజ్ఞాసగాని గల్గింపదు, మన లౌకిక విజ్ఞానమున కందుబాటులోలేని యపూర్వావకాశములను అట్టివారు సులభముగా ఖండింతురు. అట్లుకాక, మనము మొదటి యధ్యాయములలో తెలిసికొన్నట్లు - దైనందిన విషయము లనేక సమస్యలను

బయలుదేర దీయుననియును. దీనికి సమగ్రమగు సమాధానము దొరకదనియును, తత్త్వశాస్త్ర విచారణ కొలదిగా చేసిన పిమ్మట నవగత మగును. తాను ముందుగా బయలుదేర దీసిన శంకలకు సరియైన సమాధానమేదో నిశ్చితముగా జెప్పజాలక పోయినను, మన యాలోచనా పరిధిని విస్తృత మొనరించి, ఆచార శృంఖలమునుండి వారి మనస్సులను విముక్త మొనరించు మహావకాశముల ననేకిని తత్త్వశాస్త్రము సూచింప గల్గుచున్నది. వస్తువులు స్వరూపతః ఎట్లుండునో అను విషయమై మనలోగల నిశ్చితాభిప్రాయము సడలిపోయినను, అవియేవైయుండనగునో అను విషయమై మనజ్ఞాన మున్నెత్తుగా పెరుగును - అట్టి జ్ఞానము సందేహములను వెలిబుచ్చి శాస్త్రీయముగ విషయములను తెలిసికొనవలెనన్న యాసక్తిగూడలేని వారిలో నెలకొనియున్న సాహంకారమగు పండి తమ్మన్యత్వమును సమూలముగ పెకలించివైచును. లోకమున సర్వసాధారణముగ పరిచితములైన వస్తువులనుగూడ నపరిచితమైన సరళిలో వ్యాఖ్యానించి మనలోని జగ్రద్రహస్య జిజ్ఞాసను అట్టిజ్ఞానము జాగృత మొనరించును.

కేవలము ఇట్టి మహావకాశములను సూచించుట లోనే, తత్త్వశాస్త్రప్రయోజనము సంపూర్ణముగా నభివ్యక్తముకాలేదు అది విచారణము సేయు మహా విషయములనుబట్టి, దానికిగల ప్రయోజన ప్రాముఖ్యము పెరిగినది ఇట్టి విచారణము చేయుట వలన మనస్సు నావహించియున్న సంకుచితతత్వమునుండియు స్వార్థపరత్వమునుండియు ముక్తిని గల్గించుటలోగూడ దాని ప్రయోజనము వ్యక్తమగును. ఇట్టితత్త్వజిజ్ఞాసనునోచు కొనని వాని జీవితము తనస్వార్థమనెడి విషచక్రములో చిక్కుకొని పోవును. అందులో కుటుంబ మిత్రములుగూడ నంతర్భూతము కావచ్చును. దానిలో సహజసిద్ధముగా బయలుదేరు కోరికల పరిధిలోని వచ్చుదానికి తోడ్పడినదో అవరోధము కల్పించినదో తప్ప - లేనిచో బాహ్యప్రపంచము అట్టివానికి పట్టదు. అట్టి దానిజీవితమును కుంటుపరచి పరిచ్ఛిన్నముచేయు నదేదో యొకటియుండును. తత్త్వ జిజ్ఞాసతో కాలమును వెడల బుచ్చువాని జీవితమిందుకు విభిన్నముగా నతిప్రశాంతమై, స్వచ్ఛందమైయుండును. స్వార్థమయమగువైయక్తిక ప్రపంచము చాల సంకుచితమైనది. శక్తిమంతమగు నీ విశాల ప్రపంచములో బడి యది నలిగిపోవును. వెలిగానున్న ప్రపంచము నంతను మనస్వార్థములో నంతర్భూతము కావించుట కనువుగా దానిని విస్తృత మొనరింపనిచో, శత్రువు మనము తప్పించుకొనుటకు వీలులేకుండ నవరోధము కల్పించినా డనియును, చివరకులొంగిపోవుట తప్ప దనియును తెలిసి ముట్టడి జరిగినకోటలో నిస్సహాయమైన సైనికులవలె నతి విషమ పరిస్థితిలో చిక్కుకొని పోదుము. అట్టిజీవితమున శాంతియనునది హుళక్కి నిత్యము ప్రకోపించు కోరికలకును, శక్తి విహీనమగు సంకల్పమునకు నడుమసంఘర్షణము జరుగుచుండును. మనజీవితము, మహోచ్చ దశనందవలెనన్న - ఏదోవిధముగా నీ కారాగారమునుండి, యీ సంఘర్షణమునుండి మనము బయట పడవలెను.

దానికి నుచితమార్గము తత్త్వచింతనమే:- (విశాల దృక్పథముతో సమీక్షించుట దాని ప్రధాన లక్షణ మగుటచే) - జగత్తును - శత్రువులు, మిత్రులు సహాయ్యకులు వ్యతిరేకులు, మంచివారు, చెడ్డవారు విరుద్ధ ధర్మములుగల కూటములుగా, విభేదముచేసి చూచు సృష్టిని ప్రోత్సహింపదు. అది సర్వమును నిష్పక్ష పాతముగా జూచును - పరిశుద్ధమగు తత్త్వచింతనము మిగిలిన ప్రపంచమంతయు మానవునితోనే ముడివడి యున్నదని నిరూపింప బూనుకొనుటను తన లక్ష్యముగా భావింపదు. జ్ఞానసముపార్జనమంతయు నాత్మ వికాసమే దీనిని పరోక్షముగా నన్వేషించినపుడే యీ వికాసము సాధ్యమైనంత యధికముగా లభించును. ఈ వికాసము మన జిజ్ఞాస బాగుగా ప్రవృత్తమైనపుడే సాధ్యమగును. ఈ వస్తువులకీ లక్షణములే యుండవలెనని ముందే నీ యభిప్రాయములను పేర్చుకొనుట కట్టి జిజ్ఞాస యంగీకరింపదు కాని వస్తువులలో గోచరించు లక్షణముల కనుగుణముగా యాత్మను మలచును ఈ అత్మనున్నదున్నట్లుగా దీని కొన్నచో-ఈ ప్రపంచమాత్మకు సజాతీయమనియూ, అందుచే దానికి సంబంధించిన జ్ఞానము దానికి విజాతీయమైనట్లుగా కన్పడు దానినేమియు నంగీకరింపకయె - సాధ్యమగునని నిరూపింప ప్రయత్నించునపుడీ యాత్మ వికాసము కలుగదు. దీనిని నిరూపించుకోరికయే యొకవిధమగు నాత్మోద్ఘాటనము. అది - తాను కాంక్షించు నాత్మవికాసమునకు నవరోధకమున. తత్త్వచింతనలో నీ యాత్మోద్ఘాటనము ప్రపంచమును - తన లక్ష్య సాధనకొక యుపకరణముగానెంచును. కావున అది ప్రపంచమును నాత్మకన్నతక్కువ ప్రాధాన్యము గలదిగా నొనరించును. తనకుగల సామగ్రికి నాత్మ పరిమితులను కల్పించును. అట్లుకాక విచారణ చేయునపుడు, మనమనాత్మతో నారంభింతుము. దానికిగల యౌన్నత్యమునుబట్టి - ఆత్మ పరిధులు విస్తరింపబడును - జగత్తునకుగల యనంతత్వముద్వారా దానిని మననముచేయు మనస్సు ఆయనంతత్వములో పాలు పంచుకొనును

ప్రపంచమంతటిలో మనుష్యుడే సారభూతుడని చెప్పుతత్త్వశాస్త్రములు ఈ యాత్మోన్నతికినెట్టి దోహ

దమును చేయుటలేదు. జ్ఞానమనగా నొక విధమైన యాత్మానాత్మల కలయిక. కలయికయున్నప్పుడెల్లజరుగు రీతిగా నీకలయిక యీ జగత్తును మన యభిప్రాయముల ననుసరించి యర్థము చేసికొనుటకు జేయు ప్రయత్నముచే కలుషితమగుచున్నది. నేడు తత్త్వశాస్త్రమున మానవుడే యన్నింటికిని కొలబద్ద యనియు దేశకాలములు, సామాన్యములనియును; మనస్సుచే సృజింపబడినవి దేనైన నున్నచో, నది తెలియరానిదనియును, అందుచే మనకేవిధముగ నుపయోగములేనిదనియు నను అభిప్రాయమను ప్రవృత్తి యేర్పడుచున్నది. మనపూర్వదర్శనలన్నియును నిర్దుష్టములైనచో నీ యభిప్రాయము యదార్థముగాదు. అంతియకాక, అట్టియభిప్రాయము, తత్త్వశాస్త్రమునకు వన్నెబెట్టు సర్వవిషయములను సహేతుక విచారణ చేయుటకు తీవ్రమగు నవరోధమును కల్పించును. ఏలన అది విచారణమును ఆత్మకే బంధించును. అది జ్ఞానమని వ్యవహరించునది యనాత్మతో కలయిక కాదు. మనకును, మనకు వెలియైన ప్రపంచమునకును నడుమ దుర్భేద్యమగు తెరను కల్పించుచున్న కొన్నికోరికల, అలవాట్ల దురభిప్రాయముల పరంపర ఇట్టిజ్ఞాన సిద్ధాంతమున నాసక్తి జూపువ్యక్తి తన మాటను లక్ష్యము చేయువారెవ్వరును నుండరను భయముచే నింటిపట్టు నెన్నడును విడువని వ్యక్తివంటివాడు.

నిసర్గమైన తాత్త్విక చింతనము అనాత్మకు సంబంధించిన విస్తరణము నందును. చింతితములైన వస్తువులకును చింతించు వ్యక్తికిని ఘనతను కల్పించు సర్వవిషయములందును తృప్తిగాంచును. విచారణ దశలో వైయక్తికమై యొప్పు సర్వమును, అభ్యాసముపైన స్వార్థముపైన నాధారపడియున్న సర్వమును, వస్తువును యథాతథముగా గ్రహింపనీయదు. మానవుని మేధ యన్వేషించు సమన్వయమునుకలుషితపరచును విషయి విషయములకు నడుమ నవరోధమును కల్పించి యట్టివ్యక్తిగత విషయములు, మానవుని మేధస్సున కొక బందీఖానాగా తయారగును. పక్షపాతములేని మేధస్సు దేశకాలాపతితములగు విశ్వాసముల బంధనములో చిక్కువడక, కేవలము తదేకమగు జిజ్ఞాసలో విజ్ఞానాన్వేషణమును కొనసాగించును. అందుచే నట్టి మేధస్సు. వ్యక్తిగత సంస్కారముల ప్రవేశించుటకు వీలులేని సార్వజనీన జ్ఞానమును - వ్యక్తిగతమగు దృష్టిపైన నాధారపడిన యింద్రియ జన్య జ్ఞానముకంటె నధికముగా వెలకట్టును.

తత్త్వవిచారణలో నిష్పక్షపాతమును స్వచ్ఛందమును నగు వైఖరిని జూపుట కలవడిన మనస్సు కర్మప్రధానమును, ఆవేశ ప్రధానమును నగు ప్రపంచమున నదే నిష్పక్షపాతమును, స్వచ్ఛందమును నగు వైఖరిని ప్రదర్శించును. అది దాని లక్ష్యములను, ప్రయోజనములను సవయవిలో భాగములుగ జూచును. విచారణాదశలో ప్రదర్శింపబడు పక్షపాతరహితమగు తత్త్వజిజ్ఞాసయే - యట్టి మనస్సున కుండవలసిన యుత్తమ లక్షణము. అదియే క్రియాప్రపంచమున ధర్మముగా పరిణమించును. ఆవేశమయప్రపంచమున నది సర్వులయెడల సమభావమును జూపు సర్వాత్మభావముగా మారును.

కావున తత్త్వచింతనము మనయాలోచనములకు విషయములైన వానినే కాక మనకర్మలకును మన యావేశములకును విషయములైన వానినిగూడ నధిక ప్రాధాన్యముగలవిగా నొనరించును. అది మనలను ప్రపంచ పౌరులనుగా నొనర్చును. ఈ ప్రపంచ పౌరసత్వములోనే మానవుని నిజమైన స్వాతంత్ర్యమిమిడి యుండును. ఇందే మానవుడు తన సంకుచితములగు భయాశలనుండి విముక్తుడగుటకు సాధనము గోచరమగును.

కావున తత్త్వశాస్త్రప్రయోజనమునుగూర్చి చేసిన చర్చాఫలముగా క్రిందివిషయములు సిద్ధాంతములైనవి. తత్త్వశాస్త్రమును, అది సమస్యలకు కచ్చితముగా నసందిగ్ధములగు సమాధానములను చెప్పు నుద్దేశముతో నభ్యసింపవలెనని మనము చెప్పుటలేదు. మరి యాసమస్యల నిష్పాక్షికముగా ప్రయోజనాపేక్షలేక విచారణ సల్పు నిమిత్తమే దాని యధ్యయనమును కొనసాగింపవలయును. సమస్యలే మనమేధా విలసితమగు మహాశక్తిని పెంపొందించును ఎట్టి జిజ్ఞాసకు నెడమీయక మనమనోవికాసమును కుంఠితమొనరించు సందేహరాహిత్యమును నిర్మూలించును. అంతియకాక తత్త్వశాస్త్రము విచారణను సల్పు ప్రపంచమునకుగల యున్నతిద్వారా, తత్త్వమును, విచారించు మనస్సుగూడ నున్నతమును, నుదాత్తమును నగును. అత్యంతమును హితమగుదానికి నాటపట్టగు ప్రపంచములో సమన్వయమును గాంచుటకు సమర్థమగును.

శశివింశతి

కనగన నరసింహస్వామి

[గత సంచిక తరువాయి]

ముందు వియన్నదీ కుముదముగ్ధల దేరిచి కన్నుదోయికిన్
విందొనరించి, పైన పృథివీ సరసీ సదనోత్పలాంగనా
తుందిల మానసమున్ దిగుచు ధూర్తుడు, దక్షిణ నాయకుండు, పూ
ర్ణేందుడు మీకు భోగము లహీనముగా దయసేయు గావుతన్.

కలశసముద్రమున్ దఱువగా బొడసూపిన వెన్నముద్దయై,
పెళుకుల నీను నక్షత్రమణిఖత్తిక దోచిన భూమి గోళమై,
తిలకము దిద్దికో మఘవుదేవి గ్రహించిన నిగ్గుటద్దమై,
వెలుగులు జిమ్ము పూర్ణ శశిబింబము మిమ్ములరించు గావుతన్.

తామసదుర్వ్యసనిన్ దునుము దారుణమైన లతాలవిత్ర, ము
ద్దామ తమోనరాదముఖ ధామ వినిర్గతదంష్ట్రి యామినీ
కామిని కొప్పునందుఱుము కమ్మని గేదగి పువ్వు రేక, శ్రీ
సోముని రేఖ మిమ్ము సుఖసోమరసమ్ముల గ్రోల్చు గావుతన్.

తన సహజన్మ లక్ష్మి మురదానవభేది భుజాంతరమ్ము నం
దునికిని బొందగాంచి స్వకులోన్నతి నిల్పగ నిశ్చయించి, రు
ద్రుని తలమీద నెక్కి బహుధూర్జటికా లతికాలతాంత హా
వసతను గాంచు శీతరుచి బాలుడు మిమ్ముల బ్రోచు గావుతన్.

కలువమెఱుంగు గుబ్బెతల కౌగిట జేర్పగ సాహసమ్ముతో
కొలకుల నీళ్ళలో నుఱుకు గూఢ చరుండు, పసిండి కోరలన్
దొలకు సుమాసవమ్ములను దోచి నెలంతల ముద్దుమోములన్
బులకలు తేర ముద్దుగొను పూర్ణ సుధాంశుడు మిమ్మునోముతన్.

శుకరథ మెక్కి, షట్చరణ శూరులు కోకిల వంది మాగధ
ప్రకరము వెంటరా, పథిక భామల గొట్టగ నేగు పుష్ప సా
యకు నడుమంతరంపు సిరి కద్దము రేయిని బట్టు మౌక్తిక
ప్రకట సితాతపత్ర ముడుభర్త ధరించుత మిమ్ము నెప్పుడున్ !

మ హా క వి శ్రీ బా ణ భ ట్ట ప్ర ణీ త

పార్వతీ పరిణయము

ఆంధ్రీకరణ: శ్రీ జూలూరి హనుమంతరావు

౪

చ తు ర్థాం క ము

(మునివేషము గ్రహించి నంది ప్రవేశించును)

నంది:- నీల లోహితునిచే నాజ్ఞాపితుడనైతిని "నందీ! పార్వతి మన్మథ దాహముచే భగ్నమనోరథయై నన్ను భావమున నిలిపి మహాంతమగు నియమమును బాటించుచు గౌరీ శిఖరమందుఁ దప మొనరించు చున్నది. తపశ్చర్యయందు నామెబహుకాలము గడపినది. కాన, నీవు మునివేషము గ్రహించి యామె నియమ మెట్టిదో, ఆమె యభిలాషబంధ మెట్టిదో, యామె సఖులగు జయ విజయల ముఖమునఁ దెలిసికొనిరా." అని నా ప్రభు నియోగమును శిరసావహింతును. (అని పరిక్రమించి తర్కించుకొని) స్త్రీల హృదయములు ప్రకృతి కఠినములుగదా! ఎట్లన-

లలిత శోభాశిరీష కోమల శరీర
చతురానంద శశి వికస్వరకళాంగి
కాంచ నిచ్చించుఁ బాషాణ కఠిన దేహ
ములఁ దపోధను లార్జింపఁగలుగు తపము.

మఱియు-

అనయము హంసతూలికల యందున
నిద్రలు నామె ధాత్రిపై
గోను శయనమ్ము సన్మృదు దుకూలముఁ
గట్టెడు నామె వల్కలం
బును ధరియించుఁ జందనపుఁ బూతలఁ
జల్లని నీటిసాల అం
దునఁ దిరుగామె వర్తిలెడు దుర్భరితోర్జిత
పంచవహ్నులన్.

(తరువాత కుసుమాపచయ మొనరించుచు జయా విజయలు ప్రవేశించుదురు)

జయ:- విజయా! తపశ్చరణమందుఁ గృతమతియగు గౌరికి మనోరథ కల్పద్రుమమగు శంకరుఁ డెప్పుడు ఫలము జూపునో కదా!

విజయ:-జయా!నిష్కరుణముగా మొదట మన్మథ దాహపరుష హృదయుఁడై పరమేశ్వరుఁ డంతర్ధానుఁడయినటులే యెప్పుడు దగ్ధహృదయుఁ డగునో, అప్పుడే ఫలమును జూపించును. (అని పుష్పాపచయ మాచరించును,)

నంది:- పార్వతీ ప్రియసఖులగు జయావిజయలు వీరేకదా! వీరిని కలసి కొందును. (అటులే యొనర్చును.)

జయ:- విజయా! నా పుష్పకరండము పూలచే నిండినది. మఱి, నీదాని విషయము?

విజయ:-(పుష్పకరండముఁజూచి) సగము నిండినది. మిగిలిన దానిని పూరింతును. (అని పుష్ప కరండమును బూలచే నింపును)

నంది:- (దగ్గఱకు వచ్చి) మీ యిర్వురకు భద్రమగు గాత.

జయా విజయలు:- భగవన్! నమస్కారములు.

నంది:- మీ రెవరు? ఏ నిమిత్తమునఁ బుష్పాపచయ మొనరించుచున్నారు?

ఇద్దఱు:- మేము హిమవంతుని పుత్రికయగు గౌరీ ప్రియసఖులము. తపశ్చరణ నియమమునందున్న యామెకు దేవపూజకై కుసుమాల నపచయించుచున్నాము.

నంది:- ఆమె తపము దేనికొఱకో!

జయ:- అనురూపవరుఁడు లభింపవలెనని.

నంది:- ఆ యనురూప వరుఁడెవరో కదా?

జయ:-

రమ్యముగ నిత్యతరుణుఁ బురాణపురుషు
నెవని వేదాల నారత మెంచుచుండు
సతత మీశ్వర శబ్దమ్ము చంద్రరేఖ
నెవఁడు శంకరుఁ డయి ధరియించుచుండు.

ఆ పరమేశ్వరుని మా ప్రియసఖ పతిగా నభిలషించి మహేంద్రాదులగు లోకపాలుర నవమానించి తపశ్చరణము కావించుచున్నది. ఎందుకన మన్మథదాహ వైరమున పితృగృహము ప్రవేశించి యనల్పోత్కంఠిత యైనది.

నంది:- అదెట్లు? చెప్పవలసినది.

జయ:-

వదన సరసిరుహము వాడిపోవగ శరీ
రమ్ము వెల్లనౌచు రమణపీడ
విరహమొంది చంద్రధరుపైనఁ బార్వతి
నళిని శుష్కయయ్యె కళలు దఱిగి.

నంది:- తరువాత! మీ ప్రియసఖ యెటులున్నది?

జయ:- తరువాత వినుడు.

అల్లన వీచు మంద మలయానిలముల్
సహింప దెప్పుడుం
బల్లవశయ్య సైపదు తుషారకరు చంద్రిక
నిందసేయు న
త్ఫుల్ల సరోజ పత్రములతో నొనరించిన
యుత్తరీయకం
బొల్లదు తాపభారమున నుండు తుషార
శిలాతలమ్ముపై.

నంది:- సరే! ప్రబలమదనజ్వరయై తదుపరి యేమొనర్చినది?

ఇద్దఱు:- తదుపరి యే యుపాయమును గానక తపశ్చరణమువలననే పరమేశ్వరు నభిముఖీకరించుకొనుటకుఁ దీవ్రనియమ మవలంబించినది.

నంది:- దుర్లభవస్తుప్రార్థనా నిబంధమది సందిగ్ధఫలము కాదా? అది యేల? దేవతలలో ననురూప వరుని వెదకవలసినది. ఖండపరశుఁడు వీతరాగులలో నగ్రణియైనవాఁడు. ఈ విషయము మీసఖికి నుపదేశింపుడు.

జయ:- భగవన్! మాసఖి నిర్ణయము "పరమేశ్వరునే పతిగా పొందవలె లేక యచ్చటనే గిరిశిఖరమందుఁ గఠిన తపశ్చరణమున విలీనురాలను గావలె" నని.

నంది:- (తనలో) వినవలసినది వింటిని. ఈవృత్తాంతమును నీలలోహితునకు నివేదింతును. (బిగ్గఱగా) భద్రులారా! యథాగతుడనై వెడలుదును.

జయ:- మేముకూడ ప్రియసఖికిఁ బూజా పుష్పములను దీసికొనిపోదుము. (అని నిష్క్రమింతురు.

(ఇది మిశ్ర విష్కంభకము)
(తరువాత నైష్ఠికాలంకారము నవలంబించి శంకరుఁడు ప్రవేశించును.)

శంకరుఁడు:- (తననుజూచికొని)

అంసభాగాన కృష్ణాజినశ్రీకంబు
నాషాఢ దండంబు హస్తమందు
ఫాలప్రదేశాన భసిత త్రిపుండ్రంబు
జటలపంక్తులు శిరస్థానమందు
శ్రోణిభాగాన విశ్రుత మౌంజి త్రిగుణంబు
స్ఫటిక మాలికప్రకోష్ఠంబునందు
శ్రవణమందున దర్భరచిత పవిత్రంబు
సమున్నతతుంగ పిశంగ వసన

మన్నివిధములఁ బర్యాప్త మౌచుఁదనరె
నాయలంకరణమ్ము గణ్యంబు గాఁగఁ
బాశుపత దివ్యదీక్షఁ జేఁబట్టి తపము
సలుపు గిరిరాజకన్య వంచనము సేయ.

(ఆలోచించి.)

వంతములాడ రాగమయభావము
లజ్జయు, మందహాసముల్
దొంతరలౌచుఁ జెక్కిళుల దోఁచగఁ
జూపులు చంచలింప రూ
పాంతరవోలె నిల్చు పులకాంకుర
మోహన బాణవేళలో
నింతి మదీయభావమున నిప్పుడు తా
పునరుద్భవించెనొ.

ఇప్పుడు సూర్యుడు మేదినినిగాఢతరకిరణ పరిక్లాంత జేయునటుల,మేఘుఁడు చాతక మునువలె కఠిన తపోవిశేషముచేఁ దప్తురాలైన పార్వతిని నభిగమింతును. జయా విజయలచే నేది నివేదింపఁబడి నందిచే నా కర్పణము సేయఁబడినదో యదియే నన్ను నేను నిందించుకొను నటుల విందును. (అని వినయముతోఁ బరిక్రమించును.)

(తరువాత జయా విజయలతో తపశ్చర్యనున్న పార్వతి ప్రవేశించును.)

పార్వతి:- (ఎదుసుకన్నదరుట సూచించి) ప్రియసఖులారా

ఆనంద బాష్ప శిశిర
మైన్మె నావామమ్ము నేత్రమదరునిమిత్తం
బై నన్ లేకయె నాకై
యీనా డుపలబ్ధమౌగదే యే ఫలమో.

జయ:- సఖి! పార్వతీ! స్త్రీలకు వామాక్షి స్పందనము, పురుషులకు దక్షిణాక్షి స్పందనము సుగుణమని పౌరాణికులు వచింతురు. కనుక మన్మథ దాహ నిష్కరుణుఁడైనను బరమేశ్వరుఁ డేమునిముఖమునైనను నిన్ను నను గ్రహించును.

పార్వతి:- ప్రియసఖి వచనము సత్యమగు గాత.

విజయ:- జయచే సత్యము వచింపఁబడినది

శంకరుఁడు:- (పార్వతినిఁ జూచి)
ఎక్కడ కఠోర తపమిది
యెక్కడ సుకుమార దేహ మీయబలకునై
యెక్కడ ఘనోష్మ దినసం
బెక్కడ నీరేజమృదుల మీచాంద్రిశ్రీ.

అరెరే! నన్నుద్దేశించి యీ మంజుభాషిణి మహత్తపఃక్లేశ మనుభవించు చున్నది.

జయ:- (చూచి) సఖీ! పార్వతీ! బ్రహ్మచర్యాశ్రమము మూర్తీభవించినట్లు యువకుఁడగు మహాపురుషుఁడెవఁడో యిటే వచ్చుచున్నాడు.

పార్వతి:- ఆగమించు నతిథులకు మీరు పూజావిధి నెరవేర్చుఁడు. నేను మఱల యథాపూర్వము నియమము ననుసరింతును. (అని మౌనము నవలంబించును.)

శంకరుఁడు (చూచి)

వల్కలముగట్టి శశధర వదన చెలఁగుఁ
బాండురక్షామ యగుచు దుర్భరమదీయ
విరహమున-సంధ్యచేత సంవీతమైన
ప్రథమ తిథినాటి చంద్రికారమణ వోలె

(అని సమీపమునకు వచ్చును. జయా విజయ లాసనముఁ దెత్తురు. శంకరుఁడు కూర్చొని మార్గాయాసము నభినయించును. పార్వతి సఖులను జూచును. సఖులు శంకరునకు వీవనలచే వీచుదురు.)

శంకరుఁడు:- (హస్తము చాచి) అనన్యసామాన్యమగు మీ సౌజన్యముచే మాశ్రమమంతయుఁ దీరినది.

ఇద్దఱు:- (వినయముతో) ఎక్కడ నుండి మహాపురుషుని రాక.

శంకరుఁడు:- నేడు కైలాసము నుండి వచ్చుచున్నాడ.

జయ:- మహాపురుషు లర్ఘ్యమును బ్రతిగ్రహింతురుగాక.

శంకరుఁడు;- అటులనే (అర్ఘ్యమును స్వీకరించి) భద్రులారా? మిమ్ముల నొకటి యడుగవలెనను కొనుచున్నాను.

జయ:- అడుగుడు.

శంకరుఁడు:- ఈమె యెవరి పుత్రిక? మీ రెవరు? ఏ నిమిత్తమునఁ గఠోర తపము నందీమె ప్రవర్తించుచున్నది?

జయ:- ఈమె మా ప్రియసఖి హిమవత్కన్యక. పార్వతీ నామధేయురాలు. మేమామె ప్రియసఖులము, జయా విజయలము. ఆమె తపశ్చరణ మనురూప వరలాభ నిమిత్తము.

శంకరుఁడు :-

పడసె జన్మము ధాత్వన్వవాయ మందు
పడతి జనకుఁడు గిరి సార్వభౌముఁడధికుఁ
డతిమనోహర తనువు రమ్యము వచస్సు
పదము లోకాతిలోకమై పరలు చుండె.

ఈ త్రిలోక లావణ్యచేఁ బ్రార్థనీయుఁడగు వరుఁడెవఁడో!

జయ :- ఒకానొక మహాపురుషుఁడున్నాడు.

శంకరుఁడు:- ఆత్మసౌభాగ్య విశేషమును దుర్విదగ్ధము చేసికొను కఠిన హృదయుఁ డెవఁడో కదా!

జయ :- మహాపురుషా! అదియును వినుము.

రమ్యముగ నిత్య తరుణుఁబురాణపురుషు
నెవని వేదాల నారత మెంచుచుండు
సతత మీశ్వర శబ్దమ్ము చంద్రరేఖ
నెవఁడు శంకరుఁడయి ధరియించుచుండు.

ఆ పరమేశ్వరు నభిలషించుచు మా ప్రియసఖ తపోనియమ మనుసరించుచున్నది.

శంకరుఁడు:- (పార్వతితో) భద్రులారా ఇది సత్యమౌనా ?

పార్వతి:- (మౌనమువదలి) మహాపురుష! సఖులచే నేది చెప్పఁబడినదో యదియే నా మనోరథము.

శంకరుఁడు:- (తనలో) ఇప్పుడాత్మనిందల చేతనుగూడ నీమె చిత్తమును బరీక్షించెదను.

(బిగ్గఱగా - చేతులు చఱచి బిగ్గఱగా నవ్వుచు)

ఆలేపమ్మదిబూది: భూషయురగం;
బావాసమా వల్లకా;
డోలేమా! పనివారు దయ్యములు,
చేయున్ వృత్తి భిక్షాటనం
బీ లీలన్ వచియింత్రు సర్వజనులా
యీశున్ శుభాయత్తమౌ
నీ లావణ్యమతిన్ విమూఢతను బంధిం
తేల యేమందునేన్.

మఱియును

భుజగముల నేత్రముల లేత వెన్నెల
గిరికులంపు రత్న మరయనేడ
వల్లకాటఁ జర్మవసనాలఁ దిరుగమం
గళరతుండు నుదురుకంటి యెడ!

పార్వతి:- (చెవులుమూసికొని) పాపముప శమించుఁగాక.

శంకరుఁడు :- నీ మనస్సునందలి నిశ్చయము దృఢతర మగుచో-

వలచికొనినయెడలఁ గలికి వెన్నెలచాన
యందమైనవానిఁ జందమామఁ
దలఁచవలదు నీవు దయ్యాల యెకిమీని
పేరుగాని వాని విడువు మిపుడె

పార్వతి:- (ముఖవైవర్ణ్యము పొంది)

సకల మౌళిజనులు సలుపుదురో జోత
లెవని నియమ మొప్పు నెంచుచుంటి
యట్టిగిరిశు నిందలాడెడినీనాల్క
యేలకాదో చీలి ప్రీలిపోయి.

సఖి! మహాపురుష నిందాకృతమగు పాపమెట్టిదో యట్టి దిదియంతయు వినుము. ఈతఁడు మఱల బ్రాహ్మణుఁడు. ఈశ్వర నిందా నిరంకుశ ముఖుఁడు. ఈతని నపతలకుఁ ద్రోలుదుము.

(అని జారుచున్న వల్కలాంచలమును సరిజేసి కొనును)

శంకరుఁడు:- (నిజస్వరూపమును జూపి)

పరిణద్ధము స్తనయుగళము
కరమవలగ్నంబుకృశము కుమియింపవానీ
కరదాన చతురతపసున
నరయుమనన్ దాసజనుఁడనైతిని గిరిజా!

(అనిపార్వతి చేతినిఁబట్టుకొనును.)

[పార్వతి భయవిస్మయ సంతోషములతోఁ బులికితయై చెక్కిలులందుఁ జెమర్చి ప్రతిపత్తి మూఢయై నిలచును]

జయ:- సత్కర్మ పరిణామముచేఁ బరమేశ్వరుఁడు మాకు సన్నిహితుడగుట మాకుఁ బ్రియమైనది.

శంకరుఁడు :-

కలితశ్రమ జలకణమం
గళతను, ధృతినిబిడపులకఁ గ్రమశరీరన్
లలితపయోధర నినుగా
గిలిగొని ధన్యుండ నౌదు గిరిపతి కన్యా!

ఈమెను గాంధర్వ వివాహముచేఁ బాణిగ్రహణము సేయ నభిలషించుచున్నాను.

జయ:- భగవన్! మీరు మాప్రార్థనను మన్నింపవలసినది - ఎట్లన - సకలకు

లాచల చక్రవర్తియు తండ్రియునగు హిమవంతు డొనరుచు గృహానిర్మిత వివాహ కార్యమునందు స్వీకరించు టయే మాకోరిక.

శంకరుఁడు :- (నిర్వేదముతోఁ దనలో) ఇంతకుమించి దీని నెట్లుగడుపుదును. (ప్రకాశముగా) సరే. లోకసంప్రదాయము విడువఁబడఁగూడదు.

జయ:— అయిదు దినములలోపలనే వివాహ మంగళమగు నట్లానర్ప వలసినది.

శంకరుఁడు:- మూఁడునాలుగు దినములలోనని చెప్పవలె. ఏలనన-

విరహామందుఃఖణమె ప్రియురాలి
కొఱకునై
గడుచు వేయికోట్ల కల్పములుగ
నయిదు దినములంను నన్నమాటను
నాదు
హృదయ మేవిధిని సహించు నకట!

జయ :- వివాహ మంగళమును సమకూర్చుటకు మేము వెళ్లుదుము.

శంకరుఁడు:-అటులనేకానిండు. మేమును వివాహ మంగళమునకు సప్తర్షుల నాహ్వానించుటకు వెళ్లుదుము.

[అని అందఱు నిష్క్రమింతురు]

ఇది చతుర్థాంకము.

విరి కన్నెతో

శ్రీ శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి, బి. ఎ., బి. ఇడి.

ఇప్పు డిప్పుడే వికసించి యింపులు గురి
పించి పరిమళములు గుబాళింప జేసి
తేనె సోనల భృంగాళి తృప్తి పరచి
ఒక్క అరగంటలో అంత మొంద నేల!

కాంచనే లేదు కన్నుల కరవు దీర
అనుభవింపగ నేలేదు మనసు దీర
కన్ను విచ్చిన దెంత! ఆ కన్ను మరల
మూసినది యెంత! తీరెనే ముచ్చటైన?

మనసార దెచ్చి ప్రేమ పిపాసి హృదయేశ్వరికి సమర్పించు కానుకవు నీవు
ప్రాణాధికముగ సంభావించి పరమేశ్వరునికి భక్తుడొసంగుధనము నీవు
దేశసేవా తపోదీక్షితు గళసీమ ఘృణులీను దివ్య భూషణము నీవు
కోమలి జడలోన గులుకుచు ప్రియు సుఖకేళి నూగించు నుయ్యాల నీవు
ఇన్ని విధముల ధన్యత యింత స్వల్పకాలమున నెట్టులార్జింప గలిగి తీవు
ఎన్ని తొలి జన్మలందు గావించినట్టి పుణ్యమున విరికన్నెగా పుట్టినావో.

ఏ శిల్పినేర్పుమై ఈ రంగు లీ రూపు గావించెనో విందుగా కనులకు
ఏ వైంద్ర జాలికుం డీ పరిమళ వైభవము గూర్చెనో ఘ్రాణపర్వముగను
ఏ రసాయన వేత్త యీ మరందామృత ధారగూర్చెనొ జిహ్వా తనివి దీర
ఏ గాయకాగ్రణి యీ తేటి పాటలు గల్పించెనో విందుగా చెవులకు
మేన దాకిన హాయిగా మృదువుగా విరాజిలెడు రేకులెట్టి నిర్మాత గూర్చె
నరుల పంచేంద్రియముల కానందమిచ్చు ధన్యజన్మమ్ము విరికన్నె! దక్కెనీకు.

ఇంత యమూల్యమైన బ్రతు కీ నవయౌవన లక్ష్మి యింతలో
నంతము చెందుటల్ గన యథార్థపు తత్త్వము గోచరించుగా
ఎంతటి యంద చందములు నెంతటి వైభవ భోగభాగ్యముల్
నంతయు నిల్వజాలవు వసుంధరనంచు ప్రసూన కన్యకా!

కాతన్త్ర వ్యాకరణం

[లఘువృత్తి సహితం]

శతావధానులు, శ్రీ శ్రీనివాస సోదరులు

౮

ద్వితీయాధ్యాయము - ప్రథమ పాదము (శేషం)

౨౫. స్మై సర్వనామ్నః.

అకారాన్తమైన సర్వనామలిఙ్గానికి పరమైన 'ఙే' ఙరులు స్మై వస్తుంది. సర్వ + ఙే - సర్వ + 'స్మై' - సర్వస్మై. సర్వనామేతరలిఙ్గమైతే - సర్వః - సర్వుడనే పేరుగల వ్యక్తి. సర్వ + ఙే - సర్వ + య (సూ. ౨౪) సర్వా + య (సూ. ౧౪.) సర్వాయ.

సర్వనామాలు: సర్వ, విశ్వ, ఉభ, ఉభయ, అన్య, అన్యతర, ఇతర, డతర, డతమ ॥వృత్॥ త్వత్వత్, నేమ, సమ, సిమ, పూర్వ అపర - అవర - దక్షిణ - ఉత్తర - పర- అధ రాణి, వ్యవస్థాయా, మసంజ్ఞాయామ్.-స్వ మజ్ఞాతిధనాఖ్యాయామ్. అన్తరం బహిర్యో గోపసంవ్యానయోః ॥వృత్॥ త్యద్, తద్, యద్, ఏతద్, అదస్, ఇదమ్, కిమ్, ఏక, ద్వి ॥వృత్॥ యుష్మద్, అస్మద్, భవన్తు,

వృత్ అని వున్నంతవరకూ ఒక గణంగా గ్రహించాలి. పైవాటిలో డతర, డతమ అనేవి ప్రత్యయాలు. ఈ ప్రత్యయాలతో కూడిన కతర, కతమ, యతర, యతమ, తతర, తతమ - ఇటువంటివి సర్వనామాలని గ్రహించాలి. సమ, సిమ శబ్దాలు అందరు, అన్నీ అనే అర్థాలలోమాత్రమే సర్వనామాలు. సమశబ్దం తుల్యార్థంలో సర్వనామం కాదు. సమే ఽపి వ్యాఖ్యాతారః [అందరు వ్యాఖ్యాతలున్నా]- ఇక్కడ 'సమ' సర్వనామం. సమే దేశే యజతే [సమానమైన ప్రదేశంలో యజ్ఞం చేస్తున్నాడు] రామేణ సమాత్ భూపాలాత్ [రామునితో సమానుడైన రాజువల్ల—ఇక్కడ 'సమ' శబ్దం సర్వనామం కాదు. "పూర్వ-అధర" - ఈ శబ్దాలు ఏడున్నా వ్యవస్థను తెలిపేటప్పుడూ సంజ్ఞావాచకాలు కానప్పుడూ సర్వనామాలు. దిక్కును, దేశాన్ని, కాలాన్ని తెలపటం వ్యవస్థ. "దక్షిణస్యాం దిశి ప్రవీణా గాథకాః సన్తి" [దక్షిణదిక్కున ప్రవీణులైన గాయకు లున్నారు] ఇక్కడ దక్షిణ శబ్దం సర్వనామం. "దక్షిణా హ్యేతే నాయకాః శ్రీకృష్ణాదయః." [శ్రీకృష్ణుడు మొదలైన యీ నాయకులు దక్షిణులు. చూ. తుల్యో ఽనేకత్ర దక్షిణః.] - ఇక్కడ దక్షిణ శబ్దం సర్వనామం కాదు. 'లోపల, వెలుపల' అనీ, పైపంచె, కట్టుపంచె అనీ అర్థమిచ్చేటప్పుడు అన్తర శబ్దం సర్వనామం. "అన్తరస్మాత్ గృహాత్" అంటే "ఊరివెలుపలి చండాలాదుల] యింటినుండి" అనీ, "ఊరి లోపలి యింటినుండి" అనీ కూడా అర్థం వస్తుంది. "అన్తరేశాటకాః" అంటే పైపంచలనీ కట్టు పంచెలనీ కూడా అర్థం వస్తుంది. ఈ అర్థాల్లో అన్తర శబ్దం సర్వనామ మన్నమాట. "గ్రామయో రన్తరే తటాకో ఽస్తి" [రెండూళ్ళ నడుమ చెరువుంది] అన్నప్పుడు అన్తరశబ్దం సర్వనామం కాదన్నమాట. 'త్వత్, త్వ' అనే సర్వనామాలకు ఇతరుడు (ఇతర స్త్రీ, ఇతర వస్తువు) అనే అర్థం వస్తుంది. 'స్వ' శబ్దం 'తాను' అనే అర్థంలో సర్వనామం. జ్ఞాతి, ధనం అనే అర్థాల్లో సర్వనామంకాదు. "స్వస్మై జ్ఞాతయే ధనం దదాతి." [తన జ్ఞాతికొరకు ధన మిస్తున్నాడు] అన్నప్పుడు 'స్వ' శబ్దం సర్వనామం. "స్వాయ ధనం దదాతి" [జ్ఞాతికొరకు ధనమిస్తున్నాడు] "ధరి

ద్రః స్వాయ యతతే" [దరిద్రుడు ధనం కోసం ప్రయత్నిస్తున్నాడు] - ఈ రెండు వాక్యాల్లోనూ 'స్వ' శబ్దం సర్వనామం కాదు.

౨౬. ఙసిం స్మాత్.

అకారాన్త సర్వనామ లిఙ్గానికి పరమైన 'ఙసి' కి బదులు 'స్మాత్' వస్తుంది. సర్వ + ఙసి — సర్వ + స్మాత్ - సర్వస్మాత్.

౨౭. ఙి స్మిన్.

అకారాన్త సర్వనామ లిఙ్గానికి పరమైన "ఙి" కి బదులు "స్మిన్" వస్తుంది. సర్వ + ఙి - సర్వ + స్మిన్ - సర్వస్మిన్.

౨౮. విభాషేతే పూర్వాదేః.

పూర్వాదిగణంలోని లిఙ్గాలకు పరమైన 'ఙి' ప్రత్యయాలకు బదులు 'స్మాత్, స్మిన్' లు రావచ్చు; రాకపోవచ్చు. పూర్వస్మాత్, పూర్వాత్; పూర్వస్మిన్, పూర్వే.

౨౯. సు రామి సర్వతః.

అకారాన్త సర్వనామలిఙ్గాలకు "ఆమ్" పరమైనప్పుడు అంతటా సకారం ఆగమంగా వస్తుంది. చూ. వివరణ సూ. ౭. సర్వేషామ్, సర్వాసామ్.

౩౦. జస్ సర్వ ఇః.

అకారాన్త సర్వనామలిఙ్గానికి పరమైన 'జస్' అంతటికీ బదులు 'ఇ' వస్తుంది. సర్వ + జస్ - సర్వ + ఇ - సర్వే విశ్వ + జస్- విశ్వ + ఇ - విశ్వే. అకారాన్త మనటంచేత స్త్రీవాచక ఆకారాన్తానికి - సర్వా + జస్ - సర్వా + అస్ - సర్వాః అనే రూపం సిద్ధిస్తుంది.

౩౧. అల్పాదేర్వా.

అల్పాదిగణ శబ్దాలకు పరమైన 'జస్' కు బదులు 'ఇ' రావచ్చు; రాకపోవచ్చు. అల్ప + జస్ - అల్ప + ఇ - అల్పే. అల్ప + జస్- అల్ప + అస్ - అల్పా + అస్ అల్పాః.

ఉభయ శబ్దానికిమాత్రం ఈ భాష లేదు. 'ఉభయే' అనే రూపమే వస్తుంది.

అల్పాదిగణం:- అల్ప, ప్రథమ, చరమ, తయ, అయ, కతిపయ నేమ, అర్ధ : పూర్వదయశ్చ. ఇందులో తయ, అయ అనేవి ప్రత్యయాలు. ఈ ప్రత్యయాలు, అన్తంలో వుండే ద్వితీయ, త్రితయ, ద్వయ, త్రయ మొదలైన శబ్దాలకు ఇవి గ్రాహకాలు. పూర్వాది గణము అంటే 'పూర్వ' నుండి 'అన్తర' వరకు. [చూ. ౨౫ సూ. వివరణ.]

౩౨. ద్వన్ద్వస్థాచ్చ.

ద్వన్ద్వ సమాసంలో వున్న అకారాన్త సర్వనామ లిఙ్గానికి పరమైన 'జస్' కు బదులు 'ఇ' రావచ్చు; రాకపోవచ్చు. కతర, కతమే, కతర కతమాః. వర్ణాశ్రమేతరే, వర్ణాశ్రమేతరాః.

౩౩. నాన్య త్సార్వనామికమ్.

ద్వన్ద్వసమాసంలో వున్న అకారాన్త సర్వనామలిఙ్గానికి 'జస్' కంటే ఇతర ప్రత్యయాలకు వేటికీ సార్వనామిక ప్రత్యయాలు రావు. కతరకతమాయ; పూర్వాపరాత్, దక్షిణోత్తర పూర్వాణామ్.

౩౪. తృతీయాసమాసేచ.

తృతీయా సమాసంలో వున్న అకారాన్త సర్వనామ లిఙ్గానికి సార్వనామిక విభక్తి ప్రత్యయాలు రావు. మాసేన పూర్వః మాసపూర్వః. తస్మై మాసపూర్వాయ. ఇక్కడ సర్వనామ ప్రత్యయమైన 'స్మై' వచ్చి "మాసపూర్వస్మై" అనే రూపం రాదన్నమాట. ఈ విధి తృతీయా సమాసం విగ్రహవాక్యంలో కూడా కనపడు తున్నది. "మాసేన పూర్వాయ." "మాసేన అవరాః మాసావరాః." "మాసావరే" అనే రూపం రాదు.

౩౫. బహువ్రీహౌ.

బహువ్రీహిసమాసంలో వున్న సర్వనామాలకు సర్వనామ ప్రత్యయాలు రావు. అవ్యయాలకూ సర్వనామాలకూ " అవ్యయ సర్వ

నామ్నాః స్వరాదన్త్యా త్పూర్వ అక్ వా" (౨. ౨. ౬ ౪) అనే సూత్రం ప్రకారం అన్త్య స్వరానికి వెనకనే, అక్, ప్రత్యయం రావచ్చు రాకపోవచ్చు. 'త్వత్.' 'మత్.' అనే సర్వ నామ రూపాలకు 'అక్' ప్రత్యయం వచ్చి 'త్వకత్' 'మకత్' అనే రూపాలు వస్తాయి. త్వమ్ - త్వకమ్, అహమ్, అహకమ్; త్వకమ్ : పితా యస్య సః త్వత్కపితృకః. అహకమ్. పితా యస్య సః మత్కపితృకః. ఇక్కడ బహువ్రీహిసమాసాలైన త్వత్కపితృకః, మత్కపితృకః అనేవాటిలో సార్వనామిక మైన 'అక్' ప్రత్యయం రాలేదు. 'క ప్రత్యయం వచ్చి 'మత్క. త్వత్క' అనే రూపాలు వచ్చాయి.

౩౬. దిశామ్. వా.

దిక్కులకు సంబంధించిన బహువ్రీహిలో సార్వనామిక ప్రత్యయం రావచ్చు రాకపోవచ్చు. ఉత్తరస్యాః పూర్వస్యాశ్చ దిశో రన్తరాలం ఉత్తరపూర్వా. తస్యై ఉత్తరపూర్వ స్యై - ఉత్తరపూర్వాయై. "దిక్కులకు సంబంధించిన" అనటంచేత యా స్త్రీ ఉత్తరా సా పూర్వా యస్యాః స్త్రియః సా ఉత్తరపూర్వా. తస్యై ఉత్తర పూర్వాయై. ఇక్కడ దిక్కులకు సంబంధించిన సమాసం కాదు గనుక ఉత్తర పూర్వాయై అని మాత్రమే రూపం వస్తుంది. "ఉత్తరపూర్వస్యై" అనే రూపం రాదు.

౩౭. శ్రద్ధాయాః సి ర్లోపమ్

శ్రద్ధాకు (చూ. సూ.౨.౧.౧౦.) పరమైన 'సి' లోపిస్తుంది. రమా + సి- రమా. మాలా + సి-మాలా. "శ్రద్ధాకు" అనటంచేత కీలాలపా + సి -కీలాలపా + సి- కీలాలపాః. శజ్జధ్మా + సి - శజ్జధ్మా + స్ - శజ్జధ్మాః. ఇక్కడ లిఙ్గాన్తంలో వున్న ఆకారం స్త్రీవాచకం కానందువల్ల 'సి' లోపించలేదు.

౩౮. టౌసో రే.

'టా.ఓస్' లు పరమైనప్పుడు శ్రద్ధకు బదులు ఏకారం వస్తుంది. రమా + టా - రమే + టా - రమే + ఆ - రమయా. మాలయా. రమా + ఓస్ - రమే + ఓస్- రమయోః. మాలయోః.

౩౯. సమ్బుద్ధౌ చ.

సమ్బుద్ధి పరమైనప్పుడు కూడా శ్రద్ధకు బదులు ఏకారం వస్తుంది. హే రమా + సి - [౩౭ సూ. చేత 'సి' లోపించగా] హే రమే. హే మాలే.

౪౦. హ్రస్వో ఽ మ్బార్థానామ్.

'తల్లి' అనే అర్థమిచ్చే శబ్దాలకు సమ్బుద్ధి పరమైనప్పుడు శ్రద్ధ హ్రస్వ మౌతుంది. హే అమ్బా + సి (౩౭ సూ. చేత 'సి' లోపించగా) హేఅమ్బా - హే అమ్బ. హే అక్క.. ఈ విధి ద్విస్వరామ్బార్థాలకు మాత్రమే వర్తిస్తుంది. హే అమ్బాడే. హే అమ్బికే. హే అమ్బాలే. [౩౯ సూ. ప్రకారం] "అత్ అమ్బార్థానామ్" అని సూత్రం చెప్పటానికి బదులు "హ్రస్వః" అనే సంజ్ఞతో సూత్రం ప్రారంభించబడింది. "సంజ్ఞాపూర్వకో విధి రనిత్యః" [సంజ్ఞతో ప్రారంభించి ఉపదేశించిన విధి నిత్యం కాదు] అని ఒక న్యాయం వుంది. కనుక ప్రయోగదర్శనంచేత ఈ న్యాయం ఇక్కడ అన్వయించుకొని ద్విస్వరామ్బార్థాలకు మాత్రమే ప్రస్తుతసూత్రవిధి వర్తిస్తుందని గ్రహించాలి.

౪౧. ఙౌ రీమ్.

శ్రద్ధకు పరమైన 'ఙౌ' 'ఈః' గా మారుతుంది. రమా + 'ఙౌ' - రమా + ఈః రమే. మాలే. జరా + ఙౌ - జరా + ఈః [జరస్ ఆదేశం వచ్చినప్పుడు] జరస్. + ఈ జరసీ. [జరస్ ఆదేశం రానప్పుడు] జరే.

౪౨. ఙవన్తి ఙై యాస్ యాస్. యామ్.

'ఙ' కలిగిన ప్రత్యయా లంటే "ఙే. ఙసి' ఙస్, ఙి" అనేవి. శ్రద్ధకు పరమైన ఙవత్ప్రత్య

యాలకు బదులు క్రమంగా "యై. యాస్. యాస్. యామ్" అనేవి వస్తాయి. రమా + ఙే - రమా + యై - రమాయై. రమా + ఙసి - రమా + యాస్ - రమాయాః. రమా + ఙస్ - రమా + యాస్ - రమాయాః. రమా + ఙి - రమా + యామ్ - రమాయామ్ మాలాయై, మాలాయాః, మాలాయాః, మాలాయామ్.

౪౩. సర్వనామ్నస్తు ససవో హ్రస్వ పూర్వాః.

'ససవః' అంటే 'సు' తో కూడినవి. ఉకారం ఆగమ, ప్రత్యయాదిత్వాలకు బోధకంగదా! సర్వనామ లిఙ్గాల శ్రద్ధకు పరమైన 'యై' యాస్, యాస్, యామ్' లకు సకారం ఆగమ మౌతుంది. ఇది ప్రత్యయాదిని వస్తుంది గనుగ "స్యై. స్యాః. స్యాః. స్యామ్" అనే రూపాలు వస్తాయి. వీటికిముందు లిఙ్గాన్తంలో వున్న ఆకారం హ్రస్వ మౌతుంది. సర్వా + ఙే - సర్వా + యై - సర్వా + స్ + యై - సర్వ + స్యై - సర్వస్యై. సర్వస్యాః. సర్వస్యాః, సర్వస్యామ్. విశ్వస్యై, విశ్వస్యాః, విశ్వస్యాః, విశ్వస్యామ్.

౪౪. ద్వితీయా తృతీయాభ్యాం వా.

ద్వితీయా తృతీయా శబ్దాలకు పరమైన ఙవత్ప్రత్యయాలకు ౪౩ వ సూత్రంలోని విధి రావచ్చు; రాకపోవచ్చు. ద్వితీయస్యై, ద్వితీయాయై. ద్వితీయస్యాః, ద్వితీయాయాః. ద్వితీయస్యాః, ద్వితీయాయాః. ద్వితీయస్యామ్, ద్వితీయాయామ్. తృతీయస్యై, తృతీయాయై. తృతీయస్యాః, తృతీయాయాః. తృతీయస్యాః, తృతీయాయాః. తృతీయస్యామ్, తృతీయాయామ్.

ద్వితీయ తృతీయ శబ్దాలకు ఙవత్ప్రత్యయాలవిషయంలో విభాష పుంలిఙ్గంలో కూడా గ్రహించాలి. ద్వితీయస్మై, ద్వితీయాయ. ద్వితీయస్మాత్, ద్వితీయాత్, ద్వితీయస్మిన్, ద్వితీయే. ఇలానే తృతీయస్మై ఇత్యాది రూపాలు ఊహించుకోవచ్చు.

౪౫. నద్యా ఐ. ఆస్. ఆస్. ఆమ్.

నదికి (చూ. ౯ సూ.) పరమైన ఙవత్ప్రత్యయాలకు బదులు "ఐ. ఆస్. ఆస్. ఆమ్" అనేవి వస్తాయి. నదీ + ఙే - నదీ + ఐ - నద్యై. నదీ + ఙసి నదీ + ఆస్ - నద్యాః. నదీ + ఙస్ - నదీ + ఆస్ - నద్యాః. నదీ + ఙి - నదీ + ఆమ్ - నద్యామ్. గౌర్యై, గౌర్యాః, గౌర్యాః, గౌర్యామ్. వధూ + ఙే + వధూ + ఐ - వధ్వై. వధూ + ఙసి - వధూ + ఆస్ - వధ్వాః. వధూ + ఙస్, వధూ + ఆస్ వధ్వాః వధూ + ఙి - వధూ + ఆమ్ - వధ్వామ్. శ్వశ్ర్వై. శ్వశ్ర్వాః. శ్వశ్ర్వాః. శ్వశ్ర్వామ్.

౪౬. సమ్బుద్ధౌ హ్రస్వః.

సమ్బుద్ధి పరమైనప్పుడు నదికి హ్రస్వం వస్తుంది. హే నదీ + సి. "హ్రస్వ నదీ శ్రద్ధాభ్యః సి ర్లోపమ్" (౨. ౧. ౩౧) అనే సూత్రంవల్ల హ్రస్వానికీ, నదికీ, శ్రద్ధకూ పరమైన సమ్బుద్ధి 'సి' ప్రత్యయం లోపిస్తుంది. కనుక నదికి పరమైన 'సి' లోపించగా - హేనదీ - ప్రస్తుతసూత్రంచేత హ్రస్వం వచ్చి - హే నది అనే రూపం సిద్ధిస్తుంది. ఇలాగే హే వధూ + సి - హేవధూ - హే వధు. నదికి హ్రస్వం వస్తుం దనటంచేత - హే గ్రామణీః, హే ఖలపూః. (పుంలిఙ్గాలకు హ్రస్వం రాదన్న మాట.)

౪౭. అమ్. శసో రాది ర్లోపమ్.

నదికి పరమైన 'అమ్, శస్' లలో అకారం లోపిస్తుంది. నదీ + అమ్ - నదీ + మ్ - నదీమ్. శ్వశ్రూ + అమ్ - శ్వశ్రూ + మ్ - శ్వశ్రూమ్. నదీ + శస్ - నదీ + అస్ - నదీ + స్ - నదీః. శ్వశ్రూ + శస్ - శ్వశ్రూ + అస్ - శ్వశ్రూ + స్ - శ్వశ్రూః.

౪౮. ఈకారాన్తాత్ సిః.

స్త్రీవాచక ఈకారాన్తానికి పరమైన 'సి

లోపిస్తుంది. నదీ + సి - నదీ. గౌరీ. స్త్రీవాచక ఈకారాన్త మనటంచేత — ఉణాది సూత్రాలచేత ఏర్పడిన ఈకారాన్తాలకు పరమైన 'సి' లోపించదు. "లక్ష్మీ. శ్రీ, హ్రీ, ధీ, తరీ. తన్త్రీ). అవీ" అనే లిఙ్గాలు ఇట్టివి. సి, లక్ష్మీ + సి. లక్ష్మీ + స్—లక్ష్మీః శ్రీః. హ్రీః, ధీః, తరీః. తన్త్రీః, అవీః.

౪౯ వ్యఞ్జనాచ్చ.

వ్యఞ్జనానికి పరమైన 'సి' లోపిస్తుంది. మరుత్ + సి — మరుత్. వాచ్ + సి— వాచ్ — వాగ్ ("చవర్గ దృగాదీనాం చ" ౨. ౩. ౪౮ అనే సూత్రంప్రకారం పదాన్తంలో నూ వ్యఞ్జనాది ప్రత్యయం పరమైనప్పుడున్నూ చవర్గానికీ, దృశ్ మొదలైన లిఙ్గాలకూ చివరివర్ణానికి బదులు గకారం వస్తుంది.) వాక్ ("వా విరామే" ౨ - ౩ - ౬౨ అనే సూత్రంవల్ల పదాన్తంలో వర్గప్రథమం కూడా వుండవచ్చు.) భిషజ్ — భిషగ్ — భిషక్.

౫౦ అగ్నే రమో౽కారః.

అగ్నికి (చూ సూ ౮) పరమైన 'అమ్' లో అకారం లోపిస్తుంది. హరి + అమ్ — హరి + మ్ — హరిమ్. మతి + అమ్ — మతి + మ్ — మతిమ్. గురు + అమ్ - గురు + మ్ గురుమ్. ధేను + అమ్ — ధేను + మ్ — ధేనుమ్.

౫౧ ఔకారః పూర్వమ్

అగ్నికి పరమైన ఔకారం పూర్వస్వరంగా మారుతుంది. హరి + ఔ - హరి + ఇ — హరీ. మతీ. గురు + ఔ - గురు + ఉ - గురూ. ధేనూ.

౫౨ శసో౽కారః సశ్చ నో౽స్త్రియామ్

అగ్నికి పరమైన 'శస్' లో అకారానికి బదులు పూర్వస్వరమూ, పుంలిఙ్గంలో సకారానికి బదులు నకారమూ వస్తాయి. హరి + శస్ - హరి + అస్ - హరి + ఇస్ - హరి + ఇన్ - హరీన్. గురు + శస్- గురు + అస్ - గురు + ఉస్, గురు + ఉన్- గురూన్. స్త్రీలిఙ్గంలో నైతే - మతి + శస్- మతి + అస్ - మతి + ఇస్ - మతీః. ధేను + శస్ - ధేను + అస్ - ధేను + ఉస్ - ధేనూః.

౫౩. టా నా.

స్త్రీలిఙ్గేతరశబ్దాల అగ్నికి పరమైన 'టా' కు బదులు 'నా' వస్తుంది. హరి + టా - హరి + నా హరి. + ణా - హరిణా. గురు + టా - గురు + నా గురు + ణా- గురుణా. (రెండు శబ్దాల్లోనూ రేఫతరువాత నకారానికి బదులు ణకారం వచ్చింది. (సూ. ౨. ౪. ౪౮. చూ. వివరణ ౧౯ సూ.) స్త్రీలిఙ్గంలో నైతే - మతి + టా, మతి + ఆ - మత్యా. ధేను + టా, ధేను + ఆ - ధేన్వా.

౫౪. అదో౽ ఉ ముశ్చ.

'టా' ప్రత్యయం పరమైనప్పుడు 'అదస్' శబ్దం 'అము' గా మారుతుంది; టాకు బదులు 'నా' వస్తుంది. అదస్ + టా - అము + టా - అము + నా - అమునా. స్త్రీలిఙ్గమైతే- 'అదస్' శబ్దానికి "త్యదాదీనామ విభక్తౌ" (౨. ౩. ౨౯) అనే సూత్రంప్రకారం (ఈ శబ్దం త్యదాది గణంలో చేరింది గనుక) చివరి వర్ణం 'అ' గా మారుతుంది అదస్ + టా- అద + అ + టా. ఇప్పుడు "అకారే లోపమ్" (౨. ౧. ౧౮) అనే సూత్రంవల్ల లిఙ్గాన్తంలో వున్న అకారం లోపించి - అద్ + అ + టా అవుతుంది. "వ్యఞ్జన మస్వరం పరం వర్ణం నయేత్" [౧. ౧. ౨౧] అనే సూత్రం ప్రకారం - అద + టా అవుతుంది. "స్త్రియా మా దా" [౨. ౪. ౪౯] అనే సూత్రం ప్రకారం స్త్రీలిఙ్గంలో అకారాన్త లిఙ్గాలకు 'ఆ' చేరుతుంది. కనుక అద + ఆ + టా - అదా + టా అవుతుంది. "టౌసో రే" [౨. ౧. ౩౮] అనే సూత్రంచేత - అదే + టా - అదే + ఆ - అదయా. ఇప్పుడు "అద

షః పదేమః" (౨. ౨. ౪౫). "ఉత్వం మాత్" (౨. ౩. ౪౧) అనే సూత్రాలవల్ల అదస్ శబ్దానికి ప్రత్యయం పరమైనప్పుడు దకారానికి బదులు మకారమూ, దానికి పరమందున్న వర్ణానికి బదులు ఉవర్ణమూ వస్తాయి. కనుక - అదయా - అద్ + అయా, అమ్ + అయా - అమ్ + ఉయా - అముయా అనే రూపం సిద్ధిస్తుంది.

౫౫ ఇ రేదు రో ర్జసి.

'జస్' పరమైనప్పుడు లిఙ్గాన్తంలో వున్న 'ఇ' కి బదులు 'ఏ', 'ఉ' కు బదులు 'ఓ' వస్తాయి. హరి + జస్ - హరే + జస్ - హరే + అస్ - హరయః. మతయః. గురు + జస్ - గురో + జస్ - గురో + అస్ - గురవః. ధేనవః.

౫౬ సమ్బుద్ధే చ.

సమ్బుద్ధి పరమైనప్పుడున్నూ లిఙ్గాన్తంలో వున్న 'ఇ' కి బదులు 'ఏ', 'ఉ' కు బదులు 'ఓ' వస్తాయి. హే హరి + సి "హ్రస్వ నదీ శ్రద్ధాభ్యః సి ర్లోపమ్" (౨. ౧. ౫౧) అనే సూత్రం వల్ల హ్రస్వం కంటే పరమైన 'సి లోపిస్తుంది. హే హరి. ప్రస్తుతసూత్రంచేత 'ఇ' కి బదులు 'ఏ' హే హరే. హే గురు + సి - హే గురు - 'ఉ' కు బదులు 'ఓ'. హే గురో. హే మతే. హే ధేనో.

౫౭ జే

'జే' పరమైనప్పుడు లిఙ్గాన్తంలో వున్న 'ఇ' కి బదులు 'ఏ', 'ఉ' కు బదులు 'ఓ' వస్తాయి హరి + జే - హరే + జే - హరే + ఏ - హరయే. గురు + జే - గురో + జే - గురో + ఏ - గురవే మతయే. ధేనవే. స్త్రీలిఙ్గాల కిక్కడ విశేషం వుంది "హ్రస్వశ్చ ఙవతి" (౨. ౨. ౫) అనే సూత్రంవల్ల ఙవత్ప్రత్యయాలు పరమైనప్పుడు స్త్రీలిఙ్గాలైన ఇకారోకారాన్తాలకున్నూ కూడా నదీసంజ్ఞ వస్తుంది; రాకపో నూవచ్చు. నదీసంజ్ఞ వచ్చినప్పుడు - "నద్యా ఐ ఆస్ ఆస్ ఆమ్" (౨. ౧. ౪౫) అనే సూత్రం ప్రవర్తిస్తుంది. మతి + జే - మతి + ఐ - మత్యై. ఇలానే - మత్యాః, మత్యాః, మత్యామ్. ధేను + జే - ధేను + ఐ - ధేన్వై. ఇలానే - ధేన్వాః, ధేన్వాః, ధేన్వామ్ అనే రూపాలు సిద్ధిస్తాయి.

౫౮. ఙసి ఙసో రలోప శ్చ.

'ఙసి, ఙస్' లు పరమైనప్పుడున్నూ 'ఇ' కి బదులు 'ఏ', 'ఉ' కు బదులు 'ఓ' వస్తాయి. ఙసి, ఙస్ ల అకారం లోపిస్తుంది. హరి + ఙసి - హరే + ఙసి - హరే + అస్ - హరే + స్ - హరేః ఇలానే ఙస్ పరమైనప్పుడున్నూ హరేః అనే రూపమే సిద్ధిస్తుంది. గురు + ఙసి - గురో + ఙస్ - గురో + అస్ - గురో + స్ - గురోః. ఙస్ - గురోః. స్త్రీ లిఙ్గాల కీ సూత్రంప్రకారం ఒకరూపమూ నదీసంజ్ఞవల్ల ఇంకొక రూపమూ వస్తాయి. మతేః - మత్యాః. ధేనోః - ధేన్వాః. ఙసి ఙస్ ప్రత్యయాలు రెంటికీ ఒకే రకమైన రూపాలుంటాయి.

౫౯. గో శ్చ.

గో శబ్దానికి పరమైన ఙసి ఙస్ ప్రత్యయాల అకారం లోపిస్తుంది. గో + ఙసి గో + అస్ గో + స్-గోః. గోః. గో శబ్దం ఓకారాన్త శబ్దాలకు ఉపలక్షణం.

౬౦. ఙి రౌ సపూర్వః.

అగ్నికి పరమైన 'ఙి' ప్రత్యయం పూర్వస్వరంతో కలసి 'ఔ' గా మారుతుంది. అంటే పూర్వపరస్వరాలు రెంటికీ బదులు 'ఔ' వస్తుందన్నమాట. హరి + ఙి - హరి + ఇ - హర్ + (ఇ + ఇ) - హర్ + ఔ - హరౌ. గురు - + ఙి గురు + ఇ - గుర్ + (ఉ + ఇ) - గుర్ + ఔ - గురౌ. ఇలానే మతౌ. ధేనౌ. అయితే వీటికి నదీసంజ్ఞ కూడా వస్తుంది గనుక మత్యామ్, ధేన్వామ్ అనే

రూపాలు కూడా వస్తాయి. (చూ. వివరణ సూ. ౫౭)

౬౧. సఖి పత్యోర్ఙిః.

సఖి. పతి శబ్దాలకు పరమైన 'ఙి' కి బదులు 'ఔ' వస్తుంది. సఖి + ఙి - సఖి + ఔ - సఖ్యౌ. పతి + ఙి - పతి + ఔ - పత్యౌ.

౬౨. ఙసి ఙసో రు మః.

సఖి, పతి శబ్దాలకు పరమైన ఙసి, ఙస్ ప్రత్యయాల అకారం ఉకారంగా మారుతుంది. సఖి + ఙసి - సఖి + అస్ - సఖి + ఉస్ - సఖ్యుః. పత్యుః; పత్యుః.

౬౩. ఋదన్తా త్సపూర్వః.

ఋకారాన్త లిఙ్గానికి పరమైన ఙసి, ఙస్ ల అకారానికీ తత్పూర్వస్వరానికీ రెంటికీ బదులు ఒక్కటే ఉకారం వస్తుంది. పితృ + ఙసి - పితృ + అస్ - పిత్ + (ఋ + అ) స్ - పిత్ + ఉస్ - పితుః; పితుః. ఇలానే మాతుః మాతుః; ధాతుః, ధాతుః. ఋదన్త మని తపర కరణంతో చెప్పినందువల్ల ఋూకారాన్తాల కిది వర్తించదు. నాటికి - 'స్తౄ' అనే ధాతువును లిఙ్గంగా గ్రహించి ఙస్ ప్రత్యయం చేరిస్తే - స్తౄ + ఙస్ - స్తౄ + అస్. స్తౄస్ - స్తౄః అనే రూపం సిద్ధిస్తుంది. ఇలానే ఙసి ప్రత్యయంతోనూ ఊహించుకునేది.

౬౪. ఆ సౌ సిలోప శ్చ.

ఋకారాన్త లిఙ్గానికి 'సి' పరమైనప్పుడు లిఙ్గాన్త ఋకారానికి బదులు 'ఆ' వస్తుంది; 'సి' లోపిస్తుంది. పితృ + సి - పితా + సి - పితా. ఇలానే మాతా, ధాతా, కర్తా మొదలైనవి.

౬౫. అగ్నివ చ్ఛసి.

ఋకారాన్త లిఙ్గానికి శస్ పరమైనప్పుడు అగ్నికివలె కార్యం జరుగుతుంది. అంటే "శసో ఽ కారః సశ్చ నో ఽ స్త్రియామ్" (౨. ౧. ౫౨.) సూత్రంలో విధించి నట్లు శస్‌లో అకారానికి పూర్వ స్వరరూపమూ స్త్రీ లిఙ్గేతరాల్లో సకారానికి బదులు నకారమూ వస్తాయి. పితృ + శస్ - పితృ + అస్ - పితృ - ఋస్ - పితృ + ఋన్ - పితౄన్. ఇలానే ధాతౄన్, కర్తౄన్. స్త్రీ లిఙ్గంలో సకారానికి నకారం రాదు గనుక - మాతృ + శస్ - మాతృ + అస్ - మాతృ + ఋస్. మాతౄః అనే రూపం సిద్ధిస్తుంది.

౬౬. అర్ ఙౌ.

ఋకారాన్త లిఙ్గానికి ఙి పరమైనప్పుడు ఋకారానికి బదులు 'అర్' వస్తుంది. పితృ + ఙి - పిత్ఌర్ + ఙి – పితర్ + ఇ - పితరి. ఇలానే మాతరి, ధాతరి, కర్తరి.

ఇక్కడ పూర్వసూత్రంలోంచి 'శసి' అనే పదం అనువర్తింపజేసుకొని ఈ సూత్రాన్ని ఆర్' వరకూ విభజించి 'శసి - అర్' అని కూడా గ్రహించవచ్చు. దానిచేత పితృ + శస్ - పితర్ + శస్ - పితర్ + అస్- పితరః అనే ద్వితీయా బహువచన రూపం కూడా సిద్ధిస్తుంది. దీనిచేత "పితర స్తర్ప యామాస" అనే ప్రయోగం సాధించబడు తున్నది.

౬౭. ఘుటి చ.

ఋకారాన్త లిఙ్గాలకు ఘుట్ ప్రత్యయాలు పరమైనప్పుడున్నూ లిఙ్గాన్త ఋకారానికి బదులు అర్ వస్తుంది. అయితే "ఆ సౌ సిలోప శ్చ" (౨. ౧. ౬౪) అనే సూత్రంచేత ప్రథమైక వచనరూపం సిద్ధించింది, గనుక దాని కీ సూత్రం వర్తించ దన్నమాట. పితృ + ఔ - పితరౌ. ఇలానే పితరః, పితరం, పితరౌ. ఇలానే మాతరౌ, మాతరః, మాతరమ్. మాతరౌ. ఐతే ధాతువులకు విహితమైన 'తృ' ప్రత్యయంతో ఏర్పడిన శబ్దరూపాల విషయంలో భేదంవుంటుంది. అది అనన్తర సూత్రంలో విధించబడుతుంది.

౬౮. ధాతో స్తృ శబ్ద స్యార్.

'తృ' ప్రత్యయంతో ఏర్పడ్డ లిఙ్గానికి ఘుట్

ప్రత్యయాలు పరమైనప్పుడు లిఙ్గాన్త ఋకారానికి బదులు ఆర్ వస్తుంది. ఇది పైసూత్రానికి అపవాదం. ఇక్కడకూడా ౨.౧.౬౪ సూత్రంచేత ఏర్పడే ప్రథమైక వచనాన్ని ఘుట్ లోంచి మినహాయించుకోవాలి. 'కృ' ధాతువుకు 'తృ' ప్రత్యయం చేరి 'కర్తృ' అనే లిఙ్గం ఏర్పడింది. ఇలానే ధాతృ, గన్తృ, భర్తృ, నేతృ, హర్తృ మొదలైన లిఙ్గాలేర్పడుతున్నాయి. కర్తృ + ఔ - కర్తార్ + ఔ - కర్తారౌ; కర్తారః, కర్తారం, కర్తారౌ. ఇలానే ధాతారౌ, ధాతారః, ధాతారమ్, ధాతారౌ ఇత్యాదు లూహించుకునేది.

౨౯. స్వస్రాదీనాం చ.

స్వసృ, నప్తృ, నేష్టృ, త్వష్టృ, క్షత్తృ, హోతృ, పోతృ, ప్రశాస్తృ అనే ఎనిమిది లిఙ్గాలూ స్వస్రాదులు. వీటికన్నీ ప్రథమైక వచనేతర ఘుట్ ప్రత్యయాలు పరమైనప్పుడు లిఙ్గాన్త ఋకారానికి బదులు 'ఆర్' వస్తుంది. స్వసృ + ఔ - స్వసార్ + ఔ - స్వసారౌ; స్వసారః, స్వసారం, స్వసారౌ. నప్తారౌ, నప్తారః, నప్తారం, నప్తారౌ. ఇలానే ఈ గణంలో వున్న అన్ని శబ్దాలకూ ఊహించేది.

౩౦ ఆ చ న సమ్బుద్ధౌ

సమ్బుద్ధిలో లిఙ్గాన్త ఋకారానికి 'ఆర్' కాని, 'ఆ' కాని రావు. అంటే - "ఘుటి చ" (౨. ౧. ౬౭) అనే సూత్రంచేత 'అర్' మాత్రమే వస్తుం దన్నమాట. హే పితృ + సి - హే పితర్ + స్ హే పితర్ స్ - ఇక్కడ "సంయోగాన్తస్య లోపః" (౨. ౩. ౫౪) అనే సూత్రంచేత సంయోగాన్తంలో వున్న 'స్' లోపించి హేపితర్ అని అవుతుంది. "రేఫ సో ర్విసర్జనీయః" (౨. ౩. ౬౩) అనే సూత్రం చేత విరామంలో (పదాన్తంలో) రేఫకు విసర్జనీయం వచ్చి, హేపితః అనే రూపం సిద్ధిస్తుంది. ఇలానే హేమాతః, హేధాతః, హే భర్తః.

౩౧. హ్రస్వ నదీ శ్రద్ధాభ్యః సి ర్లోపమ్.

హ్రస్వానికీ నదికీ శ్రద్ధకూ పరమైన సమ్బుద్ధి 'సి' ప్రత్యయం లోపిస్తుంది. హే రామ, హే అగ్నే, హే గురో, హే మతే, హే ధేనో, హే గౌరి, హే వధు, హే మాలే, హే అమ్బ.

౩౨. ఆమి చ నుః.

హ్రస్వానికీ నదికీ శ్రద్ధకూ 'ఆమ్' పరమైనప్పుడు నకారం ప్రత్యయాదిని చేరుతుంది. రామ + ఆమ్ - రామ + నామ్ - రామా + నామ్ [సూ. ౨. ౧. ౧౪] రామాణామ్. [సూ. ౨. ౪. ౪౮] చేత నకారానికి బదులు ణకారం] కవి + ఆమ్ – కవి + నామ్ - ఇక్కడ "దీర్ఘ మామి సనౌ" [౨. ౨. ౧౫] అనే సూత్రం ప్రకారం అకారేతర స్వరాలకు నకారంతో కూడిన 'ఆమ్' పరమైనప్పుడు దీర్ఘం వస్తుంది. కనుక - కవీ + నామ్ - కవీనామ్. గురూణామ్; మతీనామ్; ధేనూనామ్. పితౄణామ్. గౌరీణామ్. వధూనామ్; రమాణామ్.

ఇక్కడ ఆమ్ అంటే ప్రకరణాన్ని బట్టి షష్ఠీ బహువచన ప్రత్యయమైన 'ఆమ్' నే గ్రహించాలి గాని "నద్యా ఐ ఆస్ ఆస్ ఆమ్" (౨. ౧. ౪౫) అనే సూత్రంలో వున్న 'ఆమ్' ను గ్రహించగూడదు. ఆ సూత్రం దగ్గర - నదీ ఆమ్ - నద్యామ్ (సప్తమీ ఏకవచనం) అనే అవుతుంది.

౩౩. త్రేః త్రయ శ్చ.

త్రి శబ్దానికి 'ఆమ్' పరమైనప్పుడు నకారం ప్రత్యయాదిని చేరటమేగాక 'త్రి' కి బదులు 'త్రయ' వస్తుంది. త్రి + ఆమ్ - త్రి + నామ్ - త్రయ + నామ్ - త్రయా + నామ్ - త్రయాణామ్. పరమత్రయాణామ్. [సమాసాన్తావయవమైనప్పుడు కూడా ఈ విధి వర్తిస్తుంది.]

౨౪. చతురః.

'చత్వార్' శబ్దానికి 'ఆమ్' పరమైనప్పుడు నకారం ప్రత్యయాదిని చేరటమేగాక 'చత్వార్'కు బదులు 'చతుర్' వస్తుంది. చత్వార్ + ఆమ్ - చత్వార్ - నామ్ — చతుర్ + నామ్ — చతుర్ + ణామ్ — చతుర్ణామ్. సమాసాన్తావయవమైనప్పుడు - అతిచతురామ్.

౨౫. సఙ్ఖ్యాయాః ష్ణాన్తాయాః.

షకార, నకారాన్తాలైన సఙ్ఖ్యాశబ్దాలకు 'ఆమ్' పరమైనప్పుడు నకారం ప్రత్యయాదిని చేరుతుంది. పఞ్చ + ఆమ్ - పఞ్చ + నామ్ - పఞ్చా - నామ్ - పఞ్చానామ్. షష్ + ఆమ్ - షష్ + నామ్ - "హ శ ష ఛాన్తేజాదీనాం డః" [౨. ౩. ౪౬] అనే సూత్రంప్రకారం హ, శ, ష, ఛవర్ణాలు అన్తంలో వున్న లిఙ్గాలకూ యజాది గణంలో వున్న లిఙ్గాలకూ పదాన్తంలోనూ వ్యఞ్జనాది ప్రత్యయం చేరినప్పుడున్నూ అన్త్య వర్ణానికి బదులు డకారం వస్తుంది. కనుక - షడ్ + నామ్ "షడో ణో నే" [౨. ౪. ౪౩] అనే సూత్రంచేత నకారం పరమైనప్పుడు 'షడ్'లో 'డ్'కు బదులు 'ణ్' వస్తుంది కనుక - షణ్ + నామ్ "తవర్గశ్చటవర్గయోగే చటవర్గౌ" [౨. ౪. ౪౬] అనే సూత్రం ప్రకారం అపదానమైన తవర్గం చ ట వర్గాలతో కలిస్తే చ ట వర్గాలుగా మారుతుంది. ఈ మార్పు వర్ణాల ఆన్తరతమ్యాన్ని బట్టి వుంటుంది. టవర్గాక్షరమైన ణకారానికి తవర్గాక్షరమైన నకారం కలిసింది. నకారం అనునాసికం గనుక టవర్గంలో అనునాసికమైన ణకారంగా మారుతుంది. ఇప్పుడు షణ్ + ణామ్ - షణ్ణామ్ అనే రూపం సిద్ధించింది. అష్టన్ శబ్దానికి "అష్టనః సర్వాసు" [౨. ౩. ౨౦] అనే సూత్రంచేత అన్ని విభక్తుల్లోనూ అన్తాదేశంగా ఆకారం వస్తుంది. అందుచేత 'అష్టా' అనే రూపం విభక్తిప్రత్యయాలకు ముందు ఏర్పడుతుంది. అయినప్పటికీ ఇది నకారాన్త శబ్దమే గనుక దీనికీ 'ఆమ్' పరమైనప్పుడు ప్రస్తుతసూత్రం ప్రకారం నకారం ప్రత్యయాదిని చేరుతుంది. అష్టా + నామ్ - అష్టానామ్ - సప్తానామ్.

౨౬. కతేశ్చ జశ్శసోర్లుక్.

సఙ్ఖ్యావాచకమైన కతి శబ్దానికిన్నీ షకార, నకారాన్త సఙ్ఖ్యావాచకాలకున్నూ పరమైన "జస్, శస్"లు లోపిస్తాయి. కతి శబ్దం నిత్య బహువచనం. స్త్రీ పుంనపుంసక లిఙ్గాలు దీనికిసమానం. కతి + జస్ - కతి. కతి + శస్ - కతి. పఞ్చన్ + జస్ - పఞ్చ + జస్ [ఇక్కడ "లిఙ్గాన్త నకారస్య" [౨. ౩. ౫౬] అనే సూత్రం ప్రకారం లిఙ్గాన్తంలో వున్న నకారం లోపించింది] పఞ్చ + జస్ - పఞ్చ. పఞ్చ + శస్ - పఞ్చ. షష్ + జస్ - షష్ - షడ్ - షట్ "వా విరామే" (౨. ౩. ౬౨) అనే సూత్రంచేత పదాన్తంలో వర్గప్రథమం వచ్చింది. షష్ + శస్ - షష్ - షడ్, షట్.

౨౭. నియో ఙేరామ్.

'నీ' శబ్దానికి పరమైన 'ఙి'కి బదులు 'ఆమ్' వస్తుంది. నీ + ఙి - నీ + ఆమ్ - "ఈదూతో రియువౌ స్వరే" [౨. ౨. ౫౬] అనే సూత్రంచేత ధాతుసమ్బన్ధి లిఙ్గాన్తాలైన "ఈ, ఊ"లకు బదులు క్రమంగా "ఇయ్, ఉవ్" అనేవి స్వరం పరమైనప్పుడు వస్తాయి. నీ + ఆమ్ - నియ్ + ఆమ్ - నియామ్. అయితే ఈ 'నీ' శబ్దం సమాసాన్తావయవమై గ్రామణీ శబ్దం ఏర్పడుతున్నది. అప్పుడు గ్రామణీ + ఆమ్ - "అనేకాక్షరయోస్త్వసంయోగాద్యవౌ" [౨. ౨. ౫౭] అనే సూత్రం వర్తిస్తుంది. లిఙ్గం అనేకాక్షరాలు కలదై, దాని చివరి "ఈ, ఊ"లకు వెనుక సంయుక్తాక్షరం లేకపోతే అప్పుడు "ఈ ఊ"లకు బదులు "య్, వ్" మాత్రమే వస్తాయి. కనుక గ్రామణీ + ఆమ్ - గ్రామణ్ + య్ + ఆమ్ - గ్రామణ్యామ్ అనే రూపం సిద్ధిస్తుంది. అంతే కాని "గ్రామణియమ్" అనే రూపం రాదు.

ఇతి కాతన్త్ర వ్యాకరణే ద్వితీయ స్యాధ్యాయస్య ప్రథమః పాదః.

ఇది శ్రీ శ్రీనివాస సోదర కృత లఘువృత్తి సహితమైన కాతన్త్ర వ్యాకరణంలో ద్వితీయాధ్యాయంలో ప్రథమపాదము.

పంచవటి

శ్రీ తే. వేం. న్ర. అప్పారావు

౧

పతిపదనేందు నిస్సృతము వాగమృతంబు శ్రవః పుటంబులన్
సతియటు గ్రోలి యెంతయును సంతసమందుచు భక్తిపూర్ణవా
మతిఁగరకంజమున్ మొగిచి మాన్యవరన్ నది నివ్విధంబునన్
స్తుతులొనరించెఁ దద్విమల తోయముఁబోలు వచః ప్రసంగతిన్

"చల్లనితల్లి! గౌతమిరో! సమ్మద మొప్పఁగ నీకు నిత్యమున్
మొల్లలు దండ గ్రుచ్చి యిడి మ్రొక్కెద, నిగ్గన నేత్ర పర్వమౌ
మల్లవు రఁజిలున్, గుళావోల్లసితంబగు పార్శ్వ యుగ్మమున్
పల్ల ఖతో నభిన్నతయు వర్తిలు నీ సరియౌట గోరఁదున్

"నీరధి సంగమంబె కద! నీకిటు జీవన ముఖ్యహేతువౌ
నీకము కల్గియున్ నడుమనే నశియింపవె యెన్ని యోనదుల్?
చేరువనాథుఁడుండ వనసీమయు నాకిట బూలతోఁటయౌ,
గ్రూర నిశాచరుల్ వికృత రూపులు మింతురు హాస్యవేషులై

"ఉరవడిఁ గాక మైదరసి యొక్కఁడు నేత్రము గోలుపోయె, నా
సురమగు మాయతోఁ గదిసి జోటి యొకర్తు విరూపయయ్యె, నా
ఖరముఖ రాక్షసుల్ చెనసి క్రమ్మగ ప్రాణములే పరిత్యజిం
చిరి, రఘురాము రక్షగల జీవుని నేరికిఁ దాఁకశక్యమౌ?

"పతియట రామమూర్తి సరసంద్యుఁడు నేక సతీవ్రతస్థుఁడున్
సుత సదృశుండు లక్ష్మణుఁడు చొక్కపుసేవ లొనర్చునంట, దా
సతతము ప్రేముడిన్ జనని స్థానము నించెదవంట నీవిఁకన్
క్షితి తలమందు నాకు సరి చేడియ యెవ్వతె గల్గు ధన్యతన్

"రాముని వీడి నే క్షణముఁ బ్రాణము నిల్పఁగఁజాల భూమిపై
రాముఁడు నట్లె నన్నుఁ దన ప్రాణ సమానను వీడనెంచఁడీ
నేమము దప్ప మైమఱపు నెక్కొని యొండొరు వీడకుండ మా
కోమహనీయమూర్తి! సదయోద్యత చిత్తవనీవె! దీవెనల్"

ఆయతి నెంచి శంకగొని యాత్మఁ దలంచుచు నున్న ప్రేయసిన్
జాయని ప్రేమ నివ్వటిలఁ బజ్జకుఁ దార్చి తదీయకంబు శో

భాయుత కంఠ సీమఁ దన బాహువునుంచి రఘూద్వహుండిటుల్
తీయని మాటలన్ మనసు దేర్పఁ దలంచి వచించె నత్తఱిన్

"జనకజ! ధైర్యమూను మది శంకల కెన్నడుఁ దావొసంగకే
దనుజుల మాయలం దవిలి దప్పుగ నన్నెపు డంపకున్నచో
మనలను వేఱుచేయఁగల మల్లుఁడు లేఁడిల, బుద్ధి నుంచుమా !
వనితల చిత్తముల్ కనక వస్తువులన్న భ్రమించుగా వెసన్ !

"భూమిజ ! నిన్నుఁ దక్కఁగలవోటులరీతి గణింపఁ ద్యాగమే
భామిని రూపు దాల్చి యిటు వర్తిలునంచుఁ దలంతు నిత్యమున్
నీ మహనీయ సంగతిని నిల్పుట చేతనె నాకుఁగూడ శ్రీ
రాముఁడు దేవుఁడన్ యశము రాజిలు నీ భువి నెల్లచోటులన్

"తనకై యన్యహితంబుఁ ద్రుంచునరుఁడే దైత్యాఖ్యుఁడౌ, నాతఁడే
తనలాభంబును నీడి యన్యహిత సంధానంబునన్ దేవుఁడౌ
జను లేనాట సదా పరోప కృతి దీక్షాదక్షులై యుందురో
మనమందే యహితేచ్ఛ లేక యదె సుమ్మా! రామ రాజ్యంబిలన్

"బలి దైత్యాధిపుఁ డొక్కఁడే త్రిభువన ప్రవ్యాప్త రాజ్యేందిరన్
బలిమిన్ గైకొన వాని సంపదలు సర్వంబొక్క హ్రస్వాంగుచేఁ
జలితంబై చనె, నేల మూడడుగులే చాలంచుఁ దాముజ్జగం
బులు నిండన్ మెయివెంచి యావటుఁడహో! పూర్ణావనిన్ బొందఁడే?

"మహిసుత! యావిధంబుగనె మామక కాంతకు నీకు నెవ్వఁడే
నహిత మొనర్ప నెంచినను నయ్యది చెల్లదు; వాఁడు వార్ధిలో
గృహమును గట్టుకొన్నను నొకే యొక యంగను దాఁటఁజాలు భూ
ర్వహుఁ డొకఁ డెంతయున్ వినయ భావుఁడు పావన మూర్తి వచ్చుఁజూ !"

ఈ విధిఁ బ్రాణనాథుఁడు వచింపఁగ జానకి హృష్టచిత్తయై
పూవులనం జలించి పరిపూర్ణ మనంబునఁ జల్లె గౌతమిన్;
ఆ వెనువెంట సీత పయి నచ్చటి చూత మొకందు చంచరీ
కావళి యుక్త గుచ్ఛమిడి యాశిషముల్ పచరించె సమ్మతిన్.

పంచ కోశాత్మ దేహమే పంచవటిగ
తత్స్థ జీవుండె గౌతమీ తటిని గాఁగ
నందు నిల్చు ప్రకృతిపూరుషాద్యమిథున
మవనిజారాములుగ నెంచి యంజలింతు

(సమాప్తము)

ఆధునిక పదార్థ విజ్ఞానపు క్రొత్త ప్రపంచం

శ్రీ వసంతరావు వేంకటరావు

౧

[విజ్ఞానాన్ని జన సామాన్యాని కందీయడానికి కృషి చేసినవారిలో సర్ జేమ్స్ జీన్సు విశిష్ట స్థానాన్ని ఆక్రమిస్తాడు. ఆయన వ్రాసిన పుస్తకాలలో "The Mysterious Universe" ని రెండేండ్లలో తొమ్మిదిసార్లు అచ్చువేసేరు. ఎంత క్లిష్టమైన విషయాన్నిగాని సూటిగాను సులభంగాను చెప్పగలవాడు జీన్సు: పదార్థ విజ్ఞానంలోను, గణితంలోను అనేక పరిశోధనలు చేసిన మేధావి.

భౌతికజ్ఞాన స్వరూపం ఈ శతాబ్దారంభంతో మారజొచ్చింది. సాంప్రదాయక విజ్ఞానానికి భిన్నంగా అనేక నూతన భావాలు పదార్థ విజ్ఞానంలో జనించేయి. ద్రవ్యంలో నిజంగా ఎంత మట్టుకు ద్రవ్యత్వముంది? ప్రాథమిక కణాలైన ఎలక్ట్రాను ప్రోటాను న్యూట్రానులు కణాలా? మనం కాంతిగా భావించే శక్తి తరంగసమూహమా, లేక, కణసముదాయమా? భౌతిక ప్రపంచం గురించి యథార్థమైన జ్ఞానాన్ని నిజంగా సంపాదించగలమా? విశ్వంయొక్క రహస్యమేమిటి? ఇట్టి ప్రశ్నలకెన్నెన్నో సమాధానం చెప్పడానికి ప్రయత్నించేడు జీన్సు. The Mysterious Universe లో రెండవ ప్రకరణానికి స్వేచ్ఛానువాదమిది.]

ఆదిమ మానవునికి ప్రకృతి సంకులంగా కనిపించి యుండాలి. అదొక సమస్య. సామాన్య విషయాలు ఎల్లప్పుడూ ఆదేవిధంగా జరుగుతాయని నమ్మవచ్చు; పట్టు తప్పిన వస్తువు ఎల్లప్పుడూ క్రిందపడింది, నీటిలో వేసినరాయి మునిగింది, కర్రముక్క తేలింది. కొన్ని సంకుల విషయాలు ఇట్టి సామరస్యాన్ని చూపలేదు- తోటలో రెండుచెట్లు ఒకేలాంటివి, ఆకారంలోను పరిమాణంలోను ఉంటే వాటిలో ఒక దానిపై పిడుగు పడింది, రెండవది చెక్కు చెదరలేదు. ఒక నెలలో అమావాస్య చంద్రుడు సుదినాలను, రెండవనెలలో దుర్దినాలను తెచ్చేవాడు.

చంచలమైనవాడు మనిషి. ప్రకృతికూడా, తనవలె, చంచలంగానే కనిపించింది. అట్టి ప్రకృతిని ఎదుర్కొన్న మానవుడు తన ప్రతిబింబంలో ప్రకృతిని దర్శించేడు. జంగమంగాను అక్రమంగాను కనిపించిన ప్రపంచ గమనాన్ని దేవుళ్ళ చిద్విలాసాలకో దయ్యాల కోప తాపాలకో అంట కట్టేడు. ఎంతో పరిశ్రమ చేసినతరువాత కాని హేతువాదం బయల్పడలేదు. క్రమేణ, అది జడ ప్రకృతి కంతటికి వర్తించునట్లు తోచింది. ఇతర పరిస్థితులకు లోను కాని ఒక కార్యం ఎల్లప్పుడూ ఒకే ఫలితాన్ని కలిగించింది. ఒకక్షణ మందు సంభవించేది ఏ సంఘటన యైనా, దానికి పూర్వమందున్న పరిస్థితుల బట్టి జరుగుతుంది. పైవారి మన స్థితిపై ఆధారపడదు. అవిధంగా సంచరించడం అనివార్యం. ఇక, ఆపరిస్థితులను నిర్ణయించినవి దానికి పూర్వమందున్న పరిస్థితులు. ఈవిధంగా వెనుకకుపోతే, ప్రపంచచరిత్రలో మొట్టమొదటి క్షణంలో నున్న పరిస్థితులే ఘటనాక్రమాన్ని యావత్తు అనివార్యంగా నిర్ణయించేయి. ఒక మారిట్లు నిర్ణయింపబడిన తరువాత ఒకే మార్గాన్న ప్రకృతిగమిస్తూ ఆదిలో నిర్ణీతమైన లక్ష్యాన్ని చేరుకోవాలి. అందే. "సృష్టి" అనే కర్మ జగత్తునే కాక దాని భవిష్యత్ చరిత్రను యావత్తు సృష్టించింది.

17 వ శతాబ్దం చాలగొప్ప శతాబ్దం. అందులో గెలిలియో, న్యూటన్ వంటి శాస్త్రప్రవీణులు జీవించేరు. ప్రకృతి గమనానికి హేతువాదమే ప్రధానమైన సూత్రంగా అంగీకరింపబడడం 17వ శతాబ్దిపు విజయమని చెప్పాలి. ఆకాశంలో గోచరించు గ్రహాలు తోకచుక్కలు వంటివి సర్వజనీనమైన కాంతి సూత్రాలననుసరిస్తున్నాయని గమనించేరు. సామ్రాజ్యాల పతనాన్నో రారాజుల మరణాన్నో సూచించేవిగా, అంతవరకు, భావింప బడిన తోకచుక్కలు, కేవలం, సార్వత్రిక గురుత్వాకర్షణ నియమాలననుసరించి ఆకాశయానం చేస్తున్నట్లు రుజువైంది. "మిగిలిన ప్రకృతి విషయాలుకూడా, యాంత్రిక నియమాల ననుసరించి సంభవిస్తున్నాయని, ఇదేవిధంగా, రుజువైతే ఎంత బాగుంటుంది" అన్నాడు న్యూటన్.

ఇట్టి భావాలనుండి ద్రవ్యమయ ప్రపంచాన్ని యావత్తు ఒక యంత్రంగా నిరూపించడానికొక ప్రచారం బయలుదేరింది అదిపెరిగి, 19వ శతాబ్దపు రెండవ సగంలో బలపడింది. అప్పుడు "యంత్ర శాస్త్రంగా వివరింప బడటమే ప్రకృతి శాస్త్రాల అంతిమాశయం" అని హెల్మ్‌హోర్ట్జ్ ప్రకటించేరు. ఏదావాన్ని కాన్ని దానియొక్క నమూనాను చేయనిదే ఊహించలేనని లార్డ్ కెల్విన్ అన్నారు. 19వ శతాబ్దపు విజ్ఞానంలో కెల్విన్ గొప్ప యంత్రకళాశిల్పుడు. అది యంత్ర కళాభిజ్ఞులగు శాస్త్రజ్ఞుల యుగం. యావత్ ప్రకృతిని కొన్ని నమూనాలతో నిరూపించడమే వారి ఆశయం. వాయువొక యంత్రమన్న భావంలో వాటర్‌స్టన్, మాక్స్‌వెల్ మొదలగువారు దాని గుణాలను వివరించేరు. ఉక్కుకంటె దృఢమై, నున్నగా గుండ్రముగానున్న సూక్ష్మగోళాలు అసంఖ్యాకంగా ఆ యంత్రంలో నున్నాయి. యుద్ధరంగంలో దశదిశలు దూసికొనిపోవు తుపాకిగుండ్లవలె అవి అన్నిదిక్కులా ఎగురుతుంటాయి. వాయువులో ఒత్తిడికలిగించేవి ఈ గుండ్లే. ఒక డేరామీద వడగండ్లు పడినప్పుడెట్టి ఒత్తిడిని కలిగిస్తాయో, అదేవిధంగా, ఈ గుండ్ల తాకిడివల్ల వాయువులో ఒత్తిడి కలుగుతుంది. వాయువులో ధ్వని ప్రసరించినప్పుడు ఈ గుండ్లే ధ్వనిని మోసికొనిపోతాయి. ఇదేవిధంగా ఘన, ద్రవ పదార్థాల లక్షణాలను వివరించడానికి చేసిన ప్రయత్నాలు అంత ఫలించలేదు. కాంతి విషయం గురుత్వాకర్షణ విషయం చేసిన ప్రయత్నాలు విఫలమైనాయి. అయినప్పటికీ, తుట్టతుదకు జగత్తు యాంత్రిక నిరూపణను ఒప్పుకొనక తప్పదన్న నమ్మకాన్ని ఈ వైఫల్యం సడలించలేకపోయింది. మరికొంత కృషి చేసినట్లైతే జడ ప్రకృతి యావత్తు ఒక సమగ్రమైన యంత్రమట్లు తుదకు గోచరిస్తుందని విశ్వసించే స్థితికి వచ్చింది.

మానవ జీవితాన్ని అర్థంచేసికొనే సందర్భంలో ఈ నూతన దృష్టికొంత మార్పుకలిగించింది. మానవునికి ఇచ్ఛాస్వాతంత్ర్యమున్నదని భావించేవారు కాని, హేతువాదానికి లోబడే సంఘటనల సంఖ్య పెరుగుతూన్న కొద్దీ, యంత్రవత్ ప్రకృతి గమిస్తూందని రుజువౌతూన్న కొద్దీ ఇచ్ఛా స్వాతంత్ర్యాన్ని నమ్మడం కష్టం కాజొచ్చింది. హేతువాదానికి ప్రకృతి లోబడినప్పుడు జీవం మాత్ర మెట్లులోబడదు అను ప్రశ్న జనించింది. ఇట్టి భావాలనుండి యంత్రదృష్టిగల తత్త్వశాస్త్రాలు 17, 18వ శతాబ్దాలలో జనించేయి. వాటికి ప్రతిక్రియ ఆదర్శ తత్త్వశాస్త్రాలు జనించేయి. జడ ప్రపంచాన్ని యావత్తు ఒక యంత్రంగా భావించే దృష్టికి విజ్ఞానం దోహద మిచ్చినట్లు కనిపించింది. దానికి ప్రతిగా ప్రపంచాన్ని భావనాసృష్టిగా భావించడానికి ఆదర్శవాదం ప్రయత్నించింది - జగత్తులో భావంతప్ప వేరేమీ లేదంది.

జడ ప్రకృతివేరు జీవంవేరు అనే భావం 19వ శతాబ్దపు శాస్త్రజ్ఞానానికి అనుగుణంగా ఉండేది. అప్పుడొక క్రొత్త విషయం బయల్పడింది. ఏరసాయనిక పరమాణువులతో జడ పదార్థంఏర్పడుతూందో ఆ పరమాణువులతోనే జీవకణాలుకూడా ఏర్పడుతున్నాయని తెలియవచ్చింది. అందుచేత, జీవకణాలుకూడా ప్రకృతి నియమాలకు లోబడ్డాయా? మన శరీరాలుగాను మెదడుగాను ఏర్పడిన పరమాణువులు మాత్రం హేతువాదాని కెందుకు లోబడవు? అంటే, తుదకు జీవంకూడా యాంత్రిక స్వభావం కలదేమో అను సందేహం కలిగి బలపడ జొచ్చింది - అచ్చుయంత్రం, ఉష, మరరంపం, ఈమూడూ యంత్రాలే; వాటి నిర్మాణం లో భేదముంది. కాని వాటి ప్రయోజనం ఒక్కటే. అది, బాహ్యప్రచోదనలకు అనుగుణంగా ప్రవర్తించడం. అదే విధంగా, న్యూటన్, లాక్, మైత్రె లేంతెలో మొదలగు మేధావుల మనస్సులకు సంకులత్వంలో వ్యత్యాస మున్నప్పటికీ బాహ్యప్రచోదనలకు ప్రతిక్రియ చూపడమే వాటి స్వభావమని అనుకొనే స్థితికి వచ్చింది. ఇట్టి భావం ఇచ్ఛా స్వాతంత్ర్యానికి తావివ్వదు. అందుచేత నైతిక ప్రవర్తనానికి ఆధారం పోయింది. సాల్‌కంటె పాల్ వేరుగానుండాలని అనుకోలేదు; కాని వేరుగానుండక తప్పింది కాదు. ఏమంటే వేరొక రకమైన బాహ్య ప్రచోదనలకు అతను లోనయేడు.

19వ శతాబ్దం మారగానే మున్నెన్నడెరుగని మార్పు వైజ్ఞానిక యోచనా క్రమంలో వచ్చింది. అసహాయ పంచేంద్రియాలకు గోచరించు నంతటి పెద్ద ద్రవ్యఖండాలను మాత్రమే మొదటి విజ్ఞానులు పరిశీలించ కలిగేరు; అట్టి ఖండాలలో సూక్ష్మతమమైన దాని యందు కోట్ల కొలది అణువులున్నాయి. ఆపరిమాణంగల ముక్కల ప్రవర్తన యంత్రవత్ ఉన్నది; అంతమాత్రాన్న వ్యక్తిగతంగానున్న అణువులు అదే విధంగా ప్రవర్తిస్తాయనడానికి అవకాశంలేదు. ఒక ఉత్సవం ఊరేగుతూంటే దొమ్మిగా నున్న జన సమూహం యొక్క ప్రవర్తనకు, అందులోనున్న వ్యక్తుల ప్రవర్తనకు గల వ్యత్యాసం అందరెరిగినదే.

వ్యక్తిగతంగానున్న అణువులను, పరమాణువులను, ఎలక్ట్రానులను పరిశీలించి వాటి స్వభావాన్ని తెలిసికోడానికి 19వ శతాబ్దాంతంలో తొలిసారిగాసాధ్యమైంది. కిరణ ప్రసారము, గురుత్వాకర్షణము మొదలగు విషయాలుకొన్నియాంత్రికనిరూపణకులొంగవని విజ్ఞానం

తెలిసికొనే పరికి ఆశతాల్దం గతించింది. న్యూటన్ యొక్క యోచనలను, బాక్ యొక్క ఆవేశాలను, మైకెలేంజెలో యొక్క ఉత్తేజాలను పునః సృష్టించగలయంత్రాన్ని నిర్మించగలమూ అని తత్త్వవేత్తలు తర్జన భర్జన చేస్తూండగా, క్రొవ్వొత్తి యొక్క కాంతిని ఆపిల్ పండుయొక్క పతనాన్ని పునః సృష్టించగల యంత్రాన్ని నిర్మించే అవకాశం లేదన్న పరిస్థితిని అంగీకరించడానికి సామాన్య విజ్ఞాని సిద్ధమౌతున్నాడు. 19వ శతాబ్దం ముగియ వస్తుందనగా బెర్లిన్‌వాసి మాక్స్‌ప్లాంక్ కిరణ ప్రసార విషయమై ఒకవాదాన్ని ప్రతిపాదించేడు. అది యాంత్రిక నిరూపణకు విరుద్ధంగా నుండడమే కాక యాంత్రిక భావంతో సమన్వయింప సాధ్యంకానిది. అందుచేత దానిని విమర్శించేరు, గేలిచేసేరు. కాని, తుదకది విజయవంతమై నేటి క్వాంటం సిద్ధాంతంగా పరిణమించింది. ఆధునిక పదార్థ విజ్ఞానంలో ఇదొక బలమైన సిద్ధాంతం. అంతే కాదు. అప్పటికి స్పష్టం కానప్పటికి యాంత్రికయుగానికి స్వస్తి చెప్పి నవీన యుగాన్ని క్వాంటం సిద్ధాంతం ప్రారంభించింది.

గడియారపు ముల్లులో సెకెండ్లముల్లు ముఖ్యంగా, సెకెండుకొకసారి గెంతుతూ గమిస్తుంది. అదేవిధంగా ప్రకృతి గమనం కూడా చిన్నకుదుపులతో గెంతులతో జరుగుతూంటదని క్వాంటం సిద్ధాంతం ప్రాథమికంగా సూచించింది. గడియారపు ముల్లు అవిచ్ఛిన్నంగా గమించనప్పటికి గడియారం ఒకయంత్రం; అది కార్యకారణ నియమాన్ని అనుసరిస్తుంది. అయితే, ప్లాంక్ యొక్క క్వాంటం సిద్ధాంతం విచ్ఛిన్న భావాన్ని ప్రవేశపెట్టడం కంటె చాలా విప్లవాత్మకమైనదని 1917లో ఐన్‌స్టైన్ సూచించేడు. భౌతిక ప్రపంచగమనానికి ఆధారభూతముగా భావింప బడుతూన్న హేతువాదాన్ని కూలద్రోసేటట్లు కనిపించింది. సృష్ట్యాదినే విశ్వగమనాన్ని నిర్ణయించిన కార్యకారణ సంబంధాన్ని అనుసరిస్తూ ప్రకృతి ఒకే మార్గాన్ని గమించగలదని సంప్రదాయ విజ్ఞానం ఘంటాపథంగా చెప్పింది. ఎట్లాగంటే 'ఆ'అనుపరిస్థితి 'అ' అనుపరిస్థితి నుండి వచ్చి తీరాలి. కాని, 'అ' అనుపరిస్థితి నుండి 'ఆ' 'ఇ' 'ఈ' అనుపరిస్థితులలో ఏదైనరావచ్చునని నవీన విజ్ఞానం చెప్పగలిగింది వాటిలో 'ఇ' కంటె 'ఆ' ఎక్కువ సంభావ్యము; 'ఈ' కంటె 'ఇ' ఎక్కువ సంభావ్యము అని కూడ చెప్పగలదు. 'ఆ' 'ఇ' 'ఈ' లలో ఏది ఎక్కువ సంభావ్యమో నిర్ణయించి వాటి సాపేక్ష సంభావ్యతలను కూడ చెప్పగలదు. కాని, ఏఅవస్థనుండి ఏఅవస్థవస్తుందో నికరంగా చెప్పలేక ఏదిఎక్కువ సంభావ్యమో మాత్రమే చెప్పగలగడం చేత భగవంతుడుంటే భగవదేచ్ఛగా భావించవలసి వచ్చింది.

ఒక ఉదాహరణతో దీనిని స్పష్టీకరింప వచ్చును. రేడియంపరమాణువులు, ఇతర రేడియోధార్మిక పదార్థాల పరమాణువులు కేవల కాలగమనంతో విచ్ఛిత్తి నొంది సీసం పరమాణువులుగాను హీలియంగాను మారుతాయని తెలుసును. అంటే, కొంతకాలమైన తరువాత కొంతరాశి రేడియం తరిగిపోయి దాని స్థానంలో సీసము హీలియంమిగులుతాయి. అయితే ఏరేటున రేడియం తరిగి పోతుందో సూచించు నియమం అద్భుతమైనది. ఒక ఊరిలోనున్న జనాభాలో పుట్టుక లేదను కొందాం. వయస్సుతో నిమిత్తం లేకుండా నూటికి కొంతరేటు చొప్పున జనం మరణిస్తూంటారను కొందాము. అప్పుడా జనాభా ఏవిధంగా ఏరేటా క్షీణిస్తుందో ఆదేవిధంగా ఒకరాశి రేడియం క్షీణిస్తుంది. లేదా, యుద్ధరంగంలో నిర్లక్ష్యంగా తుపాకులు పేలుతున్నప్పుడు క్షీణించే సైనికులవలె రేడియం పరమాణువులు క్షీణిస్తాయని భావింపవచ్చును. వ్యక్తిగతంగానున్న రేడియం పరమాణువు సందర్భంలో బలాత్కారం చేత అది విచ్ఛిన్నమౌతుందనడానికి వీలులేదు, తలపుకొట్టి విధి బలాత్కరిస్తున్నట్లుంది.

ఇంకొక ఉదాహరణ. మనగదిలో 2000 రేడియం పరమాణువులున్నాయనుకొందాం, ఒకసంవత్సరమైన తరువాత వీటిలోఎన్నివిచ్ఛిన్నం కాకుండా మిగులుతాయో విజ్ఞానంచెప్పలేదు. 2000, 1999, 1998 సంఖ్యలలో సాపేక్షంగా ఏదిమిగలడానికి ఎక్కువఅవకాశముందో మాత్రమే చెప్పగలదు. 1999 మిగలడం ఎక్కువ సంభవమను కొందాం అప్పుడు2000లలో ఒకే ఒక్క పరమాణువు విచ్ఛిన్నమయే అవకాశముంది.

అయితే, ఇట్లు విచ్ఛిన్నమయే పరమాణువు 2000 పరమాణువులలో ఏవిధంగా ఎన్నుకొన బడుతుందో చెప్పలేము. వచ్చే సంవత్సరంలో ఏదిఎక్కువ వేగంతో గమిస్తుందో లేక ఏది ఎక్కువ వేడిగానున్న స్థానాన్ని ఆక్రమిస్తుందో ఆపరమాణువే విచ్ఛిన్నం కావచ్చునని ఊహించడానికి మనం ప్రయత్నించవచ్చు. కాని అదినిజంగాదు, గమన వేగంచేత వేడిచేత ఒక పరమాణువును బ్రద్దలుకొట్టగలిగిన శ్రమ మిగిలిన 1999 పరమాణువులను కూడ బ్రద్దలు చేయ వచ్చును. అంటే, రేడియంను వేడిచేసిగాని, దానిపైఒత్తిడి కలిగించిగాని దాని పరమాణువులను వేగంగా ముక్కలు చేయగలిగిఉండాలి. కాని ఇది అసంభవమని విజ్ఞానికి తెలుసును, అంతకంటె,2000 పరమాణువులలో ఒక

దానిని విధి తట్టిబుద్ధలు కమ్మని బలవంతపెట్టునని నమ్ముతారు. ఈపరిస్థితిని గమనించి 1903 లో రథర్‌ఫర్డ్, సాడీ, అనువిజ్ఞానులు "యాదృచ్ఛికవిచ్ఛిత్తి" అనువాదాన్ని ప్రతిపాదించేరు.

చరిత్రపర్యవేక్షణమై, ఇంతవరకు హేతువాదానికి లొంగని సంఘటనయేదైనా నవీన జ్ఞాన రశ్మిలో హేతువాదానుగుణంగా నున్నట్లు తెలియవచ్చును. ఒకవిషయం గురించి సంభావ్యతా పరిభాషలో మాట్లాడినప్పుడు దానిగురించి మనకు సమగ్రమైన జ్ఞానం లేదని అంగీకరించినట్లు. రేపు వర్షించడానికవకాశముంది అని మనం అన్నప్పుడు అట్లాంటిక్ సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం తూర్పుగా గమిస్తున్నందున రేపుతప్పక వర్షించునని చెప్పగలము. ఒకగుర్రం మంచి చెడ్డలను గురించి మనంవాకొనవచ్చు, దాని యజమానికి కాలువిరిగిందనితెలుసును.

దానికొకఉదాహరణ. ఘనపదార్థాలలోనికి జొరబడుసామర్థ్యంగల క్రొత్తకిరణప్రసారాన్ని ఈశతాబ్దారంభంలో మేక్లెన్నెన్, రథర్‌ఫర్డ్ మొదలగువిజ్ఞానులు భూవాతావరణంలో గుర్తించేరు. మామూలు వెలుతురు లోహతలాలలో అంగుళంలో సహస్రాంశం మాత్రమే చొచ్చుకొని పోవును, ఒక కాగితంతో సూర్యరశ్మినుండి ముఖాలను కాపాడుకోగలం, అంతకంటె పలుచనరేకైనా సరిపోతుంది. అంతకంటె ఎక్కువసామర్థ్యం గలవి X కిరణాలు అవి మన శరీరంలో జొరబడగలవు, ఎముకలు మాత్రం వాటిని అడ్డుతాయి. అందుచేత X కిరణాలతో ఎముకల ఛాయాచిత్రాన్ని తీయగలం. వాటినైనా కాసి దళసరిగల లోహం నిరోధిస్తుంది. కాని మేక్లెన్నెన్ రథర్‌ఫర్డ్‌లు కనుగొన్న ప్రసారం కొన్ని గజాల దళసరిగల సీసంలోనుండి దూసికొని పోతుంది.

ఆప్రసారాన్ని "కాస్మిక్ ప్రసార" మంటారు. కాస్మిక్ ప్రసారంలో అధికభాగం బాహ్యాకాశంలో జనిస్తుందని తెలుసును. అది భూపరిమాణంలో భూమిపైపడుతుంది దాని విధ్వంసక శక్తి అపారం. వాతావరణంలో ప్రతి ఘనపుటంగుళమందున్న అణువులలో ఇరవైపరమాణువుల వంతున ప్రతి సెకెండు బ్రద్దలుచేస్తుంది; మనశరీరాలలో సెకెనుకి కోట్లకొలది పరమాణువులను విచ్ఛిన్నం చేస్తుంది. అధునిక పరిణామవాదం ప్రకారం ఆకస్మికంగా జీవులలో కలుగు మార్పులకు కారణ మీప్రసారమే కావచ్చు. అది జీవద్రవ్యంపైపడి క్రొత్త మార్పులు కలిగించు చుండవచ్చును. మర్కటాన్ని మనిషిగా మార్చింది కాస్మిక్ ప్రసారమే కావచ్చు.

ఇదేవిధంగా, రేడియోధార్మిక పరమాణువుల విచ్ఛిత్తికి కారణం కాస్మిక్ ప్రసారమేమో అను సందేహమొకప్పుడు కలిగింది. విధివిధించినట్లు ఇప్పుడొక పరమాణువుని మరొక్కప్పుడు మరొక పరమాణువుని కాస్మిక్ కిరణాలు బ్రద్దలు చేయగా నిర్లక్ష్యంగా పేల్చిన తుపాకి గుండ్లకెదురైన సైనికులట్లు అవి విచ్ఛిన్నమయే యనుకొంటే వాటివిచ్ఛిత్తిని వివరించు నియమం సులభంగా అర్థమౌతుంది. కాని, కాస్మిక్ ప్రసారానికి గురి కాకుండా సీసగనులలోకో రేడియోధార్మిక పదార్థాలను తీసికొని వెళ్ళినప్పుడు విచ్ఛిత్తి రేటు తగ్గాలి, కాని, అందులో ఏట్టిమార్పు లేక పోవడం చేత రేడియోధార్మిక విచ్ఛిత్తికి కాస్మిక్ ప్రసారానికి సంబంధం లేదని స్పష్టమైంది.

సైవాదం భగ్నమైంది. కాని, రేడియోధార్మిక విచ్ఛిత్తిలో విధికి బదులుగా మరొక భౌతిక సంఘటనను కనుగొన వచ్చునని విజ్ఞానులు చాలమంది భావింపవచ్చును. అప్పుడా సంఘటన యొక్క శక్తికి అనుగుణంగా ఉంటుంది రేడియోధార్మిక విచ్ఛిత్తి రేటు. కాని, ఇట్టి దృగ్విషయాలు క్లిష్టమైనవి ఇంకా ఉన్నాయి.

అట్టివాటిలో, సామాన్యమైన విద్యుద్దీపం నుండి వెలువడు కాంతి ప్రసారం ఒకటి. ఒక పేటితీగ ఒక డైనామో నుండి శక్తిని గ్రహించి కిరణ ప్రసారంగా దానిని వెలువరిస్తుంది. ఆతీగలో కోట్లకొలది పరమాణువులున్నాయి. వాటిలోనున్న ఎలక్ట్రానులు వాటి కక్ష్యలలో మహావేగంగా భ్రమిస్తూ ఒక కక్ష్యనుండి వేరొక కక్ష్యలోనికి ఆకస్మికంగా గెంతుతూ ఒకసారి శక్తిని గ్రహిస్తున్నాయి. మరొకసారి ప్రసరిస్తున్నాయి. ఇట్లు గెంతుతున్న ఎలక్ట్రానుగెంతుల స్టాటిస్టిక్సుని 1917లో ఐన్‌స్టైన్ పరిశీలించేరు. కొన్నిగెంతులు వేడిచేత, ప్రసారం చేత కలిగేయి. తీగనుండి వెలువడు ప్రసారాన్నంతటిని కలిగించడానికి గెంతులు చాలవు. ఇవికాక, మరికొన్ని విధాల ఎలక్ట్రానుల గెంతాలని ఐన్‌స్టైన్ నిర్ణయించేరు. రేడియోధార్మిక విచ్ఛిత్తి జరిగినట్లే ఈగెంతులుకూడా యాదృచ్ఛికంగా జరగాలన్నారు. ఈప్రక్రియలో నైతం విధిపోక్యం కలిగించుకోవలసినట్లుంది. విధివంటి ఒక భౌతిక సంఘటన జనిచేసినట్లంగీకరిస్తే, తీగనుండి వచ్చు కిరణ ప్రసార తీక్ష్ణత ఆసంఘటన యొక్క సామర్థ్యంపై ఆధారపడి యుండాలి. కాని, మనకు తెలిసినంత వరకు, కిరణ ప్రసారతీక్ష్ణత కొన్ని సిద్ధాంతాల మీదనే ఆధారపడింది. అవి ప్రకృతికి సంబంధించిన సిద్ధాంతాలు. వాటి విలువ భూమిమీద గాని దూరంగా నున్న నక్షత్రాలలో గాని ఒకటే. అందుచేత, ఈసందర్భంలో బాహ్యసంఘటనకు స్థానంలేదని చెప్పాలి.

ఎలక్ట్రానుల గెంతులను రేడియోధార్మిక పరమాణువుల విచ్ఛిత్తిని అర్థంచేసి కోడానికి మరొక ఉదాహరణ లభిస్తుంది. ఎలక్ట్రానులను పరమాణువులను నలుగురు పేకాట గాళ్ళతో పరిపోల్చవచ్చును. వారు పేకాటకు కూర్చున్నప్పుడే ఒక నియమాన్ని పాటించటాని కంగీకరిస్తారు. పంపకం జరుగుతుండగా, ఎవ్వరొకరి చేతులోనికి ఒకేరంగు 13 ముక్కలు వస్తాయో అప్పుడాట చాలించడాని కేర్పాటు. అట్టి సంఘాలు కోట్ల కొలది గల ఒక గదిని ఒకరాశి రేడియోధార్మిక పదార్థంతో పరిపోల్చవచ్చును. అప్పుడు, ఏనియమాన్ని బట్టి రేడియోధార్మిక పరమాణువులు విచ్ఛిన్నమౌతాయో అదే నియమాన్ని అనుసరించి పేకాట సంఘాలు కూడా విచ్ఛిన్నమౌతాయని చూపవచ్చును. అయితే, ఆటకు ఆటకు మధ్య పేకముక్కలను చిత్తుగా కలపాలి. ముక్కలను చిత్తుగా కలిపిన పక్షమందు కాలగమనంతోను భూతకాలంతోను ఆటగాళ్ళకెట్టి ప్రసక్తిలేదు. ఏమంటే, ముక్కలు కలిపినప్పుడల్లా క్రొత్త పరిస్థితి జనిస్తుంది. అందుచేత, రేడియం పరమాణువులలో వలె పేకాట సంఘాల విచ్ఛిత్తి రేటు కూడా స్థిరంగానుంటుంది. కాని, పేకముక్కలను కలపకుండా రెండవసారి పంచినట్లైతే మొదటి ఆటనుండి రెండవ ఆట అనుగమిస్తుంది: అప్పుడు కార్యకారణ వాదానికి తావుంది కాని, పేకాట సంఘాల విచ్ఛిత్తి రేటు రేడియోధార్మిక పరమాణువుల విచ్ఛిత్తి రేటుకి భిన్నంగానుంటుంది. ఈరెంటికి సామరస్య ముండాలంటే పేకముక్కలను ఆటల మధ్య చిత్తుగా కలపాలి; ఆవిధంగా కలిపే కర్తయే విధి.

అనుల్లంఘనీయమైన కార్యకారణ నియమాన్ని మరుగుపెట్టు ఏదో ఒక విషయం ప్రకృతిలో నున్నట్లు అనుమానించడానికవకాశముంది. దానినింతవరకు 'విధి' అన్నాం. దానిగురించి యథార్థమైన జ్ఞానంలేదు. ఇదివరకు మనంభావించినట్లు భవిష్యత్తు అనివార్యంగా భూతకాల సంఘటనలు నిర్ణయించకపోవచ్చును. కొంతవరకైనా అది భగవద్విలాసంమీద ఆధారపడి ఉండవచ్చును.

దీనినిబలపరచేవి మరికొన్ని దావాలున్నాయి. ఆధునిక క్వాంటం సిద్ధాంతంలో 'అనిర్దేశ్యతా సూత్రం' (Principle of indetermination) ఇమిడియున్నదని ప్రొఫెసర్ హైసన్ బర్గ్ సూచించేరు. ప్రకృతి కార్యకలాపం అతినిర్దిష్టమైనదని చాల కాలం భావించేం. మానవ కల్పిత యంత్రాలు అసమగ్రమైనవని, నికరమైనవి కావని తెలుసును. అయినప్పటికి, పరమాణు గర్భంలో వాటిల్లుతూన్న సంఘటనలు సమగ్రమైనవి నికరమైనవి కావచ్చునని ఆశించేము. కాని, సమగ్రతను ప్రకృతి ద్వేషిస్తుందన్నట్లు హైసన్ బర్గ్ చూపుతున్నాడు.

ఒకేక్షణంలో ఎలక్ట్రానుయొక్క స్థానాన్ని దానిగమన వేగాన్ని తెలిసికొంటే దాని అవస్థ పూర్తిగా నిర్ణయమైనట్లు సంప్రదాయ విజ్ఞానం భావించింది. పైవిషయాలతోపాటు ఎలక్ట్రానుపై ప్రవర్తించు బాహ్యబలాలను తెలిసికొన్నప్పుడు దాని భవిష్యత్ యావత్తు నిర్ణీతమైనట్లే. విశ్వంలోనున్న అన్నికణాలగురించి పైని వివరించిన విషయాలు తెలిసిన పక్షమందు విశ్వంయొక్క భవిష్యత్‌గురించి జోస్యం చెప్పడానికెట్టి కష్టంలేదు. అది సంప్రదాయ విజ్ఞాన దృష్టిలో.

హైసెన్‌బర్గ్ వివరించిన నవీన విజ్ఞాన ప్రకారం పైవిషయాల జ్ఞానాన్ని ఎప్పుడూ సంపాదించలేమని స్పష్టమౌతూంది. ఒక ఎలక్ట్రాను ఒకస్థానంలో నుందని నికరంగా తెలిసినప్పుడు ఆక్షణంలో దాని ఆకస్మిక వేగమెంతో తెలిసికొనే అవకాశంలేదు. స్థానం, వేగం : ఈ రెంటిలో ఒకటి నికరంగా తెలిసినప్పుడు రెండవదాని జ్ఞానంలో కొంచెమైనా దోషముంటుంది. ఆదోషాన్ని సవరించడానికి ప్రకృతి మనకు తోడ్పడలేదు. నికరమైన కొలతల గురించి ప్రకృతికి తెలిసినట్లులేదు. అట్లే, ఎలక్ట్రాను యొక్క వేగాన్ని నికరంగా తెలిసికొన్న క్షణంలో దాని స్థానాన్ని తెలిసికోవాలంటే ప్రకృతి ఒప్పుకోదు. దీనికొక ఉదాహరణ సహాయపడుతుంది. ఒక స్లైడుకి రెండు వైపుల ఒక బొమ్మయొక్క రెండుభాగాలు వ్రాసి, దానిని మాజిక్ లాంతరులోపెట్టి తెరమీద పెద్దబొమ్మను ఏర్పరుస్తున్నామనుకొందాం. అప్పుడు ఒక భాగం స్పష్టంగా పడితే రెండవది కొంచెం అస్పష్టమై అలికినట్లుంది. రెండవ భాగం స్పష్టంగానుంటే మొదటిది అస్పష్టమౌతుంది. రెండు భాగాల ఒకే అస్పష్టతతో కనిపించేట్లు లాంతరుయొక్క కన్నుని ఏర్పాటు చేయగలం; గాని, బొమ్మఅంతా పూర్తిగా స్పష్టంగా కనిపించదు. అదేవిధంగా ఎలక్ట్రానుయొక్క స్థానాన్ని గమనవేగాన్ని కూడ నికరంగా కనిపెట్టలేము. అసమగ్రమైన లాంతరులో బొమ్మను ఒకవిధంగా ఏర్పరచవచ్చును. సమగ్రమైన లాంతరైతే ఒకభాగం ఎంత స్పష్టమౌతూంటే రెండవదాని బొమ్మ అంత అస్పష్టమౌతూంటుంది.

అసమగ్రమైన లాంతరు సంప్రదాయ విజ్ఞానం. సమగ్రమైన లాంతరంటే ఎలక్ట్రాను యొక్క స్థానాన్ని, ఆదేక్షణంలో దాని ఆకస్మిక వేగాన్ని నికరంగా కనుగొనగలమను ఆభావ కలిగించింది.

ఈ అభాసమూలంగా విజ్ఞానంలోనికి నిర్ణాయకత (determinism) ప్రవేశించింది. నవీన విజ్ఞానం లో సమగ్రమైన లాంతరు దొరికింది. అందులో స్లైడును పెట్టిచూడగా రెండుభాగాలు రెండు విభిన్నమైన తలాలలో (Planes) నున్నాయని, రెండింటిని స్పష్టంగా ఒకేసారి ప్రదర్శించలేమని తెలిపింది. దానితో నిర్ణాయకత భావంయొక్క మూలాధారమే ఛేదింపబడింది.

ఇంకొక ఉదాహరణ. విశ్వమనే యంత్రం యొక్క జాయింట్లు వదులై పోయినట్లుంది. యంత్రంలో భాగాలు కొద్దిగా కదులుతున్నాయి ఆగిపోయిన ఇంజన్ లో భాగాలవలె వదులై చిన్న ఆట ప్రారంభించింది, అలాగని, విశ్వమే అసమగ్రమైపోయిందని, దాని భాగాలు అరిగిపోయేయని అనుకోరాదు. అరిగిపోయిన యంత్రంలో భాగాల "వదులుతనము" లేక "అరుగుదల" భాగ భాగానికి మారుతుంది; ఒక జాయింటు కంటె మరొక జాయింటు యెక్కువ అరిగిపోవచ్చు. విశ్వమను యంత్రంలో మాత్రం అట్లు కాదు. జాయింట్లన్నీ ఒకే విధంగా అరిగినట్లుంది. ఆ అరుగుదల సమంగానుంది. దానిని కొలిచేది ప్లాంక్ స్థిరాంకమైన 'h'. 'h' విలువను అనేక విధాల కొలవగలం. అది భూలోక పరిశోధనాగారాలలోను, నక్షత్రాలలోను కూడ ఒకే విలువ చూపిస్తూంది. కార్య కారణ నియమం సమగ్రమైన యంత్రానికే వర్తిస్తుంది. - ఏదో విధమైన అరుగుదల విశ్వమంతటిలోను గోచరిస్తున్నదను సత్యం నికరమైన హేతువాదానికి దెబ్బ తీస్తుంది.

హైసెన్ బర్గ్ సూచించిన అనిశ్చితతా భావం కొంత వరకు, ఆత్మగతమైనది. ఒక మనిషి తన బరువును కచ్చితంగా కనుగొనడానికై ఉపయోగించిన త్రాసులో వేయడానికి ఒకపౌను కంటె తక్కువ కట్టెలు లేకపోతే తన బరువును కచ్చితంగా కనుగొనలేడు. అదే విధంగా, ఒక ఎలక్ట్రానుయొక్క స్థానాన్ని వేగాన్ని కచ్చితంగా కనుగొనలేమంటే దానికి కారణం మన ముపయోగించు ఉపకరణాల అసమర్థత. విజ్ఞానానికి తెలిసిన సూక్ష్మతమమైన యూనిటు ఎలక్ట్రాను: అంత కంటె చిన్న ఖండంతో పనిచేయగల అవకాశంలేదు. అయితే ఈ చిక్కుకి ఎలక్ట్రానుయొక్క నియత పరిమాణంగాదు కారణం; యదార్థానికి ప్లాంక్ ప్రవేశ పెట్టిన అమూహ్యమైన యూనిటు h మాత్రమే. అవిచ్ఛిన్నంగా కాక గెంతులూ గమించు ప్రకృతి గమనంలో సూక్ష్మతమమైన గెంతుయొక్క పరిమాణాన్ని h సూచిస్తుంది. స్ప్రింగ్ త్రాసులో ముల్లు చిన్నగెంతులతో గమించు నప్పుడు మనిషియొక్క తూనికను కచ్చితంగా తెలిసికొనడానికెట్లు అవకాశంలేదో, అట్లే, ప్రకృతి గమనంయొక్క గెంతులు నియమిత పరిమాణం గలవైతే ప్రకృతిలో కొంతను నికరంగా కనుగొనలేము.

ఇదివరకు చర్చించిన రేడియో ధార్మికత కిరణ ప్రసారములతో ఆత్మగతమైన అనిశ్చితతకు సంబంధంలేదు. కాని, ఇక్కడ వివరించడానికి కూడా సాధ్యంకానన్ని దృగ్విషయాలున్నాయి. వాటిని క్రమబద్ధంగా సూత్రీకరించాలంటే ఎక్కడో ఏదో విధంగా అనిశ్చితత్వ భావాన్ని ప్రవేశపెట్టక తప్పదు.

వ్యక్తిగత ఎలక్ట్రానులు పరమాణువులు పాల్గొను సంఘటనలలో నిర్ణాయకతకు స్థానంలేదని కొందరు విజ్ఞానులు భావించడానికి పై అభిప్రాయాలవంటివి తోడ్పడ్డాయి. భూమ పరిమాణంలో జరుగు సంఘటనలలో గోచరించు నిర్ణాయకత వాటిలో పాల్గొను కణాలసగటు ప్రవర్తనంచేతనే ఆరోపింపబడిందను భావం ప్రబలింది. ఈ పరిస్థితిని డిరాక్ ఇట్లు వర్ణించేడు: ఒక ప్రత్యేకపరిస్థితిలో ఒకపరమాణుమండలంపై చేసిన పరిశీలనల ఫలితం నిర్ణాయకంగాదు. అంటే, అదే పరిస్థితులలో ఆప్రయోగాన్నే అనేక సార్లు చేస్తే వేరు వేరు ఫలితాలు రావచ్చును. ఆ ప్రయోగం చాలాసార్లుచేస్తే ప్రతి ఒక్కొక్క ఫలితం మొత్తం ప్రయోగాలలో నిశ్చితమైన భిన్నంగా వస్తుంది. కాబట్టి, ఆప్రయోగాన్ని ఎప్పుడు చేసినా ఆఫలితం రావడానికి నికరమైన ఒక సంభావ్యతగలదని చెప్పవచ్చును. సిద్ధాంతప్రకారం ఈ సంభావ్యత ఒకటి కావచ్చును. అప్పుడా ప్రయోగ ఫలితం నిర్ణాయకమౌతుంది.

అంటే, గుంపులు గుంపులుగానున్న ఎలక్ట్రానుల విషయంలోను, పరమాణువుల విషయంలోను వాటి సరాసరి ప్రవర్తనను పరిశీలించినప్పుడు గణిత సూత్రాలు నిశ్చితత్వాన్ని ప్రవేశ పెట్టుతాయి: కాని, భౌతిక సూత్రాలు అట్టి అవకాశాన్ని ఇయ్యలేదు.

భూమ ప్రపంచంలో ఒక సంఘటనను దీనికి ఉదాహరణగా పేర్కొనవచ్చును. ఒకరూపాయిని ఎగురవేసినప్పుడు బొమ్మపైకొస్తుందో బొరుసుపైకొస్తుందో చెప్పకొనడానికి మనజ్ఞానం చాలదు. కాని లక్ష టన్నుల రూపాయిలను ఎగురవేసినప్పుడు 50,000 టన్నులుబొమ్మలు, 50,000 టన్నులు బొరుసులుపై కొచ్చేటట్లు అవి పడుతాయనిమాత్రం ఎరుగుదుము. ఆ ప్రయోగాన్ని ఎన్ని మార్లుచేసినా అదే ఫలితం వస్తుంది. ప్రకృతియొక్క సమ గమనానికిదొక నిదర్శనంగా చూపి దీనిలో కార్య కారణ నియమం అంతర్భూతమైయుందని చెప్పడానికి ప్రయత్నించవచ్చును. యదార్థానికి విధియొక్క విలాసానికిమాత్రమే ఇదొక నిదర్శన మౌతుంది.

చిత్రలేఖనము

శ్రీమతి కె. ఎల్. దివ్యజ్ఞాన సరోజినీదేవి

'కళ' అను పదమును మనలో పెక్కురు నిత్యము వింటున్నను దానిని సర్వసామాన్యముగా చిత్రకళను నిర్దేశించటానికే వాడుదురు. కాని సంగీత, నృత్య, సాహిత్య, నాటకాదులన్నియు కళలే; ఈ భ్రమ కేవలము 'కళ' అను పదము నందేగాక 'చిత్ర కళ' అను పదమునందును తరుచూ సంభవించు చుండును. చిత్రకళన రూప చిత్రములు, కుడ్యచిత్తరువులు, శిల్పములు మాత్రమే కావు. చక్కటిపాత్రలు, ధూళి, పుష్పచిత్రములు, నేత, కడకు గృహాలంకరణ యివన్నియు 'చిత్రకళ'నే వ్యక్తపరచును. ఇవన్నియు మనకు హృదయానందము కలిగించి తన్మూలమున వాటియందుగల చిత్రకళను వెల్లడిచేయును. వీటిని ఆంగ్లమున 'అబ్‌స్ట్రాక్ట్ ఆర్టు' అందురు.

మృణ్మయ పాత్రలు అనాదినుండియున్నవే. మానవుడు మత, లిపి, సాహిత్యాది విషయముల గూర్చి తెలుసుకొనక పూర్వమే ఈ పాత్రలను సృష్టించెను. ఈ పాత్రలు మానవుని చిత్రకళా నైపుణ్యమునకు, యింద్రియ జ్ఞానమునకు, మృదుహృదయమునకు, శీఘ్రగ్రహణమునకు నిదర్శనములు. ప్రాచీన చిత్రకళలకు ఆటపట్టయిన గ్రీస్, చైనా, భారత దేశములందు ఈ మృణ్మయ పాత్రలందే ప్రప్రథమముగా చిత్రకళకు స్థానము లభించెను. ఈ పాత్రలను మొట్టమొదట మానవుడు గోమయముతో చేసి ఎండబెట్టెడివాడు. నిప్పు, కుమ్మరి చక్రము మొదలగునవి కనుగొనిన పిమ్మట ఇవి మట్టితో చేయబడి గట్టిగా నుండుటకై నిప్పులపై కాల్పబడసాగినవి. కానీ మృణ్మయ పాత్రలందు చిత్రకళ యెందు కలదను సందేహము కలుగుట సహజము. పాత్రలు తిరిగిన వంపులలోను, ఆకృతిలోను, వాటిపై చిత్రింపబడిన ఈ బొమ్మలలోను చిత్రకళ కలదు.

ఇట్టి చిత్రకళ కొన్ని లోహపు పాత్రలయందును కలదు. ధూళి, పుష్ప చిత్రములందును అత్యున్నత చిత్రకళ వ్యక్తపరచబడుచున్నది. అనేక వర్ణముల చూర్ణములతో వేసిన రంగవల్లులే ఈ ధూళిచిత్రములు; పుష్పాలంకరణములు పుష్పచిత్రములన బడుచున్నవి. దీనికే జపాను దేశములో ప్రత్యేకపాఠశాలలు గలవు. నేతకు చైనా, భారత, జపాను దేశములు ఎంత ప్రసిద్ధములో అందరికి తెలిసినదే.

కావున చిత్రకళ అనునది కేవలము చిత్ర శిల్పములందుండునదే కాదని మనము గ్రహింపవలసియున్నది. అనేక వస్తువులద్వారా ఈ చిత్రకళ మన నిత్యజీవితములో సదా తటస్థించుచుండును. కాని ఈ చిత్రకళనునది ఎట్టిది? దాని ముఖ్యాంశములేవి? ఎందుచేత ఒక వస్తువునందు చిత్రకళగలదని చెప్పబడుచున్నది- అను విషయమై ఆలోచించినవారు ఎంతో మంది లేరు. కాని ఈ ప్రశ్నలకి జవాబు తెలుసుకొనుట అత్యవసరము

చిత్రకళందు మూడుసోపానములు కలవు. ఇందు మొదటి సోపానము మన యింద్రియములకా వస్తువు, దాని ఆకృతి వర్ణములు గోచరించుట. మన యింద్రియములు ప్రపంచమందున్న సర్వవస్తువులపైననూ మక్కువ చూపించవు. వాటికి కొన్నింటిపైననే మక్కువ కలగవచ్చును. ఈ మక్కువ కేవలమూ ఆవస్తువుల ఆకృతులపైననేగాక, వాటి వర్ణములమీదను, అవి అమర్చబడిన విధానము మీదను ఆధారపడియుండును. మన యింద్రియముల కొక వస్తువు ఆకృతిపై మక్కువ కలిగినను, అది యితర వస్తువులతో అమర్చబడిన విధానము నచ్చకపోయిననూ, మనకా వస్తువుపై మక్కువ కలగజాలదు. కావున మన యింద్రియ జ్ఞానము చిత్రకళకు నాంది ప్రస్తావన చేయును. ద్వితీయ సోపానము: మన యింద్రియములకు ఈ విధముగా మక్కువ

కలిగిన వాటిని మనకు హృదయానందము కలిగించు ఆకృతులలోను, రీతులలోను చిత్రించుటే. తృతీయము భావచిత్రీకరణ. ఈ మొదటి రెండు స్థాయిలలో 'సుందర' మను పదము అంతమగును. దానికి మూడవ స్థాయిలో స్థానము లేదు. భావము సౌందర్యమునకు అతీతము. పలువురీ విషయము స్పష్టముగా తెలుసుకొనక పోవుటచేతనే అనేక భ్రమలకు అవకాశము కలుగుచున్నది.

ఇందు ప్రథమ సోపానమైన యింద్రియ జ్ఞానము గూర్చి యింతకన్నను చెప్పవలసిన దేమియులేదు. కాని రెండవదైన ఆకృతి గురించి ఎంతైనా కలదు. ప్రప్రథమముగా మనము 'ఆకృతి' అనగా నేమి? అవెన్ని రీతులు? ఏయే వస్తువులా ఆకృతిని కలుగచేయుటకు దోహదమిచ్చును? అని తెలుసుకొన వలసియున్నది. వస్తువు యొక్క పరిమాణ రూపములూ, అది చిత్రపటమునందు యితర వస్తువులతో అమర్చబడిన రీతియే 'ఆకృతి' యని సర్వసామాన్యముగా అనుచున్నప్పటికిని 'ఆకృతి' యనునది కేవలము మన సహజ జ్ఞానమువలననే తెలుసుకొనగలమనుట సరైన వ్యాఖ్యాన మనిపించుకోగలదు. ఆకృతులందు 'సాపేక్ష ఆకృతి' 'స్వతంత్ర ఆకృతి' అని రెండు విధములైన ఆకృతులు గలవు. 'సాపేక్ష ఆకృతి' ప్రకారము చిత్రకారుడు ప్రకృతిలోనున్న వస్తువు యొక్క భాగముల పాళ్ళను గ్రహించి ఆపాళ్ళ కనురూపముగా ఆ వస్తువులను తన చిత్రమునందు చిత్రించును. 'స్వతంత్రాకృతి' ప్రకారము చిత్రకారుడు స్వతంత్రించి ప్రకృతిలోనున్న వస్తువుకు అనురూపముగ గాక సాంకేతికముగా చిత్రించును. మానవుని యందు సదా వుండు ఇంద్రియ అంతర జ్ఞానములు, బాహ్యవస్తువులచే మానవునిలో ప్రేరేపింపబడి ఆలోచనా లోకమైన భావము ఈ 'ఆకృతి చిత్రీకరణకు దోహదమిచ్చుచున్నవి.

గ్రీకులు ఈ ఆకృతి సూత్రము నాధారము చేసుకొనే తమ చిత్రశిల్పములందు 'రేఖాగణితము'ను ప్రవేశపెట్టిరి. సరైన ఆకృతులు చిత్రమునందు ఏకస్వనము కలిగించును గావున అట్టి ఏకస్వనము కలిగించు ఆకృతులేవో వారు నిర్ణయించిరి. ఇదియే చిత్రరచనందలి 'రేఖాగణితము.' ఈ సూత్రములనేకముగా నున్నవి. వాటిలో నొక సూత్రమైన సమకోణ చతురస్రమునందు చదరముగా చిత్రించుట పాశ్చాత్య చిత్రము లందూ తరుచుగా గుపడుచునేయున్నది. కాని అందరు ఈ సూత్రములనే పాటించి ఒక రీతిన చిత్రించినచో, అది విసుగే కలిగించును. అందుచే కొందరు చిత్రకారులీ సూత్రములను వ్యతిరేకింతురు. ఇట్టి వ్యతిరేకమునందు అందము ఆనందమునూ కలవు. ఇట్టి వ్యతిరేకమెట్టి హద్దువరకు జరగవచ్చునన్నది మన జ్ఞానముచేతనే నిర్ణయింపబడుచున్నది. విరూపము యిట్టిదే. కేవలము 'రేఖాగణిత' సూత్రములను వ్యతిరేకించుటయేగాక, ప్రకృతి యందు వస్తువుల విభాగముల రూపములకు విరూపములు కూడా అనేక చిత్రకారులు చేయుచున్నారు. ఈ విరూపములు రెండువిధములుగా నుండును. (1) విరూపము కలుగచేసినను ఆ వస్తువు సహజముగా నున్నదని మనకు భ్రమ కలిగించుట, గ్రీకు శిల్పము లిట్టివే. (2) విరూపము కలుగచేయుటచే మొదటి దానివలె యిదీ హృదయానందము కలిగించినను ఆ వస్తువునందలి సహజత్వలోపము స్పష్టముగా కనబడుట. ఇందు మొదటి విరూపము కెవ్వరు ఎట్టి అభ్యంతరము చెప్పరు. రెండవ విరూపము గూర్చే పలువురు విమర్శించుటకు వెనుదీయరు. ఇందుకు చైనీయుల సింహము చక్కటి ఉదాహరణ. అది ఒక గొప్ప కళాఖండము. ప్రతి వంపులోను భావము తొంగిచూస్తూ యుంటుంది. కాని ప్రకృతిలోనున్న సింహము మనస్సులో మెదిలినప్పుడు అది సింహమేగాని గుఱ్ఱము కాదని ఎవరు అనగలరు! ఇట్టి విరూపము కేవల మంతరజ్ఞాన, భావముల చేతనే గాక, ఐహిక, పారమార్థిక విషయములచేతను ప్రేరేపింపబడు చున్నది. ఒక చిత్రపటమునందు

ఐహిక, పారమార్థిక చింతనలను చిహ్నరూపముగా చిత్రించుటకు ఆ చిత్రములందలి వస్తువుల రూపములు 'విరూపము' చేయుట తప్పనిసరి.

'ఆకృతి' గూర్చి సంపూర్ణముగా తెలుసుకొనవలయునన్న ఒక చిత్ర పటమునందుగల వస్తువుయొక్క గాని, వర్ణముల యొక్కగాని పరస్పర బాంధవ్యరీతి గూర్చి కూడ తెలుసుకొనవలసి యున్నది. ఇది 'సమభాగ రూపత్వము' 'విభాగ రూపత్వము' అను రెండు విధములుగా నుండును. ఇందు మొదటి విధానము ప్రకారము చిత్రమునందు ప్రతిమలనుకాని వర్ణములనుగాని సమానాంతరముగా చిత్రింతురు. రెండవ విధానము యిందుకు వ్యతిరిక్తము. దీని ప్రకారము చిత్రపటమునందు ప్రతిమలు, వర్ణములు సమానాంతరముగా కాక చిత్రపటము నందంతటను అచ్చటచ్చట పరచినట్లు చిత్రింతురు. ఈ విధానము వలన కూడ చిత్రమునందు చక్కటి సమత్వము కలుగును.

చిత్రపటమునందు వివిధవస్తువుల పరస్పర రీతులు, అవియూ చిత్రపటమునందు అమర్చబడిన విధానములు కూడా మిగుల ముఖ్యము. ఈ రీతుల ప్రకారము చిత్రములు 'అంతమగు చిత్రములు' 'అనంతమగు చిత్రములు' అని రెండు విధములుగా విభజింపవచ్చును. మొదటి పద్ధతి ప్రకారము చిత్రమునందు చిత్రింప దలచుకొన్న వస్తువులను సంపూర్తిగా చిత్రింపవలయును. రెండవ విధానము ప్రకారము చిత్రమునందు చిత్రింపదలచుకొన్న వస్తువులందలి కొన్నిటి భాగములను (కొన్ని మాత్రమే యనునది గమనించవలయును) సంపూర్తిగా కాక సగమో, ముప్పాతికో చిత్రింపవలయును. ఉదాహరణకు చిత్రకారుడొక కుటీరము, దాని ప్రక్కన సొంపుగా వంగియున్న ఓ వృక్షమును చిత్రింపదలచు కొన్నాడనుకొందము, అప్పుడాతడు ప్రథమ విధానము ననుసరించిన ఆ కుటీర వృక్షములు రెండింటిని సంపూర్ణముగా చిత్రించును. కాని రెండవ విధానమవలంబించిన ఆ కుటీర వృక్షములలో నేదో నొకదానిని మాత్రము సంపూర్ణముగా చిత్రించి, రెండవదానిని సగము మాత్రమో, లేక పాతిక భాగము మాత్రమో చిత్రించును.

చిత్రరచనందు రేఖలకును ఒక ముఖ్యస్థానము కలదు. అనాదినుండి, అనగా మొట్టమొదట గుహలందు నివసించుచున్న మానవుడు చిత్రించుట మొదలిడిన నాటినుండి, ఈ రేఖాచిత్రములు వాడుకలోనున్నవి. ఇదే ఆకృతి చిత్రీకరణలో ప్రధాన సిద్ధాంతము. అందుచేతనే బాలబాలికలు ప్రప్రథమముగా బొమ్మలు గీయునప్పుడు ఈ విధానమునే అవలంబింతురు. ఈ రేఖల మందమును హెచ్చించుట, తగ్గించుటవలననూ, దృఢముగానో; తేలికగానో గీయుటవలననూ, చిత్రకారుడు చిత్రమునందు వస్తువునకు రూపము, ప్రమాణము, ఘనపరిమాణమేగాక, ఆ చిత్రమునందు ఆ వస్తువునకు గల విలువ, భావము మొదలగునవి కూడా వ్యక్తపరచగలడు. జపాను, చైనా చిత్రకారులును, మన దేశచిత్రకారులును ఈ నాటికిని ఈ విధానమునే అవలంబించుచున్నారు.

ఈ రేఖా చిత్రములను పాశ్చాత్యులు కూడా శ్లాఘించియున్నారు. 'పికాసో' వంటి ఆధునిక చిత్రకారులు సైతము రేఖాచిత్రములందు నిపుణత్వము సాధించిన పిదపనే ఆధునిక చిత్రములు మొదలిడిరి.

కేవలమీ రేఖలమందమును హెచ్చించుట తగ్గించుటవలన చిత్రకారుడు కొంతవరకు చిత్రపటము నందలి వస్తువుయొక్క వెలుగునీడలను చిత్రింపగలిగినప్పటికి, నల్లని వర్ణముతోగాని, వేరు వర్ణముతోగాని చూపినంత స్పష్టముగా చూపలేడు. వెలుగునీడలను చూపు ఈ విధానము పాశ్చాత్యదేశములలో నెక్కువగానున్నది. తూర్పుదేశములందును ఈ పద్ధతి అవలంబించబడినప్పటికీ, అది అతి మితముగా ననుసరించిరి.

వెలుగు నీడలను చూపు ఈ విధానము 'స్వయం వెలుగునీడలు'. 'బాహ్యవెలుగునీడలు' 'మధ్యస్థ వెలుగునీడలు' అని మూడు విధములుగా నున్నది. (1)వస్తువుపై బాహ్యవెలుగు నీడల ప్రతిబింబనలను గైకొనక కేవలము ఆ వస్తువుయొక్క వెలుగునీడలనే చిత్రించుటను 'స్వయం వెలుగునీడల చిత్రీకరణ' అని యందురు. ఉదాహరణకు వారొక మృణ్మయ పాత్రను చిత్రించుచున్నయెడల ఈ వెలుగు నీడలను కేవలమా కుండయొక్క గుండ్రని తనమును చూపుటకే వాడుదురుగాని, ఆ పాత్ర ఎండలో వున్నదా, నీడలో వున్నదాయని చూపుటకు వాడరు. మనదేశ చిత్రములందు. అందును ముఖ్యముగా అజంతా చిత్రములందు ఈ విధానమే అవలంబింపబడియున్నది. (2) 'బాహ్యవెలుగునీడల చిత్రీకరణ' అనగా ఆ వస్తువుపై సూర్యరశ్మి. చీకటి మొదలగువాటి ప్రతిబింబనలను చిత్రీకరించుటయే. ఈ పద్ధతిని పాశ్చాత్యులెక్కువగా అవలంబించిరి (3) మూడవ విధానమైన 'మధ్యస్థవెలుగునీడల చిత్రీకరణ' ప్రకారము. చిత్రింపదలచిన ఒక వస్తువును కాంతివంతముగా చేయుటకుగాని, కాంతివిహీనముగా చేయుటకుగాని ఆ వస్తువు యొక్క ప:సరములు చిత్రించునప్పుడు అందులకు సరిపడు వర్ణములను వాడవలయును. ఉదాహరణకు మనమొక బంగారు పాత్రను చిత్రించుచున్నామనుకొందము. ఆ బంగారు పాత్రకు పసిమిరంగు వేయుదుముగదా! అట్టి సమయమున ఆ పాత్రకు వెనుకవైపు అదే పసిడివర్ణముగాని, కన్నులు మిరుమిట్లుగొలుపు మరి యే వర్ణముగాని వేసిన ఆ బంగారు గిన్నె రాణించదు. అదే ఆ గిన్నెకు వెనుక వైపున బూడిదరంగువంటి యే మధ్యస్థరంగో వేసిన వెంటనే ఆబంగారు గిన్నె మిలమిల మెరయుచున్నట్లు కనపడును.

రేఖలద్వారానూ. వెలుగునీడల చిత్రీకరణ ద్వారానూ చిత్రపటమునందలి వస్తువుకు ఆకృతి రాగలిగిననూ, వర్ణములు వాడుట ఆ ప్రతిమ యొక్క ఆకృతిని మరింత స్పష్టము చేయును. ఈ వర్ణములు 'సహజ వర్ణములు' 'దూత వర్ణములు' 'ఏక స్వన వర్ణములు' 'స్వచ్ఛ వర్ణములు' అనినాలుగు, విధములుగా నున్నవి. ఇందు 'సహజ వర్ణము చిత్రీకరణ' అనగా చిత్రమునందలి వస్తువులకు వాటికి ప్రకృతిలో సహజముగా నుండే వర్ణములనే వేయుట. ఈ విధానము ఎక్కువుగా వాడుకలో లేదు. గుహలందు నివసించుచున్న మానవుడు ప్రప్రథమముగా చిత్రకళ ప్రారంభించినప్పుడు సైతము ఈ విధానమును వాడలేదు. పాశ్చాత్య చిత్రకారులు కొందరు మాత్రము 'స్టిల్ లైఫ్' చిత్రములు చిత్రించునప్పుడు ఈ విధానమునే వాడుచున్నారు. కానిఇది ఎక్కువగా వాడుకలో నుండక పోవుటకు కారణము, మనకు ప్రకృతియందలి వర్ణములు సహజముగా వున్నప్పటికి అవి ప్రకృతి సహజముగా లేవని భ్రమ కలుగుటయే. ఇందు వలననే రెండవ విధానమైన 'దూత వర్ణములు' ఎక్కువవాడుకలో నున్నవి. ఈ పద్ధతినే మానవుడు ప్రప్రథమముగా తన చిత్రకళందు అవలంబించెను. ఈ పద్ధతినే యిప్పటికిని బాలబాలికలు తమ చిత్రములందు అవలంబింతురు. ఈ విధానము ప్రకారము వర్ణములు సాంకేతికముగా వాడబడును. ఈ పద్ధతినవలంబించు చిత్రకారులు సదా ఆకాశము నీలివర్ణముగాను, కొండలు వూదా వర్ణముగాను, చెట్లు పచ్చగానూ చిత్రింతురు. కాని ప్రకృతిలో ఆకాశము బూడిద రంగుగను, చెట్లు వివిధవర్ణములుగను, కొండలు ముదురు గోధుమరంగుగను వుండవచ్చును. అందుచేతనే యివి దూత వర్ణములన బడుచున్నవి. ముక్కోణాకారముగా నున్న వస్తువుకు వూదారంగు పూసిన వెంటనే, ఆవర్ణము అది పర్వతమని మనకు చాటి చెప్పుచున్నది. కాని ఈ పద్ధతి యిప్పటి చిత్రకారులు అవలంబించుటలేదు. క్రీ. శ 15వ శతాబ్దములో ఈ పద్ధతి చాలావరకు అంతమైనది. ఇప్పుడెక్కువ వాడుకలో నున్న పద్ధతులు ఏకస్వన వర్ణముల పద్ధతి, స్వచ్ఛవర్ణముల పద్ధతులే. ఇందు ఏకస్వన వర్ణముల పద్ధతి ప్రకారము చిత్రకారుడు

చిత్రము నందలి వస్తువులకు ప్రకృతిలో నుండు వర్ణములను పూర్తిగా విస్మరించి, వాటి కేవర్ణములు వేసిన ఆచిత్రమునకంతయు ఏకస్వనము లభించునో తెలుసుకొని ఆ వర్ణములనే వేయును. 'స్వచ్ఛవర్ణముల' పద్ధతి ఆధునిక చిత్రకళతో వచ్చినది దీని ప్రకారము చిత్రకారుడు చిత్రమునందలి వస్తువుల ప్రమేయములేకుండ తనకు నచ్చిన స్వచ్ఛమైన వర్ణములను తీసుకొని, వాటితో ఆచిత్రపటమునందు ఒక రంగుల మాదిరిని చిత్రించును. అందుచేతనే ఆధునిక చిత్రములలోని వస్తువు సామాన్యముగా స్పష్టముగా మనకు గోచరింపదు. ఇట్టి చిత్రములందు వర్ణములకే ప్రధాన పాత్ర కలదు.

ఈ విధముగా చిత్రమునందు 'ఆకృతి' యనునది ముఖ్యాంశమైనను, భావ రహితమైన ఆకృతి చిత్రకళనిపించుకోలేదు. ఏదో ఒక ఆకారమును గీసినంతనే అది చిత్రమవదు. అందు రూపత్వ సమత్వములే గాక భావము కూడా వుండి తీరవలయును. గృహ నిర్మాణ చిత్రములందు కూడా ఆకృతులు గలవు. కాని అందులో భావ మెచ్చటగలదు? అందుచేతనే వాటియందు చిత్రకళకలదని ఎవ్వరు అనరు. ఈభావమనగా నేమో వివరముగా పాశ్చాత్యులకైనా చెప్పవలయునేమో గాని మనవారికది కొట్టిన పిండే! భావమును చిత్రించుటకుఆకృతి యొకమార్గమే కానిఅంత మాత్రముచే భావము కేవల మాకృతిలోనే యిమిడియున్నదనుటకు వీలులేదు. కొన్ని వర్ణములు ఆనందము, కొన్ని మనస్తాపము, కొన్ని మనశ్శాంతి, మరికొన్ని ఉత్తేజము, రోషము కలుగజేయును. నీలము శబ్దగ్రహణ శక్తిని, ఎఱుపు యింద్రియగ్రహణ శక్తిని, తెలుపు శీలసంపత్తిని, కపిల వర్ణము ఆనందమును మానవునిలో కలుగచేయునని అధర్వణ వేదము చెప్పుచున్నది. ఆవిధముగా చిత్రకారుడు వర్ణముల ద్వారా కూడ తన భావములను చిత్రీకరించగలడు. కానిచ్చట ఒక విషయము గమనించదగినది. కేవలమొక రంగు ద్వారానే ఏభావము చూపించలేరు. అది మరి కొన్ని వర్ణములతో కలసియున్నప్పుడే దాని కర్థము కలుగును.

పైన చెప్పబడినవన్నియు చిత్రకళందలి ముఖ్యాంశములే. అయినప్పటికి వీటిని మేళవించి చిత్రమునకు పరిపూర్ణత తేగల అంశ మొకటి యున్నది. ఏ చిత్రపటమునందైనను ఈ వివిధమూలపదార్థములకు అవ్యయవాను సంబంధము కలుగ చేయనియెడల ఆ చిత్రము పరిపూర్ణత పొందలేదనియే యిప్పటికి చిత్రకారులు దృఢముగా నమ్ముచున్నారు. చిత్రరచనందు యిట్టి విశిష్టస్థానము పొందినది చిత్రకారుని 'వ్యక్తిత్వమే.' చిత్రమునందు వుండవలసిన లక్షణములన్నీ యున్నను, అందు చిత్రకారుని వ్యక్తిత్వము ప్రతిబింబింపనియెడల ఆచిత్రము రాణింపదు. బౌద్ధ, గోల్ల చిత్రకళనాటికి చిత్రరచనందు ఈ అంశము లేదని అభిప్రాయపడుచున్నారు. కాని ఈ వ్యక్తిత్వము యొక్క ప్రాముఖ్యత 'రెనైసాన్స్' కాలమునుండి రానురాను పెరుగుచున్నది. ఇచ్చటొక విషయము చెప్పవలసియున్నది. ఈ వ్యాసమందు చిత్రకళందలి ముఖ్యాంశములను పేర్కొనునప్పుడు తరుచు చిత్రపటములనే ఉదహరణలుగా పేర్కొని యున్నాను. ఇందులకు కారణము, నేను 'చిత్రకళ'అనిన కేవలము చిత్రపటములే అను భ్రమలో పడుటయూగాదు, యితర చిత్రకళలందు ఈ అంశములు లోపించుటయూగాదు. చిత్రపటములందు ఈ అంశములను వివరించుట సులభతరమగుటయే దీనికి కారణము. ఇతర చిత్రకళలందీవిధముగా వివరించుటయు కష్టమే. వివరించినను చిత్రకళందు ప్రవేశము లేని వారికి దానిని గ్రహించుటయూ కష్టమే. కావున ఈ అంశములు కేవలము చిత్రపటము లందే గాక అన్ని చిత్రకళలందును వున్నవని గ్రహింపవలయును.

'చిత్రకళ'ను గూర్చి ఈవ్యాసము ముగించులోపల మరియొక్క విషయము చెప్పక తప్పదు.

'కళ' అను దానిని గాని 'చిత్రకళ' అను దానిని గాని ఎంత ప్రయత్నించినను మాటలలో వివరించి చెప్పలేము. ఒక వేళ చెప్ప ప్రయత్నించిననూ ఎంతవరకు సఫలీకృతులము కాగలమనునది ప్రశ్నే. మన అంతర్జ్ఞానము చేతనే ఈ విషయము గూర్చి యింకను స్పష్టముగా తెలుసుకొనగలము. ఒకచక్కటి చిత్తరువును చూసిన తక్షణమే 'ఆహా ఏమి కళాఖండ' మనుకొందుము. కాని వెంటనే ఎవరైనా 'ఎందుచేత' అని ప్రశ్నించిన యెడల ఎంత కళాకారులైన కొన్ని నిముషములు ఆలోచించి, తమ మనస్సులందు వాటిపై తర్జనభర్జనలు గావించుకొని గాని సమాధానము లీయలేరు. అదే విధముగా చిత్రకారుడు చిత్రమును చిత్రించునప్పుడు అందులో ముఖ్యాంశములన్ని వున్నవా ఏవైనజారిపోలేదుకదాఅని శోధించి ఆలోచించి చిత్రించడు; అతను తన అంతర్జ్ఞాన ఆజ్ఞలనే పాలించును. అదే కళాపుంజము. ఆ చిత్తరువునందు చిత్రకారుని ఆలోచనా ప్రమేయము లేకుండగనే చిత్రరచనందలి ముఖ్యాంశములు కలిగియుండును. అది యెట్లు సంభవమన్న ప్రశ్నకు మనము ఆలోచనా శక్తితో జవాబీయలేము. దానికి సమాధానము మన అంతర జ్ఞానముకే తెలియును. ఏ భాషలోని మాటలు ఆ విషయమును గూర్చి అంతకన్నను విపులముగా చెప్పలేవు. కావున పై చెప్పిన చిత్రకళాంశము లన్నియు కేవలము మాటలలో చెప్పగలిగినవే. అట్లు వ్యక్తపరచలేని అంశములు చిత్రకళలో ఎన్నోకలవు. అట్టివాటిని ఎవరికి వారు తమ అంతర జ్ఞానమువలననే తెలుసుకొన వలసియున్నది.

ఈ విధముగా చిత్రకళ ఒక మహార్ణవము వంటిది. అందు ప్రవేశించిన వస్తుసముదాయమునకు అంతులేదు. అందు చొచ్చుకొనిపోయిన వారికి తుదియనునది యింతవరకు కానరాలేదు, యికముందు కానరాబోదు.

మనవి

రచయితలు, చిత్రకారులు, తమతమ రచనలను చిత్రములను ప్రతినెల 10 వ తేదీ లోపుగా కార్యాలయమునకు చేరునట్లు పంపవలెను.
ప్రచురించని రచనలు, చిత్రాలు త్రిప్పిపంపగోరువారు, వారిరచనలతో, చిత్రాలతో కావలసిన తపాలా బిళ్ళలు పంపవలెను.

సంపాదకులు : నవభారతి
విజయవాడ-2

మతము - రాజకీయములు

మహాత్మ గాంధీ

I

"నేను రాజకీయాలలో పాల్గొంటున్నట్లు కనుపిస్తున్నాను అంటే - అందుకు కారణం ఈ నాటి రాజకీయాలతో మనం పెనవేసుకుని ఉండడమే. ఒక పాము మనలను చుట్ట చుట్టుకుంటే ఎంత ప్రయత్నించినా దానిని ఎలావిడిపించుకోలేమో అలాగే ఈరాజకీయాల నుండి మనం విడిపడలేకుండా ఉన్నాం. నేనీ పాముతో యుద్ధం చెయ్యాలనుకుంటున్నాను- రాజకీయాలలో మతం ప్రవేశపెట్టాలని ప్రయత్నిస్తున్నాను" - అన్నాడు గాంధీ మహాత్ముడు. దక్షిణాఫ్రికాలో భారతీయులు సాగించిన పోరాటంకూడా ఆయన దృష్టిలో 'మతవిషయకమైన స్వేచ్ఛకోసం కొనసాగిన పోరాటమే.' "మతంఅంటే నా ఉద్దేశ్యం, వాడుకలోఉన్న లేక వ్యవహారంలో ఉన్న మతం కానేకాదు. నేను చెప్పేమతం అన్ని మతాలకూ మూలమైనది; మనందరినీ ఒకచోటికి చేర్చేదీ, మన సృష్టికర్తను ముఖాముఖి దర్శింప చేసేదీను." - ఒకనొక భారతీయుల సభలో మాట్లాడుతూ ఈ మాట అన్నాడు మహాత్ముడు.

ఆతరువాత అనేక సంవత్సరాలకు ఆయన దక్షిణ భారతంలో ఒకచోట ప్రసంగిస్తూ- "నాజీవితం యావత్తూ మతశక్తితో పూర్ణంగా నిండి-నిబిడీకృతమైపోయింది. మతం లేకుండా నేనొక్కక్షణం జీవించలేను. రాజకీయాలకు చెందిన నా మిత్రులు అనేకులు నన్ను గురించి నిరాశ చెందుతారు. కారణం, నా రాజకీయాలుకూడా నా మతంనుండే జనించాయని అంటారు వారు. వారన్నది నిజమే. నా రాజకీయాలూ, ఇంకా నాఇతరకార్యకలాపాలూ - అన్నికూడా నామతంనుండే ఆవిర్భవించాయి. అంతేకాదు. నేనింకాఒకమాట చెప్తాను - మతం కల మానవుడి ప్రతికార్యకలాపమూకూడా అతని మతంనుండే పుట్టితీరాలి, కారణం - మతంఅంటే ఈశ్వరుడికి కట్టుబడియుండడం. అంటే - మన ఉచ్ఛ్వాస నిశ్వాసాలు సయితం భగవంతుని అధీనంలో ఉన్నాయన్నమాట. మీరీ సత్యాన్ని గుర్తించినట్లయితే - మీరుకావించే ప్రతికార్యమూకూడా భగవంతుడు క్రమబద్ధం చేస్తాడు" — అని ప్రవచించాడు.

జీవితంలో మూలాధారమైన ఐక్యత విషయంలో మహాత్ముడికి గట్టి నమ్మకం ఉన్నది. 1926 లో మిస్టర్. హొరేస్ అలెగ్జాండర్‌కు ఆయన ఇలా వ్రాశాడు:

"మతవిషయంలోనేమీ; తక్కిన విషయాల్లోనేమీ - సూదిపట్టే సందుకూడా లేకుండా గట్టిగా గదులు కట్టుకుని, మన జీవితాలను వేరు చేసుకోవలసిన అవసరం ఎంతమాత్రం లేదని నా ఉద్దేశ్యం. మనలో నిజమైనమతం ఉన్నట్లు ఎందుకావని? మనసంఘంలాంటి సంఘంలో పారిశుద్ధ్యం అనేది - సాముదాయికమైన ఆధ్యాత్మికకృషి పైననే ఆధారపడియున్నది. మనరాజకీయ, సాంఘిక జీవితాలలో నేమీ, శుచిగా ఉండడంలో నేమీ - ఏచిన్నమెత్తు అక్రమం అగుపించినా సరే - అది మన ఆధ్యాత్మిక దారిద్ర్యానికి గుర్తు అని నా అభిప్రాయం."-

2

కాంగ్రెసులోపలా బయటాకూడా అనేకులు గాంధీజీని విమర్శిస్తూవచ్చారు. కాంగ్రెసు రాజకీయాలలో మహాత్ముడు మతాన్ని ప్రవేశపెట్టడం వారికి నచ్చలేదు. ఆయన అచ్చంరాజకీయవేత్తగా ఉండాలని వారి అభిలాష. అందువల్ల ఆయనపై కోపంతెచ్చుకున్నారు. ఆయన ఒక మతోన్మాది అనీ - రాజకీయాలలో త్రోవతప్పి నడుస్తుంటాడనీ, తత్ఫలితంగా తనకుతానే హీనదశకు పోతుంటాడనీ మరికొందరు ఆయనను దూషించారుకూడా. ఇలా దూషించిన వారిలో నిజమైన క్రైస్తవమిత్రులుకూడా కాం

దరున్నారు. తాముచెప్పేది సమర్థించుకోవడానికి వారు - "సీజరు వస్తువులు సీజరుకూ, దేవుని వస్తువులు దేవునకూ అప్పగించుః"- అన్న జీసస్ సూక్తిని వల్లిస్తూ వచ్చారు.

ఒకపాశ్చాత్యరచయిత, క్రైస్తవుడు - ఇలా వ్యాఖ్యానిస్తున్నాడు. "నిగూఢమైన పలుకులన్నీ కూడా పలుముఖాలుగా ఉంటాయి. పలురకాలయిన మనస్సులకు అవి పలువిధాలుగా గోచరమవుతాయి."- క్రైస్తవుడుకాని అల్పుడైన మానవుడు - జీసస్ ప్రవచనాలకు తన ఇష్టంవచ్చిన వ్యాఖ్యానం చెప్పడం - వాటిని అపవిత్రంచేయడమే అవుతుంది. ఈ మాటలు చూస్తే మానవులను రాజ్యాంగంపైనవాలు చెయ్యమని చెపుతున్నట్లుతోస్తుంది. తన అన్యాయమైన ఉత్తర్వులను ఉల్లంఘించి - అవిధేయత చూపినందుకుగాను పరిహారంగా రాజ్యాంగం మానవుల సొత్తునూ ఆస్తిపాస్తులనూ కైవసం చేసుకోవాలనుకున్నప్పుడు - మానవులు వాటిని ఇవ్వకుండా నిరాకరించవలసిఉంటుంది. కారణం ఏమంటే - ఆత్మ అనేది ఒక దివ్య జ్యోతి. అది ఈశ్వరునిసొత్తు. కనుక అది ఈశ్వరునకే వశవర్తియై యుంటుంది, జీసస్ వలె - మనలో ప్రతి ఒక్కరమూ భగవంతుని నుండి వచ్చినవారమే. ఆయనవలన పంపబడిన వారమే - కనుక ఇక్కడ - "మనం మనఇష్టప్రకారం చేయవీలులేదు. ఎవరైతే మనలను పంపారో ఆ ఈశ్వర సంకల్పం ప్రకారమే మనం నడచుకోవాలి."

ఈ సూక్తులను ఈ అర్థంలోనే తీసుకున్నప్పటికీ - రోమను పరిపాలకులకు వ్యతిరేకంగా రాజకీయవిప్లవం లేకెత్తించడానికి కానీ, పన్నులనిరాకరణోద్యమం ప్రారంభించడానికి కానీ జీసస్ ప్రభువు అయిష్టతనే చూపినట్లు కనుపిస్తుంది. ప్రభుత్వానికి న్యాయంగా ఎక్కడకాకీ చెల్లించవలసియున్నదో - అక్కడల్లా అది చెల్లించవలసిందేనని ఆయన మానవులను కోరినట్లు తెలుస్తుంది. అంతేకాదు. రాజకీయాలకు వ్యతిరేకంగా ఆయన ఇచ్చిన ఆజ్ఞ అన్నికాలాలకూ అన్ని దేశాలకూ ఉద్దేశింపబడింది కానే కాదు. భారతదేశంలోకూడా గొప్పగొప్ప మతప్రవక్తలున్నారు. ఉదాహరణకు రామకృష్ణుడూ, వివేకానందుడూ — వీరివిషయమే చూడండి - వీరు తమ దృక్పథంప్రకారం తమ శిష్య కోటికి - వహేతుకమైన, తాము విశ్వసించిన ప్రబోధములు చేశారు. మానవసేవ చెయ్యమని చెప్పారు కాని రాజకీయాలలో ప్రవేశించమని చెప్పలేదు. అయినప్పటికీ విన్సెంట్ షీన్ అనే ఆయన ఇటీవల ఒకమాటఅన్నాడు. "రామకృష్ణ, వివేకానందుల ఉద్యమం ...అది రాజకీయోద్యమం కాకపోయినప్పటికీ...దానికి సంబంధించిన కార్యక్రమంలో చేరని రాజకీయ ప్రయోజనాలు అనేకం అందులో ఇమిడి ఉన్నాయి. వారు భారతదేశాన్ని సంస్కరించమనీ, బాగుచేయమనీ, పునరుద్ధరించమనీ సందేశం ఒసగారు. మానవ ప్రయత్నంలో సాధ్యమైన ప్రతి సహాయం దేశానికి చెయ్యమన్నారు, నవీన భారతం నిర్మించ బూనుకున్న వారందరిలోనూ ముఖ్యంగా వివేకానందుని సందేశాలు ఎంతో వర్గరహితంగానూ, పవిత్రంగానూ, దేశభక్తి ప్రపూరితంగానూ ఉన్నాయి."

ఈ విధంగా రాజకీయ కార్యకలాపాలకు దూరంగా ఉండగలంగాని-ఒకానొక గొప్ప పవిత్రాశయంతో ప్రారంభించబడిన మత, సాంఘిక కార్యం యొక్క రాజకీయ ప్రయోజనాలను మాత్రం కాదనలేము. అది ప్రజల మధ్య సహకారాన్నీ, ఏకత్వాన్నీ సాధిస్తుంది. వారి సంఘశక్తికి దోహదం ఇస్తుంది. గాంధీజీ అన్నట్లుగా-"సాంఘిక ఆర్థిక, రాజకీయ పర్యవసానాలు లేకుండా ప్రపంచంలో నిజమైన మతోద్యమం ఏదీకూడాలేదు-"

అంతేకాక-జీసస్ కేవలం ఒక్క మత విషయంలోనే పనిచేశాడు కాని-జీవితంలో తక్కిన ముఖాలను వేటినీ దర్శించకుండా వదలివేశాడనటం సరికాదు. ఒక క్రైస్తవ రచయిత చెప్పినట్లుగా-"క్రీస్తు, మానవుని నూతన ప్రపంచానికి ప్రారంభకుడూ, కేంద్రమూకూడా-"

హెచ్. జి. వెల్సు-ఇలాచెప్పాడు:"ప్రపంచాన్ని పూర్తిగా మార్చాలని జీసస్ నిశ్చయం. ఆ నిశ్చయంతోనే ఆయన సుస్థిరంగా ఉన్న అలవాట్లపైనా, సంస్థలపైనా ధ్వజమెత్తాడు. జీసస్ బోధించిన స్వర్గరాజ్యం అనే సిద్ధాంతం-పరిశీలించిచూస్తే - అనుక్షణం ఘర్షణ పడుతున్న మానవజాతి-సంపూర్ణంగా మారడానికీ అంతరంగికంగానూ బాహ్యంగానూ కూడా పరిశుద్ధం కావడానికీ ఆయనవేరే సమాధానపడడం అనేదే లేకుండా గట్టిగా కోరాడని స్పష్టమవుతుంది. జీవితంలోని అన్ని కోణాలనూ దర్శించడమే దీని అర్థం."

"జీసస్ ప్రకటించింది కేవలం ఒక నైతిక, సాంఘిక, విప్లవంకాదు. ఆయన ఉపదేశాలను పరిశీలిస్తే-వాటిలో ఒక స్పష్టమైన రాజకీయాభిరుచియున్నట్లు అనేక ఆనవాళ్ళ ద్వారా మనం చూడగలుగుతాం. నా రాజ్యం ఈ ప్రపంచానికి చెందినదికాదు-అని ఆయన అన్నమాట సత్యమే. ఆయన రాజ్యం సింహాసనంపైన లేదు. మానవుల హృదయాలలో ఉన్నది: అయితే మరొక విషయం విస్పష్టం. ఏపరిధిలో ఆయన రాజ్యం మానవ హృదయాలలో నెలకొంటుందో, సమానంగా ఆ పరిధిలోనే ఈ బాహ్య ప్రపంచం మార్పుచెంది నూతనత్వం తాలుస్తుంది-"

3

గాంధీజీ జీవితం, ఆలోచనా కూడా విశేష పరిస్థితుల తాకిడివల్ల రూపు దిద్దుకున్నాయి. ఆయన దృక్పథమూ, తన పనికోసం ఆయన గీచుకున్నగీటూ- వీటి ప్రభావంతోనే ఆయన జీవితమూ, ఆలోచనా ఏర్పడినాయి. ఆయన ప్రజాజీవితం దక్షిణాఫ్రికాలో ప్రారంభమైంది. అక్కడి సంఘటనలు- ఆయనకు గల మానవశక్తిపైన, తనదేశస్థులూ తోటిమానవులూఅయిన వారిపట్ల ఆయనకుగల ప్రేమపైన, ఆయనకు గల న్యాయ విచక్షణాజ్ఞానంపైన, మత దృష్టిపైనసవాలుచేశాయి. రాజకీయాలు అపవిత్రంగా ఉన్నాయా అంటే అందుకు కొంతకారణం మతాసక్తికలమానవులు, అనగా, దైవభీతి, సత్యముకలగిన, స్వార్థంలేని మానవులు-సాధారణంగా రాజకీయాలకు దూరంగా ఉంటారు. దీనినిబట్టే-తాము రాజకీయ వ్యవహారాలలో పాల్గొని, లోపలనుండి వాటిని పరిశుద్ధం చెయ్యాలని వారు వాంఛిస్తున్నట్లు స్పష్టం. గాంధీజీకి రాజకీయగురువు గోపాలకృష్ణగోఖ్లే. అలాంటి గురువుకు మహర్షి.గొప్ప దేశభక్తుడూ. అయిన గాంధీజీ శిష్యుడుగా దొరికాడు. గోఖ్లే-ఎన్నో ఏండ్లక్రితం-1909లో గాంధీజీని గురించి తన ఉద్దేశ్యం ఈవిధంగా వ్యక్తంచేశాడు. "ఇంతకంటె అతిపవిత్రమైన, ఘనమైన, మహోన్నతమైన ఆత్మ ఈ పృథ్వీమీద మెదల లేదని నేను మీకుచెప్పగలను...... ఆయనను మనం మానవులలో మానవునిగా, నాయకులలో నాయకునిగా, దేశభక్తులలో దేశభక్తునిగా వర్ణించవచ్చు. ఈ యుగంలోని భారత జాతి యావత్తు ఆయనలో మూర్తీభవించి, ఉన్నత శిఖరాగ్రాలను అందుకున్నది"—

ఈ మతశక్తి ఆయనను ఎక్కడికి నడిపించింది? ఏకార్యానికి పురికొల్పింది?

"ఆయనలోని మహాత్మ సర్వసమన్వితం." అని పేర్కొన్నాడు హెన్రీపోలక్. పోలక్, దక్షిణాఫ్రికాలో తొలిరోజులలో ఆయనతోకలిసి పనిచేసినవాడు. అతనింకా ఇలాఅన్నాడు : "మహమ్మదీయుడినుండి హిందువునూ, క్రీస్తును నమ్మనివానినుండి క్రైస్తవునీ వేరుచేయడం ఆయన ఎరగనే ఎరగడు. ఆయన దృష్టిలో అందరూఒకటే. అందరూ సహోదరులే - అందరూ ఒకదివ్యమైన ఆత్మ శకలాలే. ఈ సోదర ఆత్మలన్నీకూడా వ్యక్తిత్వం కోసం పోరాడుతున్నాయి. ఆయనకు ఉన్నదంతా ఆయనఇచ్చేస్తాడు. ఆత్మత్యాగం ఆయనకు సహజంగా వచ్చినగుణం. ఆయన ఆధ్యాత్మిక ప్రభావాలు అన్నివైపులా అగాధంగా అల్లుకుని ఉంటాయి. అందువల్లనే ఏమానవుడూకూడా ఆయన సమక్షంలో పాపంచెయ్యసాహసించ లేదు."

అనేకసంవత్సరాల తరువాత జార్జిస్లొకొంబె అను ఒక ఆంగ్ల పత్రికా రచయిత గాంధీజీని

గురించి ఇలా వ్రాశాడు: "ఇలాంటి నీతిమంతునీ, ఇంత స్వచ్ఛమైన నిష్కపట హృదయునీ, నిజాయితీ పరునీ ఇంతవరకు నేనెక్కడా చూడలేదు. నేను చూచినంతమట్టుకు ప్రపంచ రాజకీయ వేత్తలందరిలో - ఏకొద్దిగానో, గొప్పగానో - అహంభావం, నా అంతవాడు లేడన్న గర్వం, అవకాశవాదం, ఆశ - ఇవన్నీ ఉన్నాయి. ఈయనలో ఇవేవీ అణుమాత్రమైనా లేవు."

ఎటువైపునుంచి ఎన్నివాదాలు వచ్చినప్పటికీ - అవి గాంధీజీని రాజకీయాలను త్యజించేటట్లు చేయజాలక పోయినవి. కారణం ఏమంటే - తాను పూనుకున్న కార్యం భగవంతునిచే నియోగింపబడిన కార్యం అని ఆయన విశ్వసించాడు. భారతదేశ విముక్తి కోసమూ, భారతదేశం ద్వారా ప్రపంచంలో అహింసను వ్యాప్తి చేయడం కోసమూ ఆయన తన కార్యం కొనసాగించాడు. ఒక భాగానికి చెందిన బ్రిటిషు రాజనీతిజ్ఞులనుండీ, పరిపాలకుల నుండీ తనను గురించి లేనిపోని పొగడ్తలు వస్తున్నట్లు ఆయనలో ఒక విధమైన అనుమానం కలిగింది. వారు తనను ఒక ప్రక్క పావన మూర్తి అని శ్లాఘిస్తూనే, మరొక ప్రక్క తన రాజకీయ పద్ధతులనూ, కార్యకలాపాలనూ దూషిస్తూ రావడం ఆయన గమనించాడు. 1930లో దండి సత్యాగ్రహానికి కొద్ది రోజులు ముందు, సబర్మతిలో జరిగిన చర్చ సందర్భంలో గాంధీజీ ఇలా చెప్పడం నేను విన్నాను:

"నేను కనుక రాజకీయాలను త్యజించినట్లయితే బ్రిటిషువారు నన్ను మహాత్ముల జాబితాలో చేరుస్తారు!" - ఆయన చెప్పే మాటలలో, మనస్సులో సూటిగా నాటుకునే ఈ ఒక్క మాట వినే భాగ్యం నాకు కలిగింది.

4

రాధాకృష్ణ పండితుని అభిప్రాయంలో 'మతం' - భగవంతుని వస్తువులను సీజరు వస్తువులనుండి వేరుచేయడంతో - మానవుడి సాంఘిక సంబంధమైన మనస్సాక్షినీ, నైతిక జ్ఞానాన్నీ బలహీనపరుస్తున్నది. తత్ఫలితంగా రాజ్యాంగం - నైతిక ధర్మములన్నింటికీ అతీతంగా ఉంటుందని ప్రకటించబడింది. అతి దుష్టమైన పనులు - అసత్యం, దగా, మోసం, కుతంత్రం, క్రూరత్వం, నేరం, జులుము - ఇవన్నీ కూడా ప్రభుత్వం పేరుతో కొనసాగుతున్నాయి. "ఇటలీకోసం మనం చేస్తున్న పనులు, మనకోసమే చేసియున్నట్లయితే - మనం ఎంత పుండాకోర్లము అయియుండేవాళ్ళం!" - అన్నాడు క్రేవర్. నైతికధర్మం ప్రకారం చేసినట్లు విశ్వసిస్తూ గాంధీజీ - "దైవభక్తి కంటె దేశభక్తి ఎప్పటికీ తక్కువైనదే" - అని స్పష్టం చేశాడు. ఇందుకు విరుద్ధంగా మెఛియవెల్లీ - "నా ఆత్మవిముక్తి కంటె దేశవిముక్తి నేనే అధికంగా భావిస్తాను," - అని చెప్పాడు.

రాజకీయాలలో తన వైఖరిని వివరిస్తూ గాంధీజీ ఇలా వ్రాశాడు: "నా దగ్గర రహస్య పద్ధతులేవీ లేవు. మంత్రాంగమంటే ఏమిటో నాకు తెలియదు అహింస తప్ప నాకు వేరే ఆయుధం లేదు". గాంధీజీ భారతదేశానికి రావడానికి ముందు, ప్రజలు నిరంతరం సి. ఐ. డి. పోలీసులకు భయపడుతూ వచ్చారు. కాని గాంధీజీ ఏమాత్రం దాపరికం లేకుండా వ్యవహరించాడు. తన ధోరణిని బహిరంగంగా, స్పష్టపరిచి, సి. ఐ. డి శాఖవారి పని చాలవరకు తగ్గించడమే కాక, ప్రజలలోగల భయాందోళనలను పోగొట్టాడు.

5

రాజకీయాలలో మతాన్ని ప్రవేశపెట్టే విషయంలో గాంధీజీ పేర్కొన్న ప్రధాన సాధనాలలో కొన్ని ఈ క్రింది విధంగా ఉన్నాయి: 1. ఏమైనా కానీ, సత్యాన్నే అంటిపెట్టుకుని ఉండు. 2. ఒకటి చేస్తావా చెయ్యి లేదా మరణించు: అంతేకాని ఒకరిని చెయ్యమని చెప్పకు. ఒకరిని చంపకు. కష్టాలను నీవే ఆహ్వానించి భరించు కాని, నీ ప్రతికక్షిపై వాటిని వేయకు. 3. నీ ప్రతికక్షిపై నీ వొక చర్య తీసుకోవాలని ఉద్దేశించే ముందు - అతనికి తగిన వ్యవధి ఇవ్వడమే కాకుండా, ఆ విషయం ముందుగానే అతనికి

తెలియపరచు. 4. నీ ప్రతిపక్షి భావాలనూ, విధానాలనూ విమర్శించుకొని, వ్యక్తిగతంగా అతన్ని విమర్శించకు. 5. అతను కష్టాలలో ఉంటే - వాటిని నీప్రయోజనంకోసం, అక్రమ పద్ధతిలో అవకాశంగా తీసుకోకు.

6. ఒకసమయంలో కాకపోతే మరొక సమయంలోనైనాసరే - వీలయినంతముందే అతనితో సఖ్యతపడాలనికాంక్షించు. అలాచేస్తే నీవు తిరిగి అతనితో సహకరించడానికి, గౌరవ ప్రదంగా సమాధాన పడడానికీ వీలవుతుంది. 7. ఎంతప్పటికీ అతని స్వభావంలోని సద్గుణాన్నే మేల్కొల్పడానికి ప్రయత్నించు, ప్రార్థించు. అంతేకాని అతనిలోని దుర్గుణాన్నీ, శేక బలహీనతనూ రెచ్చకొట్టాలని ఎప్పుడూ కోరకు. తద్వారా అతనిపై విజయం సాధించి, లోకం దృష్టిలో అతన్ని నేరస్థునిగా నిలవబెట్టాలని అనుకోకు. లేదా న్యాయాన్ని దర్శించగలిగే శక్తి అతనికి ప్రసాదించమని నిరంతరం ఆభగవంతుని ప్రార్థించు. 8. నీవు చేసిన తప్పులూ - పాపకృత్యాలూ, పెద్దవి కానీ చిన్నవి కానీ ఒప్పుకుంటూఉండు. 9. నేను చేసింది న్యాయమేనని అనుకుంటూ గాలిమేడలు కట్టకు. 10. ఎన్నికలలో ఎప్పుడూ పవిత్రమైన పద్ధతులే అవలంబించుగాని, పాపానికి ఒడిగట్టకు. కార్యస్థానంలో తాత్కాలిక రాజకీయ ప్రయోజనాలను ఆశించి గడ్డి కరవకు. "మీఅందరిలోకీ అల్పుడుగా ఉన్నవాడు, అధికుడు కావచ్చు; - మీ అందరికీ నాయకుడుగా ఉన్నవాడు సేవకుడు కావచ్చు; - ఎవడు ఉచ్చస్థితిలో ఉన్నాడో వాడు నీచస్థితిలోకి పోవచ్చు. ఎవడులొంగిఉన్నాడో వాడుఉన్నతస్థాయి అందుకోవచ్చు" - అన్న సూక్తులు బాగా జ్ఞాపకం పెట్టుకో. 11. భగవంతునికి భయపడు కాని, ఏమానవునకూ భయపడకు. 12. ఎప్పుడూ అచంచలమైన విశ్వాసంతోఉండు; ఏనాటికైనా, చివరకు న్యాయమే జయిస్తుంది కాని, అన్యాయం జయించదు. 13. అంధకారం నిన్ను ఆవరించుకున్నప్పుడు - నీకుమార్గం చూపడానికి వెలుగు ప్రసాదించమని ప్రార్థించుకో. 14. దగ్గరలో ఉన్నదానికోసం ఒక్కఅడుగు ముందుకువెయ్యి - చాలు; దూరంగా ఉన్న భవిష్యత్తుకోసం కనిపెట్టుకుని ఉండకు. 15. లోకమంతా ఎదిరించినాసరే - అవసరమైతే న్యాయంకోసం. నీవూ నీదేశం-నైతికబలంతో, ధైర్యంతో నిలవబడేటట్లుచూడు. 16. నీఆంతరంగిక పవిత్రతనూ, శక్తినీ అభివృద్ధి పరుచుకోవటం కోసమే - ప్రధానంగా నీ కృషిని కొనసాగించు.

జైమిని భారతం
(అశ్వమేధ పర్వం)

శ్రీ రెంటాల గోపాలకృష్ణ

౧

కథా ప్రారంభం

భారతకథలో అభిమన్యుడిపేరు విననివారుండరు. అర్జునుడి కుమారుడు-అభిమన్యుడు భారతయుద్ధంలో ఎవరూ చూపని వీరపరాక్రమం చూపాడు. వీరమరణం పొందాడు. అభిమన్యుడు మరణించే నాటికి అతని భార్య ఉత్తర గర్భవతి. తరువాత ఆమెకు పుట్టిన పిల్లవాడే పరీక్షిత్తు. అతడే పాండవ వంశాంకురంగా నిలచాడు. భారతయుద్ధం ముగిసిన అనంతరం-కొన్నాళ్ళకు పాండవులు పరీక్షిత్తుకు పట్టంకట్టి పరలోక యాత్రచేశారు. పరీక్షిత్తు రాజ్యానికి వచ్చిన తరువాత ఒకానొక కారణాన శాపం పొందాడు. పాము కాటువల్ల మరణించ వలసినవాడై, ప్రాయోపవేశం చేశాడు. శుకయోగీంద్రుల వారి వలన పుణ్యకథ అయిన భాగవతం విని జన్మ చరితార్థం చేసుకున్నాడు. ఆ పరీక్షిన్మహారాజు కుమారుడు జనమేజయుడు. ఈవిధంగా భరతవంశం కొనలుసాగింది.

జనమేజయుడు సర్పయాగంచేసి ప్రసిద్ధికెక్కాడు.

వేదాలను వేరుచేసిన వ్యాసులవారి శిష్యులలో జైమిని ఒకడు. జైమిని మహాముని, గొప్పపౌరాణికుడు వ్యాసులవారి వద్ద సామవేదం సాధించి, దానిని వ్యాప్తిలోనికి తెచ్చిన మహానుభావుడు. అలాంటి జైమిని మహాముని జనమేజయ మహారాజు వద్దకు వచ్చాడు. ఆయనకు ఎన్నెన్నో పురాణాలూ, పుణ్యకథలూ చెప్పి వినిపించాడు. అవన్నీ ఎంతో కుతూహలంతో వింటున్న జనమేజయుడు-జైమినిని చూచి-"మహాత్మా! ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో - పద్దెనిమిది రోజులు భారతయుద్ధం జరిగిందనీ, ధర్మరాజు కౌరవ సైన్యాలను సంహారించి, రాజ్యం చేపట్టాడనీ మీరు చెప్పారు. భూమండలం యావత్తూ ఎదురులేకుండా ఏలుతూ, లోకాలన్నీ పొగిడేటట్లు ఎవరూ చేయని విధంగా అశ్వమేధయాగం చేశాడనీ సెలవిచ్చారు. ఆ యాగం ఎలా జరిగిందీ వివరంగా నాకు చెప్పవలసినది"-అని అడిగాడు

అప్పుడు మహాముని-జైమిని జనమేజయ మహారాజునకు ఇలా చెప్పడం ప్రారంభించాడు:

వ్యాసుల వారి రాక

జనమేజయ మహారాజా ! మీముత్తాత గారయిన ధర్మరాజుల వారు అశ్వమేధ యాగం చేసిన విధం వివరించి చెపుతాను వినండి-

మహాత్ముడూ, గొప్ప పరాక్రమశాలీ, కురువృద్ధుడూ అయిన భీష్మాచార్యుడు స్వర్గస్థుడైన అనంతరం ధర్మరాజు అంతు లేని దుఃఖ సముద్రంలో మునిగిపోయాడు. అప్పుడు మహానుభావుడు,వ్యాసమునీంద్రుడు అక్కడికి విచ్చేశాడు.

పాండవులు కష్ట సమయంలో ఉన్నప్పుడు వ్యాసులవారు వచ్చి ఓదార్చి వెళ్ళడం పరిపాటి. అలాగే ఇప్పుడూ వచ్చాడు వ్యాసుడు. ధర్మరాజు ఆయనకు ఎదురువెళ్ళి సాష్టాంగపడి- తోడితెచ్చి - ఉచితాసనంపై కూర్చోబెట్టి యథావిధిగాపూజించాడు;"మహాత్మా!

మేం రాజ్యం ఆశించి చెయ్యరాని పాపాలన్నీ చేశాం. పితామహుడైన భీష్ముణ్ణీ, ఆచార్యుడైన ద్రోణుణ్ణీ, అగ్రజుడైన కర్ణుణ్ణీ సంహరించాం. ఈపాపం ఎట్లా పోతుంది? అయ్యో! మమ్ములను పెంచి-పెద్దచేసిన భీష్ముణ్ణీ, విద్య చెప్పిన ద్రోణుణ్ణీ చేజేతులా చంపుకున్నామే! మాకు అన్న-ఈరాజ్యానికి అర్హుడు. అయిన కర్ణుణ్ణి వధించామే! దాయాదులూ, చుట్ట-పక్కాలూ చూడని ఈరాజ్య సుఖం నాకెందుకు? వద్దు. ఈరాజ్యం నాకువద్దు. ఏ కానన గంతలకో వెళ్ళి తపస్సు చేసుకుంటాను. అయ్యో! దాయాదులను చంపిన ఈ మహాపాతకం నాకు ఎలా పోతుంది మహర్షీ ? ఏ జపతపాదులు చేస్తే, ఏతీర్థయాత్రలు సేవిస్తే, ఈ పాపం నన్ను అంటకుండా ఉంటుంది! ఏయజ్ఞ యాగాదులు కావిస్తే నాకు ప్రాయశ్చిత్తం కలుగుతుంది? చెప్పండి మహాత్మా!-" అని ధర్మరాజు, పొంగివస్తున్న దుఃఖంతో వ్యాసుల వారిని అడిగాడు. అందుకు వ్యాసుడు-"ధర్మనందనా! నీకీ మహాపాతకం పోవాలంటే ఒకటే మార్గం ఉన్నది. అశ్వమేధయాగం చెయ్యి. నీ పాపాలన్నీ పటాపంచలవుతాయి. నీకు శుభం చేకూరుతుంది. పూర్వం శ్రీరామచంద్రమూర్తి అశ్వమేధ యాగంచేసి రావణబ్రహ్మను చంపిన పాతకం పోగొట్టుకున్నాడు. ధర్మరాజా! యుద్ధంలో జయించిన రాజ్యాన్ని క్షత్రియుడు పోగొట్టుకోకూడదు. నీకు నలుగురు తమ్ములున్నారు. యుద్ధంలో మొనగాండ్రు. నాలుగు దిక్కులనూ జయించ గల సమర్థులు. పైగా యాదవ వీరులందరూ నీ అధీనంలో ఉన్నారు. కాబట్టి సందేహించక అశ్వమేధ యాగానికి పూనుకో-" అని సలహా చెప్పాడు. అప్పుడు ధర్మరాజు దీనంగా— "మునీంద్రా! నిన్నగాక - మొన్న మహా యుద్ధం జరిగిందికదా. అయుద్ధంలో రాజులంతా మరణించారు వారి కుమాళ్ళు-పసివాళ్ళు-తల్లిదండ్రులను పోగొట్టుకొని దుఃఖ సముద్రంలో మునిగియున్నారు. అలాంటి వాళ్ళను దయ తలచాలికాని పీడించకూడదే. ఇహ తక్కిన ప్రజలా-నిన్నటిదాకా దుర్యోధనుడికి పన్నులు చెల్లించి చితికి పోయి ఉన్నారు. నేనా కొత్తగా రాజ్యానికి వచ్చిన వాణ్ణి. ఈ మహాయాగం చేయడానికి నా దగ్గర ధనమెక్కడున్నది? క్షత్రియకులాన్ని సమూలంగా నాశనం చేసింది చాలక, ధనం ఇమ్మని ప్రజలను పీడిస్తే- గోరుచుట్టుపై రోకటి పోటన్నట్లు-వారు ఎంతో బాధపడడమే కాక నన్ను చూచి నవ్వుతారు. నా లాంటి దుష్టుడు లేడని నిందిస్తారు. కాబట్టి ఎంతోధనం వల్ల సాధ్యమయ్యే ఈయాగం నావల్లకాదు."-అని విన్నవించుకున్నాడు. అది విని వ్యాసుడు-"ధర్మరాజా! పూర్వం మరుత్తుడనే చక్రవర్తి బహుసువర్ణకం అనే గొప్ప యాగం చేశాడు. బ్రాహ్మలకు అపారమైన ధనం దక్షిణలుగా ఇచ్చాడు. ఆ బ్రాహ్మలు, తాము ఎత్తుక పోయినంత ఎత్తుకునిపోయి-తక్కిన ధనం మోయలేక హిమవత్పర్వత ప్రాంతంలో పారవేసి పోయినాడు. కాబట్టి ఆధనం నీకు దొరికి నట్లయి తే-యాగం నిర్విఘ్నంగా కొనసాగించవచ్చు."- అని చెప్పాడు. అంతట ధర్మపుత్రుడు- "మునీంద్రా! మరుత్తుడు బహుసువర్ణకయాగం చేసి బ్రాహ్మలకు దానంచేసిన ద్రవ్యం నన్ను తెచ్చుకోమంటూన్నారు. అది బ్రాహ్మల ద్రవ్యం బ్రాహ్మల ద్రవ్యం తిరిగి బ్రాహ్మలకే దానం చేస్తే లోకం నవ్వదా? మాసొమ్ము మాకే దానం చేశాడు ధర్మరాజు-అని అనరా వారు? ఈ చేసిన పాతకం చాలక బ్రాహ్మణ ద్రవ్యం అపహరించి ఇంకా పాపానికి ఒడి కట్టుకోమంటారా మహర్షీ? ఈ విధంగా నేను తరించాలనుకోవడం-కుడిచికూర్చొక, పెద్ద బండను తెప్ప కొయ్యగా చేసుకొని సముద్రం దాటాలనుకున్న విధం అవుతుంది. వద్దు. ఈ పాపం నేను చెయ్యలేను-" అని పలికాడు. అప్పుడు మళ్ళీ వ్యాసుడు ఇలా చెప్పసాగాడు: "ధర్మరాజా! పూర్వం పరశురాముడు ఈ భూమండలం కశ్యపుడికి దానం చేశాడు. మరి

కశ్యపుడి భూమి అని రాజులు వదలి పెట్టారటయ్యా? లక్షణంగా తాము ఏలుకున్నారే. నీకు తెలియదా? కూడని పని అయితే వారు చేస్తారా? ఒక్క మాట చెపుతాను విను నాయనా. బ్రాహ్మలకు వెక్కసమై వారు వదలి పెట్టి పోయిన ధనం స్వీకరించడంలో దోషం లేదు. అంతే కాదు. ఈ పృథ్విని ఎవడు ఏలుతున్నాడో ధనమంతా వానిదే. కాబట్టి నీవీ విషయంలో ఏమాత్రం సంశయించ వలసిన పనిలేదు. నిర్భయంగా నీవా ధనం తెచ్చుకుని అశ్వమేధయాగానికి పూనుకో. ఆయాగం చెయ్యవలసిన విధానం కూడా వివరంగా చెపుతాను, సావధానంగా విను :

యజ్ఞ విధానం

"వేదశాస్త్రాలూ పురాణాలూ చక్కగా చదువుకున్నవారు. సత్కులంలో పుట్టినవారు, విష్ణుభక్తి కలవారు, బ్రహ్మతేజస్సుతో ప్రకాశించేవారు-అయిన బ్రాహ్మలు ఇరవై వేలమంది ఈ యాగానికి ఋత్విక్కులుగా కావాలి. ఈ ఋత్విక్కులకు ఒక్కొక్కరికి, బంగారు సమేతంగా ఒక్కొక్క గుర్రం, ఒక్కొక్క మదపు ఏనుగు, ఒక్కొక్క రథం, రెండు తవ్వల రత్నాలు, వెయ్యి ఆవులు, ఆవుకు నూరేసి చొప్పున గొర్రెలు-దక్షిణగా ఇవ్వాలి. నియమం ప్రకారం గుర్రాన్ని పూజించి విడిచి పెట్టాలి. ఇది యజ్ఞం మొదటి రోజున దక్షిణ ఇచ్చేవిధానం. ఇహ యజ్ఞాశ్వానికి ఉండవలసిన లక్షణాలు చెపుతాను విను. యజ్ఞంలో విడిచి పెట్టే గుర్రానికి చందనం, కుందనం కలిసిన వర్ణంగా ఉండే శరీరం, ఇంద్ర నీలమణుల్లా ప్రకాశించే నల్లటి చెవులు, బంగారు ఛాయ గల కుచ్చుతో ఉన్న తోక, వాయువేగ మనోవేగాలతో పరుగెత్త గల శక్తి-ఉండాలి. ఈ లక్షణాలు కలగుర్రమే అశ్వమేధయాగంలో విడిచి పెట్టడానికి అర్హత కలది. ఇలాంటి గుర్రాన్ని చైత్రశుద్ధ పౌర్ణమినాడు విడిచి పెట్టాలి. గుర్రం వెంట చతురంగ బలాలు బయలు దేరి వెళ్ళాలి. గుర్రాన్ని రక్షించడం కోసం దాని కూడా యజ్ఞకర్త కుమారుళ్ళు కాని, తమ్ముళ్లు కాని వెళ్ళాలి. ఒక బంగారపు పట్టం మీద యజ్ఞం చేసే వారి ఊరు, పేరు, బిరుదు-మొదలయిన వివరాలు వ్రాసి- "ఈ భూమండలంలో వీరుడూ, శూరుడూ ఉంటే ఈ గుర్రాన్ని పట్టండి!-"అని ప్రకటన వ్రాసి గుర్రం నొసట వ్రేలాడ కట్టి వదలి పెట్టాలి. ఆ గుర్రం ఎక్కడెక్కడ మలమూత్రాలు విసర్జిస్తుందో-అక్కడల్లా వేయి ఆవులు బ్రాహ్మలకు దక్షిణగా ఇచ్చి హోమం చేయిస్తూరావాలి. గుర్రం తిరిగి రావడానికి వ్యవధి ఒక్క సంవత్సరం. యజ్ఞం చేసే వాడు సంకల్పం చేసి ఈ సంవత్సరం పాటూ దీక్ష పుచ్చుకోవాలి. గుర్రం తిరిగి వచ్చే దాకా అతనూ అతని భార్య కఠిన బ్రహ్మచర్యం అవలంబించాలి. భోగాలన్నీ మానుకుని, నేల మీద పడుకుంటూ అసిధారా వ్రతం పూని ఉండాలి. ధర్మనందనా! ఇంతనియమంగా అశ్వమేధ యాగం చెయ్యాలయ్యా! దేవేంద్రుడు నూరు అశ్వమేధ యాగాలు చేశాడు కాని ఇంత నిష్ఠగా ఉండలేదు. నీవు నిష్ఠగా ఈ యాగం ఒక్క తడవ చేశావా-నీ సకల పాపాలు పటాపంచలవుతాయి, కామానికి లొంగకుండా ఒక్క భీష్ముడు కఠినబ్రహ్మచర్యం నడపకలిగాడు కాని తక్కిన వారెవ్వరికీ అది సాధ్యం కాదు. ఇది సాధ్యం కాకనే రాజులు అనేక మంది ఈ యాగం మానుకున్నారు. నీకు అలవి అయితే చెయ్యి. శుభం చేకూరుతుంది-"

ఇలా వ్యాసుడు చెప్పగా విని ధర్మరాజు- "మునీంద్రా! నాతమ్ములయిన భీమార్జున నకుల సహదేవులు యుద్ధం చేసి చేసి అలసి పోయి ఉన్నారు. కర్ణుడి కుమారుడు వృషకేతుడున్నాడు. బలవంతుడే-కాని బాలుడు. ఘటోత్కచుడా, మాకోసం యుద్ధంలో మరణించాడు. అతని కొడుకు మేఘవర్ణుడున్నాడు కాని వాడూ పసివాడే. ఈ పసి

వాళ్ళిద్దరినీ యుద్ధానికి పంపడం యుక్తం కాదు. ఇహ మాకు కొండంత అండగా ఉన్న శ్రీకృష్ణుడున్నాడు. కాని దూరంలో ఉన్నాడు. ఇహ మరి ఈ యాగం చెయ్యడం నాకెలా సాధ్యమవుతుంది?- "అన్నాడు

అన్నగారిలా అనడం విన్నాడు భీమసేనుడు. ధర్మరాజును చూచి- "అన్నయ్యా? శ్రీకృష్ణ పరమాత్మ ఎక్కడో దూరంగా ఉన్నాడంటున్నారేమిటిమీరు? ఆయన సర్వత్రా ఉన్నాడు. ఆ వాసుదేవుణ్ణి తలచినంత మాత్రానే మన పాపాలన్నీ పోతాయి. పుణ్యాలు వస్తాయి, అంతేకాదు. మీకొక ధర్మ రహస్యం చెపుతాను, వినండి. ఆ శ్రీ కృష్ణ పరమాత్ముని ఆజ్ఞ ప్రకారమే మనం యుద్ధం చేసి దాయాదులను సంహరించాం. అంతే కాని మనం స్వతంత్రించి ఈ పని చేయలేదు. కనుక ఇందులో మనకు రవంతయినా దోషం రాదు. ఇహ అశ్వమేధ యాగం చేస్తే ఏం, చెయ్యకుంటేనేం? ఆ కృష్ణ పరమాత్మను నమ్ముకున్న మనకు మోక్షమేకాని నరకం లేదు. అయినప్పటికీ రాజలోకంలో కీర్తి రావడం కోసం మీరీ యాగం చెయ్యడానికి పూనుకోండి. ముందు యాగానికి యోగ్యమైన గుర్రం ఎక్కడున్నదో విచారించి తెలుసుకోండి. ఎవడు అడ్డం వచ్చినా సరే జయించి గుర్రాన్ని తెచ్చి అప్పగిస్తాను.-" అని పలికాడు భీముడు.

అప్పుడు వ్యాసమునీంద్రుడు ధర్మరాజును చూచి- "పాండవాగ్రజా! భీముడు చెప్పింది సత్యం. భద్రావతీ అనే పురంలో యౌవనాశ్వుడనే రాజు రాజ్యం చేస్తున్నాడు. అతని గుర్రపు శాలలో నేను చెప్పిన లక్షణాలు గల గుర్రం ఒకటి ఉన్నది. కాని పది అక్షౌహిణుల సైన్యం రాత్రింబవళ్ళు ఆ గుర్రానికి కాపలా కాస్తున్నది. పోతు టీగ అయినా ఆ వైపుకు పోలేదు. నీకా గుర్రం కనుక దక్కినట్లయితే నీ యాగం నెరవేరుతుంది." అని చెప్పాడు.

భీముడి ప్రతిజ్ఞ

అదివిని భీమసేనుడు ధర్మరాజును చూచి- "అన్నయ్యా! భయంలేదు. దేవతలూ దానవులూ ఏకమై ఎదిరించినా సరే ఆ యౌవనాశ్వుని జయించి అతని దగ్గర ఉన్న గుర్రాన్ని పట్టి తెస్తాను. మీ పాదాలమీద ఒట్టు. అలా గుర్రాన్ని తేలేకపోయినట్లయితే - వేదఘోష వినపడని ఊళ్ళో నివసించేవాడూ, శివుడిగుడీ విష్ణుగుడీ లేనిస్థలంలో ఉండేవాడూ, తల్లిదండ్రులకు భేదంతలచేవాడూ, జనం వాడుకోని నూతిలోనీళ్ళు త్రాగేవాడూ, బ్రాహ్మలతో అబద్ధం ఆడేవాడూ, అప్పుతీసుకుని ఇవ్వక ఏడిపించేవాడూ, నమ్మకద్రోహం చేసేవాడూ, శివనామం చెవిన పెట్టనివాడూ - ఏపాపాన పోతారో నేనూ ఆపాపానపోతాను" - అని శపథం చేసి చెప్పాడు. అప్పుడు ధర్మరాజు, తమ్ముణ్ణి చూచి - "నాయనా! భీమసేనా! యౌవనాశ్వుడు మహా పరాక్రమశాలి. అతని సైనికులా యుద్ధాలలో ఆరితేరినశూరులు. వాళ్ళందరినీ జయించి గుర్రాన్ని తేవడం సాధ్యంకానిపని. ఇలా ప్రతిజ్ఞ ఎందుకు చేశావు నాయనా?" - అనిపలికాడు. అది విని కర్ణుడి కుమారుడు వృషకేతుడు ధర్మరాజుతో - "మహారాజా! భీమసేనుడివెంట నన్ను పంపండి. వెడతాను" - అనిచెప్పాడు. భీముడు వృషకేతుణ్ణిచూచి - "అబ్బాయీ! మీతండ్రి కర్ణుణ్ణి. మా అన్నఅని ఎరుగక యుద్ధంలోచంపాం. అప్పటినుండీ మామనో వేదన చెప్పతరంకాదు నాయనా! నీముఖం చూచినప్పుడల్లా మాకు ఎక్కడలేనిసిగ్గు, దుఃఖం ముంచుకొస్తున్నది" - అన్నాడు. అందుకు వృషకేతుడు - "అయ్యా! పాపబుద్ధిగల మాతండ్రి మీచేతుల్లో చావడమే మేలయింది. ఆయన పాపాలన్నీ పోయి వీరస్వర్గం పొందాడు. వాసుదేవుని భక్తులయిన మీపై మానాయన ద్వేషంపూనాడు. చింతామణినివదిలిపెట్టిచిల్లిగవ్వనుచేపట్టినట్లు

మిమ్మల్ని విడిచి దుర్యోధనుణ్ణి కొలిచాడు. ద్రౌపదీస్వయంవరంలో మీతో యుద్ధానికి తలపడ్డాడు. విరాటనగరంలో ఆవుల మందలను పట్టించాడు. మాయాజూదం ఆడించి మాయమ్మ ద్రౌపది చీరెలు ఒలిపించాడు. దుర్యోధనుణ్ణి వారించేశక్తి ఉండీకూడా, పుణ్యాత్ములయిన మీకు ద్రోహంతలపెట్టి ఎన్నెన్నో పాపకృత్యాలు చేశాడు. ఆపాపాలకు ప్రాయశ్చిత్తంగా, శ్రీకృష్ణ పరమాత్మ సన్నిధానంలో - అర్జునితో యుద్ధంచేసి - ఆయన బాణాలకు బలియై తన తండ్రియైన సూర్యభగవాన్లలో ఐక్యమైనాడు. కాబట్టి అర్జునుడు కర్ణుడి ఋణం తీర్చవలసిన పని లేదు. ఆవిషయం అలా ఉండనివ్వండి. రాజా! నేను భీమసేనుడి వెంట వెడతాను. నాపరాక్రమంతో శత్రువులను సంహరించి యౌవనాశ్వునిగుర్రాన్ని తెచ్చి మీకు సమర్పిస్తాను. ఈవిధంగా నయినా మానాయనగారి పాపాలకు ప్రాయశ్చిత్తంచేసి ఆయనకు సద్గతి కలిగిస్తాను. నాకు అనుజ్ఞ ఇవ్వండి రాజేంద్రా"— అనిపలికాడు.

ఆమాటలువిని ధర్మరాజు ఆనందంతో కర్ణపుత్రుణ్ణికౌగలించుకున్నాడు: "నాయనా! అలాగే మీపినతండ్రితోపాటువెళ్ళి జయం సాధించి కార్యం నెరవేర్చుకునిరా" - అని ఆశీర్వదించి అనుజ్ఞ ఇచ్చాడు.

ఘటోత్కచుడి కుమారుడు మేఘవర్ణుడు ప్రక్కనేఉండి ఇదంతా చూస్తున్నాడు. తానూ యుద్ధానికి వెళ్ళాలనే ఉత్సాహం కనపరిచాడు, అది కనిపెట్టి భీముడు - "నాయనా! మేఘవర్ణా! నీతండ్రి ఘటోత్కచుడు మేం వనవాసం చేస్తున్న సమయంలో గంధమాదనపర్వతంమీద ఆపదనుండి మాఅందరినీ కాపాడాడు. మాకోసమే యుద్ధంలో ప్రాణాలు అర్పించాడు. అతనుచేసిన ఉపకారాలు తలుచుకుంటే మా హృదయం ద్రవించిపోతున్నది నాయనా. కాబట్టి నిన్ను యుద్ధానికి తీసుకుని పోవడానికి నాకు మనస్కరించడం లేదు. మేం వచ్చేదాకా నీవు ఇక్కడే ఉండి ధర్మరాజుల వారిని సేవిస్తూ ఉండు నాయనా-" అని చెప్పాడు.

కాని మేఘవర్ణుడువినలేదు. తాత అయిన భీమసేనుణ్ణి చూచి- "పూర్వం రామచంద్రమూర్తి పాదధూళిసోకి, పాషాణమైన అహల్య పావనమైనట్లుగానూ. గంగానదితో కూడిన అశవివాగు పరిశుద్ధమైనట్లుగానూ, మానాయనగారు మీకు జన్మించడం వల్ల ధన్యుడైనాడు. అలాగే నేనూ మిమ్మల్ని కొలిచి తరిస్తాను. మీతో భద్రావతికి వస్తాను. అగస్త్యుడు సముద్రజలాలను ఆపోశనం పట్టినట్లు శత్రుసైన్యాలను మీరు అరికట్టుతూ ఉండగా వృషకేతుడు వైరులను ఎదిరించి యుద్ధం చేస్తూ ఉంటే- నేను మేకపిల్లను చంకపెట్టుకున్నట్లు ఆ గుర్రాన్ని ఎత్తుకొని వస్తాను."- అని పలికాడు. అది విని భీమసేనుడు ఎంతో సంతోషించాడు. తన మనుమణ్ణి కౌగలించుకున్నాడు. "నాయనా! నీమాటలు వింటూ ఉంటే నాకెంతో ఆనందం కలుగుతున్నది. నీవూ, నేనూ, వృషకేతుడూ- మన ముగ్గురం ఏకమైతే ఆ ముక్కంటి అయినా ఎదిరించ లేడు. సరే. అలాగే మన ముగ్గురం పోదాం." అని పలికాడు. ఆ విధంగా యుద్ధసన్నద్ధులై యున్న భీముణ్ణీ, వృషకేతుణ్ణీ, మేఘవర్ణుణ్ణీ, చూచి యుధిష్ఠిరుడు-మిక్కిలి ఆనందంతో పొంగిపోయాడు. సంతోషాతిశయం వల్ల కళ్ళు చెమ్మగిల్లాయి. వళ్ళు పులకరించింది. మూడు అగ్నిహోత్రాల్లా ప్రకాశిస్తున్న ఆ ముగ్గురినీ చూచాడు ఈ ముగ్గురికీ ఈ మూడు లోకాలలో అసాధ్యమైంది ఏదీ లేదు. అనుకున్నాడు. అంతలో ప్రొద్దు కూక వచ్చింది. పడమటి దిక్కు అనే పడతి కొప్పున తురిమిన చెంగలువలా సూర్యబింబం అస్తాద్రిపైవాలి ఎర్రగా చూపట్టింది. అంతట వ్యాస భగవానుడు ధర్మరాజును ఆశీర్వదించి ఆయన చేసిన పూజలు స్వీకరించి తిరిగి తన

ఆశ్రమానికి వెళ్ళిపోయాడు. తరువాత ధర్మరాజు సంధ్యావందనాదిక్రియలు ఆచరించి చుట్టూ తమ్ములు కొలుస్తూఉండగా రత్నసింహాసనంపై కూర్చున్నాడు. అప్పుడు మళ్ళీ ఆయనకు విచారం పట్టుకున్నది. - భద్రావతీ పురానికి ఎలా వెళ్ళగలుగుతాం? గుర్రాన్ని ఎలా తీసుకుని రాగలం? దక్షిణలు ఇవ్వడానికి అంత ధనం ఎక్కడున్నది? ఈయాగాన్ని నిర్వహించే వారెవరున్నారు? అయ్యో! వ్యాసులవారి మాటకు ఎందుకు ఒప్పుకున్నాను? ఆ శ్రీకృష్ణపరమాత్మవచ్చి పూనుకుంటే తప్ప, ఈ యాగం ఎలా నెరవేరుతుంది? - అని చింతిస్తూ ధర్మరాజు శ్రీకృష్ణపరమాత్మను వేడుకోసాగాడు - కృష్ణా! యదుభూషణా! భక్తపాలనా! నేను దుఃఖసముద్రంలో మునిగి యున్నాను. నీదయ అనే ఓడతో నన్ను ఒడ్డుకు చేర్చుస్వామీ! ఆనాడు కౌరవసభలో పాంచాలిని కాపాడినట్లు నన్ను కాపాడుదేవా! నీవేనాకుదిక్కు- అని ఇలా పలువిధాలప్రార్థించు కున్నాడు.

శ్రీకృష్ణుని రాక

అప్పుడు సర్వాంతర్యామి అయిన ఆశ్రీకృష్ణభగవానుడు - ఆ అర్థరాత్రిలోనే హస్తినాపురానికి వేంచేశాడు. ధర్మరాజు భవనం చెంతకువచ్చి వాకిట్లో నిలచాడు. ద్వారపాలకుణ్ణి చూచి-"మేంవచ్చామని ధర్మరాజుతో చెప్పు. ఎంతటివారయినా-రాజుల సమయాసమయాలు తెలుసుకోక వారి అంతఃపురాల్లో ప్రవేశించడం ఉచితంకాదు" - అని పలికాడు. ద్వారపాలకుడు వాసుదేవునకు మ్రొక్కి "స్వామీ! తాము ఏవేళ వచ్చినా సరే. నన్ను అడగవలసిన పనిలేకుండానే ప్రవేశపెట్టమని ధర్మరాజులవారు ముందే మాకు ఆజ్ఞాపించియున్నారు. కనుక తమ రాకకు ఎట్టి అభ్యంతరంలేదు" - అని పలికి గోవిందుణ్ణి పలువిధాల కీర్తించాడు. ఆతరువాత ఆయన కోరికప్రకారం ఆ కావలివాడు ధర్మరాజు వద్దకు వెళ్ళి - కృష్ణపరమాత్మ వేంచేసి నగరివాకిట నిలచి యున్నాడని విన్నవించాడు.

ఆమాట విన్నవెంటనే ధర్మరాజు చివాలున లేచాడు. తమ్ములను వెంటబెట్టుకుని శీఘ్రంగా నగరిద్వారం చెంతకువెళ్ళాడు. కృష్ణునిపాదాలకు మ్రొక్కాడు. కృష్ణుడు ధర్మరాజును లేవనెత్తి ఆదరంతో కౌగలించుకుని ఆయనపై ఆనంద బాష్పాలు కురిపించాడు. పరమాత్మ దర్శన భాగ్యంవలన సంతోషంతో పొంగిపోతున్నాడు ధర్మరాజు. తరువాత భీమార్జున నకుల సహదేవులు శ్రీకృష్ణునకు ప్రణామం చేశారు. ధర్మరాజు, శ్రీకృష్ణుని సకల మర్యాదలతో తన అంతఃపురానికి తీసుకునివెళ్ళి, ఆయన పాదాలు కడిగి నీళ్ళు నెత్తిన చల్లుకుని - యథావిధిగా పూజించి ఆయన్ను బంగారపు సింహాసనంమీద కూర్చోబెట్టాడు. తామూ, తమ్ములూ తక్కిన ఆసనాలమీద ఆసీనులైనారు. అంతట ద్రౌపది అక్కడికి వచ్చింది. గోవిందునకు నమస్కరించింది. అర్ధరాత్రివేళ శ్రీకృష్ణుని రాకకు ఆశ్చర్యపడుతున్న ధర్మరాజును చూచి ద్రౌపది - "రాజేంద్రా! అచ్యుతుడేమిటి వేళకాని వేళ ఇక్కడికి విచ్చేశాడని ఆశ్చర్యపోతున్నారా? ఆశ్చర్యం ఏమీలేదు. తనభక్తులకు ఎప్పుడు ఎక్కడ ఆపదవస్తే ఆక్షణమే అక్కడికివచ్చి వారిని రక్షించడం వాసుదేవుని సహజగుణం. ఆనాడు కౌరవసభలో మీఅయిదుగురూ చూస్తుండగానే దుశ్శాసనుడు నాచీరెలు వలుస్తూ ఉంటే - నేను, శ్రీకృష్ణా! ద్వారకివాసా! గోవిందా! రక్షించు రక్షించు! - అని మనస్సులో వేడుకున్నంతనే నాకు అక్షయంగా వలువ లిచ్చి మానసంరక్షణ చెయ్యలేదా? అర్జునుణ్ణి ద్వారకకు పంపి శ్రీకృష్ణుని పిలిపిద్దామని మనం అనుకుంటూఉన్నాం. అనుకున్నంతనే ఆయనే ఇక్కడ ప్రత్యక్షమైనాడు" - అని గోవిందుణ్ణి కీర్తించింది. కృష్ణుడు చిరునవ్వులు ఒలికిస్తూ ప్రసన్న వదనుడై ద్రౌపదిని ఆదరించాడు.

తరువాత ధర్మరాజు కృష్ణపరమాత్మను చూచి - "శ్రీకృష్ణా! నేను దుఃఖంలో ఉండి నిన్ను తలచుకున్నాను. తలచుకున్నానో లేదో - నీవునాముందు ప్రత్యక్ష మైనావు. నాజన్మ సఫలమయింది. నామనోరథాలు ఈడేరాయి. వాసుదేవా! వ్యాస మునీంద్రుడు వచ్చి అశ్వమేధయాగం చెయ్యమని చెప్పాడు. సరేనని ఒప్పుకున్నాను. సమస్త కర్మలకూ కర్తవూ భోక్తవూనీవే కాబట్టి ఈ అశ్వమేధ యాగం నిర్వహించే భారం నీదేనయ్యా!" - అన్నాడు. అందుకు కృష్ణుడు-"ధర్మరాజా! నీవుతలపెట్టిన కార్యం కాకపోదు ధీరులకు అసాధ్యం ఏదీలేదు. నీ కోరికతప్పక నెరవేరుతుంది" - అని పలికి భీమసేనునివంక చూచాడు.

బావామరదుల సరసాలు

అలా భీమసేనునివంకచూచి ముసిముసి నవ్వులు నవ్వుతూ, అతని గుణాలను ప్రస్తావిస్తూ ఇలా అన్నాడు శ్రీకృష్ణుడు - "భీమసేనా! నీబుద్ధి చూడబోతే మందం. నీతిండి చూడబోతే అంతులేనితిండి. నీ పొట్ట చూద్దామా రోజు రోజుకు రెట్టింపు అవుతున్నది. నీవు రాక్షసి రతుడవు. నీమాటలా దురుసు- నీవంటివాళ్ళు మంత్రిగా ఉంటే కార్యాలు కాకుండా ఉంటాయా బావా? అంగహీనుడూ, ఇల్లటపు టల్లుడూ, వదరుబోతూ, స్త్రీ లోలుడూ, మరుగుజ్జువాడూ, చెవిటి వాడూ, పిరికివాడూ, మూగఅయినవాడూ, వెర్రెత్తినవాడూ, కాముకుడై ఆడదానికి వశమై యున్నవాడూ, దయలేని వాడూ, ముక్కోపి, అజాగ్రత్తగా ఉండే వాడూ, మదించిన వాడూ మంత్రిగా ఉండ తగరని పెద్దలు చెపుతారు. ఇలాంటి వాళ్ళు మంత్రిగా ఉంటే కార్యాలు చెడకమానవు. నీవా బావా! బాహుబల గర్వంతో కార్య పద్ధతులు ఎరగని వాడవు. హిడింబాసురుడు, బకాసురుడు, జరాసంధుడు-మొదలయిన వాళ్ళను చంపినట్లు అందరినీ సులభంగా చంపుతానని అనుకోకు. సత్య సంధులూ, మహాబలవంతులూ, దానశీలురూ, జయించ సాధ్యం కాని వారూ అయిన రాజులు అనేక మంది లోకంలో ఉన్నారు. ఆనాడు ప్రొద్దు కూకకముందే సైంధవుణ్ణి చంపుతానని అర్జునుడు చేసిన ప్రతిజ్ఞవల్ల అందరం అడ్డమైన పాట్లూ పడవలసి వచ్చింది. ఇప్పుడు నీవు అంత కంటె సాహసమైన ప్రతిజ్ఞ చేశావు. ఇది ఎలా నెరవేరుతుంది? యజ్ఞాశ్వం నిరాఘాటంగా దశదిశలూ సంచరించేటప్పుడు శూరులయిన రాజులు, దేవతలు, గంధర్వులు మొదలయిన వారంతా ఎన్నో అంతరాయాలు కలిగిస్తారు. పూర్వం శ్రీరామ చంద్రుడు అశ్వమేధ యాగం చేసినప్పుడు- హనుమంతుని అశ్వరక్షకునిగా పంపాడు. గుర్రం తిరుగుతూ తిరుగుతూ ఉండగా శక్తిమతి అనే పట్టణంలో సురథుడనే మహాపరాక్రమశాలి, గుర్రాన్ని, కట్టి వేశాడు. అశ్వరక్షకుడు ఆంజనేయుల వారినీ కట్టి పడేశాడు. అప్పుడు శ్రీరామ చంద్రమూర్తి స్వయంగా వెళ్ళి గుర్రాన్ని మళ్ళించుకుని రావలసి వచ్చింది. కాబట్టి నీవు. సహాయంగా అర్జునుణ్ణి వెంట తీసుకుని వెళ్ళడం అవసరం..."

కృష్ణుడిలా భీమసేనుణ్ణి రెచ్చగొట్టి అతని కోపాన్ని. పౌరుషాన్ని వృద్ధి పొందించాలని చూచాడు భీముడిచేత ఏదైనా ఘనకార్యం సాధించవలసి వచ్చినప్పుడల్లా కృష్ణుడిలాగే చేస్తుంటాడు. అలాచేస్తేకాని భీముడి తేజస్సూ, పరాక్రమం వృద్ధికాదు. వాయునందనుడు హనుమంతుడివలెనే భీమసేనుడు మహాబల వంతుడు. తన పరాక్రమాలను గురించి ఎవరైనా తక్కువ చేసి చెప్పినప్పుడూ, తనను ఎగతాళి చేసినప్పుడూ భీమసేనుడి బలం ఎన్నోరెట్లు పెరిగిపోతుంది. అప్పుడ తను ఒళ్ళుతెలీకుండా లోకంలో ఎంతటి పనిఅయినా చేసివేస్తాడు. భీముడికరోషం తెప్పించి అతని శౌర్యం అధికంచెయ్యాలనే తలంపుతోనే కృష్ణుడిప్పుడు అతన్ని ఎగతాళిచేస్తూ మాట్లాడాడు.

కృష్ణుడి మాటలువిని భీముడు - "బావా! నీవు చెప్పిన గుణాలన్నీ నాలో ఉన్నాయి. నిజమే. కాని అలాంటిగుణాలు లేని వాడవు నీవేకదూ? నీవు అతికాముకుడవని చెప్పడానికి వ్రేపల్లెలో గొల్లపడుచుల పాలిండ్లే సాక్ష్యం. ఇహ నీవు బహు భక్షకుడవని అనడానికి బ్రహ్మాండ భాండాలన్నీ ఇముడ్చుకున్న నీపొట్టయే పెద్ద సాక్ష్యం! నీవు ఆడవారికి వశుడవని చెప్పడానికి సత్యభామకోసం నీవు దేవలోకంనుండి పారిజాతం తేవడమే గొప్ప సాక్ష్యం. నీవుపొట్టివాడ వనడానికి బలిచక్రవర్తే సాక్ష్యం. ఇవన్నీ మరచిపోవడమే నీ మంద బుద్ధికి పెద్దసాక్ష్యం! వాసుదేవా! నీ మాయలు ఎవరు కనుక్కోగలరయ్యా! నీకృపవల్లనే నేను మునుపు పెద్దపెద్ద రాక్షసులను సంహరించాను. ఇప్పుడూనీకృపఉంటే యౌవనాశ్వుని జయించి యజ్ఞాశ్వాన్ని పట్టి తెస్తాను. నీదయ ఉండాలికాని ఇదిఒక పెద్ద కార్యమా బావా! నాహృదయంలో నీపాద పద్మాలు కుదురుగా కూర్చుంటేచాలు. కులగిరులు పెకలించివేస్తాను. భూమండలం పొడిపొడి చేస్తాను. దిగ్గజాల దంతాలు ఊడదన్నుతాను. గ్రహతారకలను జల్లున రాలుస్తాను. నాకీలోకంలో అసాధ్యం ఏమున్నది? చాతకపక్షులు మేఘాల రాకకోసం ఎదురు చూస్తున్నట్లు మేం నీరాకకోసం ఎదురు చూస్తున్నాం. గోవిందా! మమ్మల్ని దయతో రక్షించు. నీమీదభక్తిలేనివారిపై నీవే అగ్ని వర్షంకురిపిస్తావు. బురదలోదిగబడినగోవును, గోపాలుడు రక్షించినట్లు దుఃఖంలో మునిగిన మమ్ములను నీవు ఉద్ధరించు." - అని ఎన్నో విధాల వాసుదేవుని కీర్తించాడు.

భీముడి పలుకులు విని పరమానంద భరితుడైనాడు శ్రీకృష్ణుడు. విష్ణు భక్తి, వీర పరాక్రమం అతనిలో కుదురుగా పాదుకున్నాయని తెలుసుకున్నాడు. అతన్ని గట్టిగా ఆలింగనం చేసుకున్నాడు. "భీమసేనా! నీ మాటలు విని నాకెంతో ఆనందమయింది. నీవు ధన్యుడవు. మీరాజుకు దుఃఖం వద్దు. మీయజ్ఞం నిర్విఘ్నంగా నెరవేరుతుంది. దాయాదులను, గురుజనులను వధించిన పాతకం మిమ్ములను అంటదు. అశ్వమేధయాగం చేసి మాకు సమర్పించండి. యాగం నేనే కొనసాగిస్తాను. మీరు చింత పడవద్దు." - అనిచెప్పి శ్రీకృష్ణుడు పాండవులను ఊరడించాడు.

తరువాత భీముడు వాసుదేవునకు నమస్కరించాడు - "గోవిందా! అశ్వమేధ యాగంచేసి ఆ ఫలం నీకే ధారపోస్తాము. నీపాదాలపై పెట్టిన వస్తువు కోటి గుణితమై వృద్ధి పొందుతుంది. నేను గుర్రాన్ని తెచ్చేదాకా అర్జునుడు, ధర్మరాజులవారిని కనిపెట్టుకుని ఉంటాడు." - అన్నాడు.

అంతలో భోజనాలకు వేళఅయింది. ద్రౌపదివచ్చి - ప్రొద్దుపోయింది, భోజనాలకు లేవండి - అనిచెప్పింది. అప్పుడు వారందరూ జలకాలాడి, ధవళ వస్త్రాలు ధరించారు. ఇష్టాన్న భోజన పానీయాలతో తృప్తిపొంది, సుఖంగా నిద్రించారు.

తెల్లవారింది. ఉదయమే వందిమాగధులు స్తోత్రాలు చేస్తుండగా పాండు పుత్రులూ, వాసుదేవుడూ నిద్రమేల్కొన్నారు. కాలకృత్యాలు తీర్చుకున్నారు. స్నానసంధ్యాది విధులు నిర్వర్తించుకున్నారు. తరువాత అందరూ సభతీర్చి కూర్చున్నారు. భీమసేనుడు యుద్ధసన్నద్ధుడైవచ్చిధర్మరాజుకూ, శ్రీకృష్ణునకూ నమస్కరించాడు. తల్లి - కుంతీదేవికి ప్రణమిల్లి అనుజ్ఞ పొందాడు. అర్జునుణ్ణి కౌగలించుకుని, తానువచ్చేదాకా ధర్మరాజును కనిపెట్టుకుని యుండమనిచెప్పి, నకుల సహదేవులను ఆదరించాడు. తరువాత ద్రౌపదికి చెప్పివచ్చాడు. మరల కృష్ణుని పాదాలకు మ్రొక్కి అనుజ్ఞ తీసుకున్నాడు. ఉత్సాహంతో వృషకేతుడూ మేఘవర్ణుడూ వెంటరాగా భీమసేనుడు యజ్ఞాశ్వాన్ని పట్టి తేవడానికి భద్రావతికి పయనమై వెళ్ళాడు.-

అని జైమిని మహాముని చెప్పగా విని జనమేజయుడు సంతోష స్వాంతుడైనాడు.

(వశేషం)



పాంసురగయు * చిత్రకర్త్రి: శ్రీమతి పి. సీతాదేవి

మతము - శాస్త్రము

శ్రీ కల్లూరి చంద్రమౌళి

మూలశక్తి ఒక్కటియే. అది ఏకమే. (అది) భిన్నరూపుల విశ్వమున ప్రకటనమగుచుండును. కణములుగ వ్యక్తమగుచుండును. ద్వంద్వములుగ ప్రకటనము గాగనే వాని ప్రభావమునకు జగత్తుగురియై పరిభ్రమణమును బడయుచుండును. మానవుడు భౌతిక భోగములను, సాంఘికాభివృద్ధిని ఆకాంక్షించుచు అందు లీనమగుచున్నను, సహజముగ ఆధ్యాత్మిక వికాస సంపన్నుడుగావున భగవదనుభూతిని ఆకాంక్షించి బడయును. ఈ ద్వివిధములగు ఆకాంక్షలలో ఆధ్యాత్మిక ఆకాంక్షగలవారు స్వల్పసంఖ్యాకులుగ నుండవచ్చును. ఋషులుగ, యోగులుగ, పరమహంసలుగ కొలది మంది మాత్రమే వెలుగొందవచ్చు. కానిఅదియే జీవిత పరమావధి. దీనిని గుర్తెరింగి అనుభవమునకు దెచ్చుకొనినదే తడవుగ విశ్వకళ్యాణము, తత్కర్తయగు భగవంతుని సందర్శనము సమకూడును. "స్వయంభువు ఇంద్రియములను బాహ్యమునకు విక్షేపమొనర్చెను. ఈకారణము చేతనే మనముకలుగు బాహ్యవిషయములనే గాంతుము. అంతఃకరణమునందలి పరమాత్మను గాంచము. ముముక్షువులు వివేకసంపన్నులును నగు ఋషులు, యోగులు, భక్తులుమున్నగు మహాత్ములు తమ నయనములను బాహ్యవిషయములనుండి అంతఃకరణమునకు మరల్చి అందు దివ్యముగ వెలుగొందు ఆత్మను గాంతురు."

పరాంచిఖాని వ్యతృణాత్ స్వయంభూస్తస్మాత్
పరాఙ పశ్యతి నాన్తరాత్మన్.
కశ్చిత్ ధీరః ప్రత్యగాత్మన మైక్షదావృత్త
చక్షురమృతత్వ మిచ్ఛన్॥ కఠము II-IV-I

ఈసత్యమును విస్పష్టముగ నెఱింగి మానవుడు తన జీవితమును సరిదిద్దుకొననగును. తలచు క్షణికములుగ మెఱయు బాహ్యవిషయములకు మానవులు వశులై, భౌతికమునకు ఊడిగమొనర్చుచున్నారు. "శ్రేయము, ప్రేయము అను రెండు విభిన్న మార్గములుగలవు. సాధువులు శ్రేయోమార్గగాములు. భోగులు ప్రేయోమార్గగాములు. వీరు ఇంద్రియలోలురై పతనమగుచుందురు. కాబట్టి ప్రాజ్ఞులు శ్రేయోమార్గము నంగీకరించి అందు బాగుగ పయనింతురు. మందబుద్ధులు ప్రేయోమార్గమున పయనించుచు యోగక్షేమములకు సుదూరులగుదురు."

"అన్యచ్ఛ్రేయో ఽన్యదుతైవ ప్రేయస్తే ఉభేనానార్థే
పురుషం సినీతః। తయోః శ్రేయ ఆదదాన
స్యసాధు
భవతి, హీయతే ఽర్థాద్య ఉప్రేయో
వృణీతే" కఠము. I·2-2.

శ్రేయ ప్రేయములు తఱచు పరస్పరము సంఘర్షణమునకు గురియగుచుండును. ఈసంఘర్షణమును బాగుగ గమనించి వివేకముతో జీవితములను నిర్వహించువారు, నీతి, శీలములకు నిలయములుగ వర్థిల్లుదురు. వివేకవంతుడు శ్రేయోమార్గమును స్వీకరించి తన జీవిత పరమ లక్ష్యము దెసకు పయనించుచు సురక్షితముగ గమ్యస్థానమును జేరును. అందు శాశ్వత సుఖమును, ఆనందమును అనుభవించును. గ్రీకులు, రోమనులు పాశ్చాత్యులు భౌతిక శాస్త్రములకు, లౌకిక కళలకు ప్రాధాన్యము నొసంగిరి. 'ఇక భారతీయులో! తత్త్వశాస్త్రములను, మతమును వెలుగొందజేసి బ్రహ్మజ్ఞానమును, తదనుష్ఠానమును పాలించి తాదాత్మ్యమునొందిరి.' అనుటలో అతిశయోక్తి లేదు. పాశ్చాత్యులు గ్రీకులనుండి భౌతిక శాస్త్ర విజ్ఞానమును - అనగా బాహ్యవిషయ వికాసము నందించు విద్యలను బడసిరి. ఇంతమాత్రమున వారికి దేవాలయములు, చర్చీలు, మతగురువులు లేరని కాదు. అట్లే ప్రాచీనభారతీయమతము, వేదవిజ్ఞానమునందారితేరి భగవంతుని తదను

భూతినిగూర్చి అపారముగ కృషినిగావించి ఆధ్యాత్మిక తేజస్సుతో వెలుగొందినను భౌతిక శాస్త్రములు, కళలు - అందునను లలితకళలు మున్నగు సకలవిద్యలయందును అపారపాండిత్యానుభవములను గడించెను. ప్రపంచమునకు జ్ఞానభిక్షనిడి గురువుగ వెలుగొందెను. నిత్య జీవితావసరములగు అన్నపానాదుల నందించి విశ్వకళ్యాణమును, శాంతిని విదళించెను. ఈనగ్న సత్యమును ప్రపంచమునగల విజ్ఞులెల్లరును ఎఱింగిన విషయమే।

భౌతిక శాస్త్రజ్ఞులు అన్నిదేశముల యందును గలరు. అట్లే యోగులు, ఋషులు, సన్యాసులు మున్నగు మహాత్ములును సకల దేశముల యందునుగలరు. కానీ, భారత దేశము అట్టివారికి పుట్టినిల్లు. ఇందుఋషులు, అవతారులు అసంఖ్యాకులుగ వెలుగొందిరి. ప్రపంచమున అన్నిప్రాంతములందునను భోగులుగలరు. త్యాగులునూగలరు. నాస్తికు లున్నారు. ఆస్తికులునూ ఉన్నారు. కానీ సాముదాయకముగ నుడవ వలెనవిన పాశ్చాత్యులు భౌతికమున కంటిపెట్టుకొని భోగములకు వశులై జీవించుచున్నారు. ప్రాచ్యులు-ముఖ్యముగ భారతీయులు మతమునకు, త్యాగమునకు - సన్యాసమునకు తమ జీవితములను ముడుపుగట్టిరను విశ్వవిఖ్యాతిని గాంచిరి. మన మాతృభూమి సకల భౌతిక సంపదలకు సదనము. కర్మభూమి. రత్నగర్భ అని పేర్గాంచుటయేగాక ఆధ్యాత్మికమునకు, భగవంతునకు తన జీవిత సర్వస్వమును సమర్పించిన పుణ్యభూమి. భౌతిక శాస్త్రములను, కళలను ఆధ్యాత్మిక తత్వము వంకకు మఱల్చి భక్తితో భగవదారాధనమునకు సంపూర్ణముగ సమర్పించెను.

నేడును, పాశ్చాత్యులు భౌతిక వాదములకు వశులై, యంత్రమయ జీవితమును గడుపుచుండుటను గాంతుము. అట్టి వారికి భారత దేశము చిరకాలము దాస్యమొనర్చు దుస్థితి యేర్పడుటయు విచారకరము. అట్టి తరుణమున కొందరు భారతీయులు అంధులుగ పాశ్చాత్యుల ననుకరించుచూ తమ జీవితములను గడుపుచున్నను, భారతి తన నిజస్వరూపమగు ఆధ్యాత్మికమును విస్మరింప కుండుట చేతనే, నేడు స్వతంత్రదేశముగ వెలుగొంద జాలెను. సత్యాహింసల సాధనములతో స్వరాజ్యమును స్థాపించుకొన్నదీ దేశమేగదా! ఇట, దయానంద సరస్వతి, రామకృష్ణ పరమహంస, వివేకానందస్వామి, రామతీర్థస్వామి, అరవింద యోగి, గాంధి మహాత్ములు, మున్నగు ఆధ్యాత్మిక తేజోమూర్తులు అవతరించిరి. ఈ మహాత్ములు తమ దివ్యశక్తిని ప్రపంచము నందంతటను ప్రశాంతముగ ప్రసరింప చేసిరి. భారతి ప్రత్యేక విలక్షణమును-విశ్వసందేశమును ప్రతిభను ప్రదీపింపజేసిరి. ఇట్లు మన మాతృభూమి తన దివ్య సందేశమును, ఉద్దీపనా ప్రతిభను సర్వత్ర విదళించి పాశ్చాత్య లోకమును దిగ్భ్రమ మొనర్చెను. చకితము గావించెను. పాశ్చాత్యులను వారి యనుయాయులగు భారతీయులను పునరాలోచనములకు గడంగజేసెను. ఆధునిక కాలమున భౌతిక శాస్త్రములకు, మతమునకు సంఘర్షణము సముద్భవిల్లుచున్నది. 'ఇది పరస్పర వైరుధ్యములు' అని బాహాటముగ చాటుచున్న వారును, నేడు లేకపోలేదు. వీరిది సంకుచిత బుద్ధి. మనోదౌర్బల్య ఫలితము. ఇట్టివారియందు కేవలము యుక్తివాదములకు వివాదపూరిత. మానసిక బాహ్య వికాసమునే గాంతుముగాని హృదయవికాసమునుగానీఆత్మానుభూతినిగానీ గాంచము. క్రైస్తవ దేశము లందలి పెక్కురు భౌతికశాస్త్రవేత్తలు బైబిలు ప్రబోధించు పెక్కు విషయములను ఆమోదింపజాలక క్రైస్తవ మతమునకు ఎదురు తిరిగి పోరాటమును పొలయించిరి. బైబులు ప్రబోధించు శూన్య వాదము అనగా అసత్తునుండి సత్తు పుట్టిన దను వాదము. డార్విన్ లేవనెత్తిన పరిణామ వాదమునకు వ్యతిరేకము, కాబట్టి క్రైస్తవ ఛాదరీలు శాస్త్రజ్ఞులపై నెదురు తిరిగిరి. భౌతిక శాస్త్రజ్ఞులును మతముపై దండెత్త సాగిరి. "మతము సహేతుకముగాదు. శాస్త్రబద్ధము గాదు. అది మూఢ విశ్వాసములకు నిలయము.

అపోహల నల్లుచుండును" అనిభావించి, మతమును తిరస్కరించిరి. అట్లే, మతాచార్యులును, క్రమక్రమముగ శాస్త్రవిజ్ఞానమును తృణీకరింపసాగిరి. కాని వాస్తవమునకు యివి పరస్పర వైరుధ్యములుగావు. విశాలదృక్పథగాములకు సమన్వనీయములు. శాస్త్రనియమములను మతముగర్హించదు. ఇవిఆధ్యాత్మికమునకు నిమ్నస్థితి యందుగల విషయములను వివరించును. మతము హేతువును - మనోబద్ధనియములను తనయందు లీనమొనర్చుకొని వానికతీతముగ సదా వెలుగొందుచుండును. మతము నిత్యసత్యము. అది సనాతనము. వేదములు భౌతికాధ్యాత్మికములను సమన్వయించును. ద్వంద్వములను సమీకరించును. సర్వమును సమదృష్టినిడి నిత్యసత్యముగ వెలుగొందు భగవంతుని అనుభవమునకు దెచ్చును. భౌతిక శాస్త్రములను హేతువును వేదములు నిరాకరింపవు. అవి వానికుచితస్థానము నొసంగును. అంతమున ఆధ్యాత్మిక సత్యములో వానిని లీనమొనర్చును. బాహ్య ప్రకృతిని అంతః ప్రకృతితో సమన్వయించి వీని కతీతముగా వెలుగొందు భగవంతుని ప్రత్యక్షమొనర్చును.

"భౌతిక శాస్త్రములకు లౌకిక విషయములకు ఉచితస్థాన మొసంగవలెను. అవి ఆధ్యాత్మికము వంకకు మరలి నప్పుడే వానికి యథార్థమగు విలువలు సముచిత స్థానములు లభించును. అపుడే యివి మానవ వికాసమునకు దోహదమొసంగును." అనిదయానందసరస్వతి, వివేకానందస్వామి, అరవిందయోగి మున్నగు మహాత్ములు, ఆధ్యాత్మిక ప్రవక్తలు నిత్యసత్యమును విస్పష్టముగ, గంభీరముగ, ప్రశాంతముగ ప్రబోధనమును గావించిరి. ఇంతియేగాదు. ప్రకృతిశాస్త్రతత్వవేత్తయు ప్రాజ్ఞులును నగు జగదీశచంద్రబోసు తన ప్రయోగములచే భౌతికశాస్త్రమునకును, మతమునకును గల సన్నిహితత్వమును సక్రమముగ నిరూపించెను. "భౌతిక శాస్త్ర విధానములకు, ఆధ్యాత్మిక దివ్యదృక్పథములకు బోసు మహాశయులు వివాహమును గావించెను. ఇట్టి దాంపత్యము నవీన ప్రపంచమునకు మెంతయు వాంఛనీయము. శాస్త్ర విజ్ఞానమును, రాజకీయవేత్తలు దుర్వినియోగ మొనర్చుటను గాంచి శాస్త్రజ్ఞులను భీతిల్లుచున్నారు."

—నెహ్రూ పండితుడు. హిందుస్థాన్ స్టాండర్డు, 1-12-58.

ఇందు కొంత సత్యములేక పోలేదు. కాని భౌతిక శాస్త్రజ్ఞులందునను పెక్కురు యీదుర్వినియోగమునకు తోడ్పడుచుండుట విషాదకరము, గర్హనీయము.

నేటి శాస్త్రజ్ఞులు, రాజకీయవేత్తలు మనస్ఫూర్తిగ ప్రపంచకళ్యాణమును, విశ్వశాంతిని వాంఛించుచో ప్రజాభ్యుదయము నాకాంక్షించుచో ఆధ్యాత్మిక తత్వమును ఆమోదించి అనుష్ఠింపక తప్పదు. ఆధ్యాత్మికము మాత్రమే ప్రపంచమున తన శీతలకాంతుల ప్రశాంతముగ ప్రసరింప జేయజాలు తారకమంత్రము. విశ్వమును దివ్యమయ కాంతులతో ప్రదీపింపజేయజాలు దివ్యౌషధము. మతము - సనాతన ధర్మము ఈవిశ్వమును గూర్చి విస్పష్టముగ వివరించును. దాని నిజస్వరూపమును ప్రదర్శించును. శాస్త్రజ్ఞానమును, హేతువాదమును క్రమస్థానము నందిడును. వీని కతీతముగ వెలుగొందు ఆధ్యాత్మిక తేజోమయమగు బ్రహ్మమును ప్రకటించి ప్రత్యక్ష మొనర్చు పరమసాధనముగ ప్రదీపించును. కాబట్టి ఆధ్యాత్మికము ప్రజ్ఞానవంతము. అది మనోబద్ధ. శాస్త్ర విజ్ఞానమును జూపెట్టుటయేగాక దీని కతీతముగ వెలుగొందు ఉద్దీపనము నందించి శాస్త్రవిజ్ఞానమునకన్న విశిష్టముగ పరముగ ప్రదీపించు చుండును. భౌతిక శాస్త్రమున కన్న మిన్నగ విశిష్టముగ వెలుగొందుచుండును. వివేకానందస్వామి భౌతిక శాస్త్రము లందలి యథార్థతత్వమును నిర్వచించెను. దానిని మతతత్వము వంకకు మరల్చి ఆధ్యాత్మికముతో అను సంధానించెను. మానవుని జీవితపరమార్థమును విస్పష్టముగ వివరించెను. భౌతిక శాస్త్రముగాని మతముగాని కేవలముసిద్ధాంతములను

ఆదర్శములను జూపెట్టినంత మాత్రమున ప్రయోజనముండదు. వానిని అనుభవమునకు దెచ్చుకొని అనుష్ఠించినపుడే, అనుభూతి నందినపుడే అవి మానవాభివృద్ధికిని దైవ ప్రాప్తికిని సుసాధనములుగ శోభిల్లును. ఉదకము, 'ఉదజని, ప్రాణవాయువుల సంయోగము' అనిబేర్కొనిన జాలదు. దానిని నిరూపించుటకు వలయు సాధనములను సమకూర్చుకొని ప్రయోగములను గావించినపుడే ఉదకమున రెండుపాళ్ళు ఉదజని ఒకపాలు ప్రాణవాయువుగలవను విభజీకరణవిధానము నెఱుంగుదుము. అట్లే రెండుపాళ్ళు ఉదజనిని ఒక పాలు ప్రాణవాయువుతో సంయోగ మొనర్చినచో స్వచ్ఛమగు జలమేర్పడు సమీకరణమునుగాంతుము.

మతము ఆస్తిక తత్వమును నెలకొల్పును. భగవంతుడు కలడని సిద్ధాంతీకరించును. భగవంతుని ప్రత్యక్షమొనర్చుకొనుటకు దోడ్పడు సాధన సంపత్తిని సమకూర్చును. భక్తి శ్రద్ధలతో, తదేక నిష్ఠతో క్రమక్రమముగ నిత్యము కృషినిగావించుచుండును. అంతమున భగవంతుని ప్రత్యక్షమొనర్చుకొనును. భగవంతుడు సర్వాంతర్యామి. కాబట్టి అంతటను, సర్వమునందును భగవంతునేగాంతుము. 'మానవుడే మాధవుడు మాధవుడే మానవుడు' అను లోకోక్తియందలి పరమార్థ మిదియే. ఈసత్యమును నిత్యానుష్ఠానమునందిడి అనుభవమును-అనుభూతికిదెచ్చుకొనుటయందే యథార్థమగు మతముగలదు. అదియే సత్యము, నిత్యము, ఆనందము. తన గురువర్యుని ప్రసాదముచే వివేకానందస్వామి భగవదనుభూతినిబడసెను. 'భౌతిక శాస్త్రనియమములు మతమును త్రోసిపుచ్చవు. హేతువును నిరాకరింపవు. భౌతికమునలీనమై తదతీతముగ వెలుగొందు ఆధ్యాత్మిక జ్యోతి - అఖండ సచ్చిదానందము భగవంతుడు' అని వివేకానందస్వామి సత్య ప్రపంచమునకును, సహేతుకముగ సాక్షీభూతముగ సమర్థముగ ఎలుగెత్తిచాటెను. 'భగవంతునిగూర్చిన ఉత్కృష్ట భావప్రకటనములు వేదములందుగలవు. అంతియేగాదు. భౌతికశాస్త్రనియమములు, ప్రకృతి నియమములు అందు విస్పష్టముగ వివరింపబడినవి. బాహ్యాంతరముల - భౌతిక, ఆధ్యాత్మికముల, మానసిక తత్వశాస్త్రముల సమీకరణము, సమన్వయము గావింపబడి దివ్యసత్యములుగ ప్రకాశించుచున్నవి.' అని దయానంద సరస్వతి నిర్భయముగ ఎలుగెత్తిచాటెను. పామరులకు గూడ సుబోధకములగునట్లు నిర్వచనమును గావించెను. భారతి చరిత్రకందని అతిప్రాచీనకాలమునుండియు భౌతిక, ఆధ్యాత్మిక వికాసములకును, జ్ఞాన ప్రజ్ఞానములకును నిలయముగా వెలుగొందుచున్నది. నిశ్చలమును భాసమానమునగు ధ్రువతారగ సదా ప్రకాశించుచునేయున్నది.

వాసన, హేతువు, ఉద్దీపనము అనునవి పరస్పరము వైరుధ్యములుగావు. సోపానముల వలె పరస్పరము సహకరించుచుండును. 'అణగియున్న అనుభవఫలితవాసనాజ్ఞానము నుండి హేతువు వంకకు పయనించుచు ఉద్దీపనమును బడయుదుము' అని భారతీయులు స్థిర నిర్ణయముగావించిరి. అట్లే 'ద్వైతాద్వైత, విశిష్టాద్వైతములు పరస్పర సంబద్ధములు. సమీకరణ యోగ్యములు. క్రమ సోపానములు. మానవుడు క్రమముగా అధిగమించి భగవదనుభూతి నందుకొనుటకు దోహదము నొసగు సుసాధనములు' అని సనాతనధర్మము సదా చాటుచున్నది. ఇది హిందూమతము నందలి విశిష్టత.

కాబట్టికొందరు పాశ్చాత్యులు భావించినట్లు వేదములు ఊహాగానములుగావు. మూఢవిశ్వాసములుగావు. అనాగరికులఅభూతకల్పనములు అంతకన్నను గావు. అందలిమంత్రములు నిత్యసత్యములు. ఋషులు కఠదీర తపస్సుచేదివ్యానుభూతులను బడసి తాము బ్రహ్మమును ప్రత్యక్షముగ గాంచుచు పరులకు జూపెట్టిరి. ప్రపంచమునకు శాంతిదూతలుగ కళ్యాణదాతలుగ వెలుగొందిరి. రాజయోగము పతంజలి మహర్షికృతము. ఆమహర్షి, మనస్సును

శాస్త్రసమ్మతముగ విభజీకరించి సహేతుకముగ నిర్వచించి తదతీతములగు ఆధ్యాత్మిక సత్యములను సరళముగ, సులభమార్గములుగ జూపెట్టెను. ముక్తిని కరతలామలక మొనరించు సమార్థ్యవస్తువు, తేజోమయమగు దివ్యత్వమును చక్కగ జూపెట్టెను. కపిలమహర్షి సాంఖ్య దర్శనమునకు కర్త. ఆయన సృష్టి విధానమును, ప్రకృతిపురుషుల సంబంధమును, పరిణామ వికాసవాదములను సహేతుకముగ సమన్వయించి కార్య కారణముల అవినాభావమును ధృవపరచెను. 'మనముగాంచు యీ విశ్వమునేగాక సర్వలోకములను, బాహ్య విషయములనుండి గాక అంతఃకరణమునుండియే నిర్వచనమొనర్చి సుస్థిర నిర్ణయమునుగావింప నగును' అని వేదములు విస్పష్టముగ నిరూపించుచున్నవి. వ్యక్తి తన జీవితమున భుక్తి నుండి ముక్తిని బడయగలడు. సాంఘికముగ శాంతిని, కళ్యాణమును సమకూర్చగలడు. అను సిద్ధాంతములను వేదములు ప్రబోధించుచున్నవి. కాని అవి జూపుమార్గముల పయనించుటలో స్వార్థముగాని, అహంభావముగాని, వక్రతగాని లేనిచో ప్రతివారును గమ్యస్థానమగు నిత్యసత్యమును - భగవంతుని జేరగలరు. అవి వివేకవంతములగు ప్రజ్ఞాన పూరిత నిర్ణయములను ప్రసాదించుచున్నవి. మతములు భౌతిక ప్రయోజనములపై నాధారపడవు. తాత్కాలికములగు లౌకికలాభములకు వినియోగపడక పోవచ్చును. కానీ మతము మానవులకు అందించు సేవలు అమూల్యములు. అవి సదా దివ్యములుగ దీపించుచుండును.

"యథార్థమగు మతము కట్టుకథలకు మిన్నగ ఉన్నతస్థాయి వెలుగొందు శిఖరాగ్రము. అది పిట్టకథలపైనను గాథలపైనను ఆధారపడదు. నేటి భౌతికశాస్త్రజ్ఞుల లెక్కనిర్ణయములు మతపునాదులను బలపరచుచున్నవి. విశ్వమంతయునొక్కటియే అని నేడు శాస్త్రజ్ఞులు నిర్వచించుచున్నారు. బ్రహ్మజ్ఞానులు, సత్తుఅని నిర్ణయించిన దానినే పదార్థవిజ్ఞానశాస్త్రజ్ఞులు పదార్థముఅని స్థూలదృష్టితో పేర్కొనుచున్నారు. ఈ రెండింటికిని వివాదములేదు. రెండును ఏకమే! అణువు అవిభజనీయము. అచింత్యము. అయినను విశ్వమునగల సర్వశక్తులు కేంద్రీకరింపబడిన శక్తిభాండారముగానున్నది. వేదాంతుల ఆత్మయనునదియు పుటము బెట్టబడి పవిత్రీకరింపబడిన దివ్యశక్తియేగదా! వేదాంతులును, భౌతిక శాస్త్రజ్ఞులును స్వయంభవ కారణమునే జూపెట్టుదురు. అందే సర్వకారణములును విలీనమైయున్నవి. భౌతిక శాస్త్రములు బాహ్య విషయములను కనిపెట్టును. అట్టి విషయ పుష్పములను మాలగ గ్రథించు సూత్రమే బ్రహ్మజ్ఞానము. ఆ మాలయే మతము." - వివేకానందస్వామి.

"సిద్ధాంతము లెంతనిర్మలముగ నున్నను తత్వశాస్త్రము లెంత దివ్యముగ నిరూపింపబడినను అవి గ్రంథస్థములుగ సిద్ధాంతములుగ నున్నంతదనుకను మతమని నేను పిలువను. నయనము ముఖము నందుగలదు గాని వెన్నునలేదు. ముందుకుసాగుము. మీమతమునిసగర్వముగ చెప్పుకొనుదాని నసుష్ఠించుడు. మిమ్ము భగవంతుడు ఆశీర్వదించునుగాక." వివేకానందస్వామి

కాబట్టి మతమనకేవలము భౌతికశాస్త్రనియమములుగాదు. మనోబద్ధ హేతువాదమును గాదు. యుక్తివాదమంతకన్నను గాదు. వీనినన్నిటిని యుచితస్థానమునందిడి తనయందు జీర్ణింపజేసుకొని వాని కతీతముగ, దివ్యముగ వెలుగొందునది మతము. మతమన ఉద్దీపనము, బ్రహ్మానుభూతి. ఆత్మప్రత్యక్షత. మతము గమ్య స్థానమునకు హిమాలయ శిఖరాగ్రమగు గౌరిశంకరశిఖరమునకుగొంపోయి అందు ప్రశాంతముగ సుస్థిరముగ నిలుపబెట్టి అఖండ సచ్చిదానందముగ వెలుగొందజేయు దివ్యశక్తి.

"మానవజాతి పరిణతి వికాసములను రూపొందించిన, రూపొందించుచున్న శక్తులన్నిటిలో ఉత్కృష్టభావమును శక్తిసంపన్నమును నగు దాని ప్రకటనమేమతము. సర్వసాంఘిక సంస్థలకును ఎక్కడనో మోక్షతావున ఆయువు పట్టుగనున్న విచిత్రశక్తి

మతమే. వ్యక్తులను సమీకరించి సమష్టిగ సమన్వయపరచి ఏకముఖమునకు దెచ్చు వశీకరణ మంత్రము మతశక్తినుండియే యుద్భవిల్లును. 'మతము ఈ విశ్వమునకు జెందినదిగాదు. మనకు అసాధ్యము. ఇది భౌతికశాస్త్రనియమములను వాంఛింపదు, మూఢవిశ్వాసములపై నాధారపడును.' అనుసంకుచితభావుల వాదములకు యథార్థమగుమతము గొడ్డలిపెట్టు. 'భగవదన్వేషణార్థము ఎటకేగుదువు? పేదలు అనాథలు, దుర్బలులు, అందఱును భగవంతులు కారా? వారిని ప్రథమమునయేల ఆరాధింపవు? ప్రియమగు నాబిడ్డా! భగవంతునినేను విశ్వసింతును, మానవుని విశ్వసింతును. పరుల శ్రేయమునకు నరకము కేగుటకైనను వెనుకంజవేయను.' వివేకానందస్వామి.

భారతదేశ పతనమునకు మతము కారణముగాదు. నిత్యజీవితమునకు మతమును దూరమొనర్చుటవలననే భారతదేశము పతనమైనది మతము ననుష్ఠింపక, అనుభూతికిదెచ్చుకొనక స్పర్ధలకు అలజడులకు, వశమగుటయందే జాతిపతనముగలదు. మానవుని పతనమునకు ప్రపంచపతనమునకు సమీపమార్గమిదియే. ఉన్నతములగు వైదిక సత్యములను, సత్యంవద, ధర్మంచర; సర్వంఖల్విదం బ్రహ్మ- అనువేదప్రబోధములను గంభీరముగ బల్కుదుము. కానీ, చేతలలో 'నన్ను ముట్టకుము నామాలకాకి' 'నీవు పతితుడవు అంటరానివాడవు' అని యీ నడింపు పలుకులతో భగవత్స్వరూపులను నిరాకరింతుము ఇట్టి చర్య భారతజాతిని పరులకు బానిసలుగ గావించెను. వారి నిరాదరణమును బడయుటకుదారిదీసెను. 'భగవంతుడు సర్వత్రగలడు, అనుచుదుర్బలులపై-అమాయకులపై దండమును ఝళిపించుట మతముగాదు. మాటలకు, చేతలకుగల యీ విభేదమే ఆదర్శములకు, అనుష్ఠానమునకుగల యీ అంతరమే మానవులను స్వార్థపరులుగ, భోగలాలసతృష్ణాపరులుగ, పశుతుల్యులుగ గావించుచున్నది. మతమునకును, శాస్త్రమునకును సంబంధమును బాపెట్టు విషయములు కొన్నిగలవు. అంతవరకు అవి పరస్పరము సహకరించుకొనుచు బలపడవచ్చును. దూరదృష్టిలేని విమర్శనములు, అహంకారపూరిత సంకుచితభావములు మతమునకుగాని, శాస్త్రమునకుగాని అఘాతములే. భౌతికవిషయములను మతము నిరాకరింపదు. అది వానియథా స్థానమునందిడి, అనుభవించుచు, ఆధ్యాత్మికవికాసము నందింపజేయునదిగనుండును. భౌతికశాస్త్రములును, ఆధ్యాత్మికమును నిరాకరించుట శ్రేయోదాయకముగాదు. ఆధ్యాత్మిక తత్వముల ఉన్నత శిఖరమువంకకు తన నియమములను మరల్చుటయందే భౌతిక శాస్త్రమునకు మూల్యమును ప్రయోజనమును చేకూరును. భౌతికశాస్త్రవిజ్ఞానము హేతువునుండి ఉద్దీపనము వంకకు మనస్సునుండి హృదయమువంకకు తన యాత్రను సాగించినపుడే దానికి విలువ జేకూరును. అట్లు కానినాడు అది జీవిత పతనమునకు మానవ వినాశనమునకు దారిదీయు పెనుభూతముగ వర్ధిల్లును. అణుశక్తి భౌతికము. 'దానిని మారణాస్త్రములకు వినియోగింతుము. ప్రపంచమును భస్మ మొనర్తుము' అనిపల్కుట శాస్త్రజ్ఞులకు ధర్మముగాదు రాజకీయవేత్తలకు వశులై, వారి అధికారమునకో, ధనమునకో దాసులైనదే తడవుగ భౌతికశాస్త్రజ్ఞులును తమ విజ్ఞానమును దుర్వినియోగ మొనర్చుచు విశ్వమును కల్లోలపరతురు. యుద్ధములకు హింసాకాండకు లోబడి పశుతుల్యులుగ సంచరింతురు. అట్లే పవిత్ర ఆధ్యాత్మిక దివ్యశక్తిని - భగవంతుని గీర్తించు మతమును సంకుచిత బుద్ధితో, దురహంకారముగ తమ ప్రతిష్ఠకో, స్వప్రయోజనమునకో, దుర్వినియోగమొనర్చు మతవేత్తలును వారు ప్రబోధించు మతభావములును, ప్రపంచమును నరకకూపముగ మార్చును. అశాంతిని, అల్లకల్లోలమును రేకెత్తించి. మానవపతనమును జేకూర్చును. భౌతికశాస్త్రములుగాని, కళలుగాని తత్సంబంధమగు సర్వవిద్యలును, ఆధ్యాత్మికదివ్యశక్తి సంపన్నమగు మతమువంకకు ప్రవహించుచు అందులీనము గావలెను. మతములును, భౌతిక

మునకు ఉచితవిలువ నొసంగి, సక్రమ విధానమున తమవంకకు ఆకర్షించుకొనవలెను. అపుడు మతము, శాస్త్రము సమన్వయమును బడసి ఏకత్వమునందుకొనును. మానవుని పరమలక్ష్యమిదియేనని నిర్ణయముగ, నిరాటంకముగ వేదము సదాఎలుగెత్తి చాటుచున్నది. నేటి భౌతికశాస్త్రజ్ఞులు బాహ్యప్రకృతి విషయములను గనిపెట్టుటయేగాక సూక్ష్మములగు అంతఃప్రకృతి విషయములను కనుగొను దెసకు పయనించుచున్నారు. శాస్త్రజ్ఞులలో కొలదిమంది ఉన్నతదృక్పథగాములై మనస్సున కతీతములగు విషయములనెఱుకకు దెచ్చుకొనువిజ్ఞులుగ వెలుగొందుచున్నారు ఇది శుభదాయకము. జగదీశ చంద్రబోసు వృక్షశాస్త్రమునందు తనకుగల విజ్ఞానమును ఆధ్యాత్మిక తత్త్వదృష్టితో సమీక్షించి 'ప్రాణశక్తి యేకము. అది ఒకేశక్తియైనను భిన్నరూపుల దాల్చును. అను వేదప్రబోధము నంగీకరించి వృక్షములయందునను స్పర్శ, ఆవేదనము, నిద్ర, భయమున్నగు స్థితులుగలవని ప్రయోగముచే నిర్ణయములను గావించి నిరూపించెను. మనస్సు, ప్రాణము మనముగాంచు ఈభౌతిక విశ్వమునకు బాహ్యముగగలవు. అని సర్ ఆలివర్ లాడ్జి సక్రమవిధానములతో నిరూపించెను. అంతియేగాదు. భూతములుగలవను వారి వాదమును శాస్త్రసమ్మతముగ పరిశీలించి ఉనికిగలవను విశ్వాసమును నిరూపించెను. "స్థూలదృష్టికి జీవులు మరణించుచున్ననూ ప్రాణము నశింపదు. అను నిర్ణయము శాస్త్రసమ్మతము. ఇది సిద్ధాంతరీత్యా శాస్త్ర సమ్మతము" అని బెర్ట్రండ్ రస్సెల్ విశ్వసించెను. దీనిని నిరాకరింపజాలని శాస్త్ర సమ్మత సాక్ష్యము విపులముగ గలదని ధృవపరచెను.

భౌతిక శాస్త్రములకు, తత్త్వశాస్త్రములకు, మతమునకుగల వివాదములు అల్పజ్ఞులసంకుచితదృష్టి ఫలితములు. అజ్ఞానుల దురహంకారపూరిత దుష్ప్రచారములు. మానవజీవిత లక్ష్యమగు పరమార్థమునకు యివి క్రమ సోపానములుగ వర్తిల్లవలెను. "విశ్వమొక పెద్దయంత్రముగగాక మహాభావముగ గన్పించుచున్నది." అని సర్ జేమ్సునుడివెను. "అనుభూతికి దెచ్చుకొనిన సత్యము విలువను ప్రత్యేకతనుగల ఉద్దీపనమునందించును అందు ప్రేమ, సౌందర్యము, ఆనందము లాటికి సలాడుచు. భగవద్దర్శన సూచకములుగ దీపిల్లును. ఇట్టిప్రజ్ఞాన సాధనములు భౌతికశాస్త్రమునకు లేవు. కాబట్టి, అది వీనిని నిరాకరించి గణితము, అంకగణితము, మున్నగు గుణకారములను గావింప దొడంగెను."

ఆల్డస్ హక్స్లే. సాధనసాధ్యములు. Ends & Means "ప్రకృతికి, మానవునకు సంబంధముగల సమస్యలు పరిష్కరింపదగినంతవరకు భౌతిక శాస్త్ర సాధనములతో పరిష్కరింపవచ్చును. కానీ, మానవుడెదుర్కొనవలసిన సమస్యలు యివిమాత్రమేగావు. ఇతర సమస్యలకు యితరమార్గములు ఆవశ్యకములు. మనవాంఛల నీడేర్చుకొనుటకు ప్రకృతిని లాలింపవచ్చును. కానీ దానిపై మనము పెత్తనమును చెలాయింపజాలము. లేశమాత్రమైనను దానినియమములను మార్చుకొనునట్లు చేయజాలము."

'New Hopes for a Changing world.' Bertrand Russel. ప్రాచీనభారతి భౌతిక శాస్త్రజ్ఞులకు, కళావేత్తలకు, భౌతికవాదులకు నుచితస్థానము నొసంగినది. ఋషులు, యోగులు, దార్శనికులు, మున్నగు మహాత్ములు వీరిని సహనముతో ఉచితరీతిని సత్కరించిరి కానీ, యివి బాలురవాదములు, వీని కతీతముగ ఉన్నత సత్యముగలదు. అని నిర్ణయించుకొని ఆ సత్యమువంకకు పయనించిరి. వివిధదృక్పథములతో మానవుడు గావించు కృషి ఆధ్యాత్మిక రంగమునుండియే వెలువడును. ఇందలి ప్రావీణ్యత భగవంతుని జేరుటకు దోహదమొనగును. చూడుడు! నృత్యగానములకు, నటరాజు ప్రతినిధి. వానినుండియే వ్యాకరణము ఆవిష్కరింపబడెను. సరస్వతి సర్వవిజ్ఞానమునకును మూర్తి. సర్వకళలకు

సాంకేతిక వి నమునకు విశ్వకర్మ చిహ్నము. కుమారస్వామి యుద్ధదేవుడు.

'భౌతికశాస్త్రజ్ఞానమును ఇంద్రియములకు, మనస్సునకు, అతీతముగ నున్న ఉద్దీపనముగ, దివ్యజ్ఞానముగ మార్చుటయందే విద్యయొక్క పరమావధిగలదు.' అని హిందువులు స్థిర నిర్ణయమును గావించిరి. మనోబద్ధజ్ఞానము, ఉద్దీపనముతో సమన్వయమునందినపుడే ఉచ్య ఫలములు లభించును. అట్లు కానినాడు జ్ఞానము దుర్వినియోగమునకు నిలయమై వ్యక్తిని, సంఘమును వక్రమార్గముల బట్టించి కలుషీకృతమొనర్చును. ఆపదలకు, అశాంతికి, ఆలవాలముగగావించును. హేతువునకు, భౌతిక శాస్త్రములకు ఉద్దీపనము ఉచితస్థానము నొసంగవలెను. క్రింది మట్టమున కొన్ని నిర్ణీత స్థానములు వానికిగలవని గమనింపవలెను. ఆధ్యాత్మికము నిరంకుశత్వమును వహించి నపుడు స్పర్ధలు, సంఘర్షణము ఏర్పడును. తానే సర్వస్వముఅను అహంభావమును భౌతికవాదము ప్రజ్వలింప జేసినదే తడవుగ, నాస్తికత ప్రబలును. భోగము, తృష్ణ తాండవించును. విశ్వము అల్లకల్లోల వాతావరణమున కొట్టుమిట్టాడును. ఈవిధముగ సంక్షోభము సంవర్ధిల్లును. చరిత్రకందని అతి ప్రాచీన కాలము నుండియు భారతదేశము ఆధ్యాత్మికమునకు ఉన్నతస్థానము నొసగెను. భగవదనుభూతికి బాటలను నిర్మించెను. లౌకిక విషయములకు అర్హస్థానమునిడి, ఆధ్యాత్మికముతో సమీకరించి విశ్వకళ్యాణమును జేకూర్చుశాంతి సందేశమునందించెను. కానీ, దురదృష్టవశమున నేడు పాశ్చాత్యదేశములనుండి కోకొల్లలుగ దిగుమతి యగుచున్న భౌతికవాదములకు కొందరు భారతీయులు, అందునను, ముఖ్యముగ ఆంగ్ల విద్యాపారంగతులమని, నాగరికులమని, విర్రవీగువారు మన మాతృదేశమును కలవరపరచుచుండుట విచారకరము. భౌతిక శాస్త్రము లెంతగ వికాసము నందుచున్నను, త్వరితగతిని నూతనవిషయములను గని పెట్టుచునున్ననూ, అవి మనోబద్ధములే. అంత్య లక్ష్యములు మాత్రము గాజాలవు. నిత్య సత్యముగ వెలుగొందు భగవంతుని ప్రత్యక్ష మొనర్పజాలవు.

Proceedings of the Office of the Inspector General of Local Administration, Andhra Pradesh, Hyderabad-4

L. Dis. No. 78018-58 Date 12-9-58

Sub :- Books and publications - Approval of Navabharathi, a literary and cultural Telugu monthly for use in Local Boards, Commendation.

CIRCULAR

All the Panchayats in the state are informed that if they want for their libraries, the Telugu monthly Journal, Nava Bharathi, they may purchase it.

(True copy) (Sd) *Inspector General*

Proceedings of the Director of Public Libraries, Andhra Pradesh, Hyderabad

Rc. No. 405-M 4/58 Dated 2—7—58

Sub :- Books and publications - Journal entitled "Nava Bharathi"— commendation of-orders issued.

The following Journal is commended for use in all the libraries of schools, and public libraries in the State :-

Name :- "Nava Bharathi"

Name of the Editor and publisher : J. Radha Krishna Reddy

Price—Rs. 1-00

Copies can be had from

NAVA BHARATHI KARYALAYAM. Gandhinagaram, VIJAYAWADA-2.

(TrueCopy) (Sd) *Director of public Libraries*

Edited, Printed & Published by Sri J. Radhakrishna Reddy, Vijayawada-2.
Printed at Nava Bharathi Press, Vijayawada-2.